RNI.No. APTEL/2014/57702 ESTD: 1999 www.voodayam.com





# వుదయం

గుంటూరు 25-09-2026 శుక్రవారం | సంపుటి : 13 | సంచిక : 188 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Postal Regd. No. GTR/117/2025-27 | Follow us on





# ప్రజా సేవలో విశిష్ట ముద్ర

## తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్' పురస్కారం



**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (వుదయం)**
తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్ 2026' పురస్కారానికి ఎంపికయ్యారు. కేరళ రాష్ట్రానికి చెందిన దిగ్గజ రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం 'ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్' ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోని రైతాంగం, వెనుకబడిన వర్గాలు, నిరుపేదల సంక్షేమం కోసం రేవంత్‌రెడ్డి అందిస్తున్న దూరదృష్టితో కూడిన నాయకత్వాన్ని, ఆయన చేపట్టిన వినూత్న సంక్షేమ కార్యక్రమాలను గుర్తిస్తూ 'ఉత్తమ ప్రజా సేవకుడు' కేటగిరీలో ఈ అవార్డును ఖరారు చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ ఛైర్మన్, నిలంబూర్ శాసనసభ్యుడు ఆర్యదాన్ షౌకత్ వెల్లడించారు. పార్లమెంట్ సభ్యుడు బెన్నీ బెహనన్, కేరళ రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి ఎ.పి. అనిల్‌కుమార్, ప్రముఖ మేధావి కల్పేట్టా నారాయణన్‌లతో కూడిన కమిటీ ఈ పురస్కారానికి విజేతను ఎంపిక చేసింది. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో రేవంత్‌రెడ్డి చూపుతున్న నిబద్ధతను ఎంపిక కమిటీ ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రశంసించింది. ఆర్యదాన్ ముహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం (25వ తేదీన) నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో రేవంత్‌రెడ్డికి ఈ పురస్కారాన్ని ప్రధానం చేయనున్నారు. ఈ స్మారక వేడుకలలో భాగంగా పార్లమెంట్ సభ్యుడు కేసీ వేణుగోపాల్ స్మారక ఉపన్యాసం చేయనున్నారు.

# 'ఓటు చోరీ' చట్టాలు చెల్లవు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 (ఎంఎస్) :**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో విభేదాలు పొడసూపినట్లు వస్తున్న వార్తలపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అత్యంత ఘాటుగా స్పందించారు. ఈ సంస్థాగత గందరగోళానికి పూర్తి బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. ఢిల్లీ వేదికగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, అక్రమ మార్గాల్లో ఓట్ల చోరీకి పాల్పడి శాసనసభలకు, పార్లమెంటుకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఆమోదించిన ఏ చట్టమూ చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు. మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో చోటుచేసుకున్న ఓట్ల వ్యత్యాసాలు, అక్రమాలపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసిన అనంతరమే, సవరణ ప్రక్రియ తీరుపై మిగతా ఇద్దరు కమిషనర్లు కూడా ప్రధాన కమిషనర్ నిర్ణయాలను తప్పుపట్టినట్లు రాహుల్ వెల్లడించారు. దేశ ప్రజాస్వామ్య ప్రయోజనాలను పరిరక్షించే క్రమంలో జ్ఞానేశ్ కుమార్ అప్రూవర్‌గా మారి నిజాలను బయటపెట్టడమే శ్రేయస్కరమని హితవు పలికారు. ప్రస్తుత ప్రధాన కమిషనర్ నియామకం ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల సంయుక్త నిర్ణయంతోనే జరిగిందని గుర్తు చేస్తూ, ఇప్పుడు ఉత్పన్నమైన తీవ్ర పరిణామాలకు సదరు నియామకకర్తలే సంపూర్ణ బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.



## ఓటర్ల జాబితా సవరణపై నిరసన జ్వాలలు




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 (ఎంఎస్) :**
కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ అంశంపై స్పందించిన కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే స్పందించి 48 గంటల వ్యవధిలో తన పదవికి రాజీనామా చేయాలని స్పష్టమైన గడువు విధించారు. ఒకవేళ ఆయన వైదొలగని పక్షంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా రెండవ విడత భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, దేశవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఈ ప్రక్రియపై జాతీయ స్థాయిలో వార్తలు వెలువడి పెద్ద ఎత్తున వివాదం చెలరేగిన నేపథ్యంలో, దేశ రాజధానిలో విలేకరుల సమావేశం నిర్వహించిన సదరు పార్టీ ప్రతినిధులు త్వరలో వివిధ రాష్ట్రాల్లో జరగనున్న శాసనసభ ఎన్నికలన్నింటినీ తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రధాన ఎన్నికల కమిషనర్ ఒక ముప్పులా తయారయ్యారని, పౌరుల ప్రాథమిక ఓటు హక్కును రద్దు చేసే అధికారం ఆయనకు ఎవరిచ్చారని పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. ఎన్నికల నిర్వహణ విధానంలో తీవ్ర అవకతవకలు జరుగుతున్నాయనే అనుమానాలు ఉన్నప్పుడు ప్రతిపక్ష పార్టీలేవీ ఈ ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కాకూడదని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ సహ సంయోజకులు సౌరవ్ దాస్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ముందు తాము మూడు ప్రధాన డిమాండ్లను ఉంచుతున్నామని వెల్లడించారు. ప్రధాన కమిషనర్ తక్షణమే రాజీనామా చేయడంతో పాటు ఆయనపై నేరపూరిత చర్యలు ప్రారంభించాలని, ప్రస్తుత సవరణ ప్రక్రియను రద్దు చేసి 2025 నాటి ఓటర్ల జాబితానే ప్రామాణికంగా తీసుకోవాలని కోరారు. అలాగే ఈ ప్రక్రియకు సంబంధించిన సమగ్ర పత్రాలను, దస్త్రాలను అత్యున్నత న్యాయస్థానం నియమించే ప్రత్యేక కమిటీ ఆధీనంలో ఉంచాలని స్పష్టం చేశారు.

## మక్కా ప్రాంతంలో క్షిపణి దాడుల భయాలు

**రియాద్:** సౌదీ అరేబియా రాజ్యంలో అత్యంత పవిత్రమైన మక్కా నగరం మరియు దాని పరిసర ప్రాంతాల్లో క్షిపణి దాడులు జరిగే తీవ్రమైన ప్రమాదం ఉందంటూ పౌర రక్షణ శాఖ మరోసారి అధికారికంగా హెచ్చరికలు జారీ చేసింది. గత పది రోజుల వ్యవధిలోనే రెండోసారి ఇలాంటి విపత్తు సూచనలను సామాజిక మాధ్యమాల ద్వారా వెలువరించడంతో ప్రజల్లో తీవ్ర కలకలం రేగింది. పశ్చిమ తీర ప్రాంతాలైన యాన్బు, తాయెఫ్, జెడ్డా, తబూక్ ప్రాంతాలపై కూడా దాడులు జరిగే అవకాశం ఉందని భద్రతా వర్గాలు స్పష్టం చేశాయి.

## ఇంతే కదా...!



# ప్రజాస్వామ్య పరిరక్షణకు ఏకమవ్వాలి

### విపక్షాల అక్రమ కుమ్మక్కులో భాగమైన ఈసీ

### ఓట్ల తొలగింపుపై న్యాయపోరాటం



**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (వుదయం)**
ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు పొందిన భారతదేశంలో ప్రజాస్వామ్య సూత్రాలను పరిరక్షించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం స్వయంప్రతిపత్తిని కోల్పోయి ఏకపక్ష వైఖరితో వ్యవహరిస్తోందని భారత్ రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముగ్గురు సభ్యులుండే కమిషన్‌లో ఇద్దరు కమిషనర్లు నిరంతరం అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోవడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. మెజారిటీ అభిప్రాయానికే ప్రాధాన్యం ఇచ్చే ప్రజాస్వామ్య నిర్వచనాన్ని కూడా ఇప్పుడు మార్చేస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. ఓటర్ల నూతన నమోదు, తొలగింపులతో పాటు తొలగించిన ఓట్ల పునరుద్ధరణ ప్రక్రియలో తీవ్రమైన అనుమానాలకు తావిచ్చేలా నిర్ణయాలు వెలువడటం దేశంలో ప్రజాస్వామ్య మనుగడనే ప్రశ్నార్థకం చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే ప్రధాన వ్యవస్థల పునాదులు బలహీనపడుతున్న వేళ, రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, రాజ్యాంగ సంస్థలతో పాటు అత్యున్నత న్యాయస్థానం కూడా తక్షణమే జోక్యం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఓట్ల తొలగింపు ప్రక్రియను ప్రస్తావిస్తూ, గతంలో తమ పార్టీ విజయం సాధించిన నియోజకవర్గాల్లోనే అత్యధికంగా ఓట్లను తొలగించడం వెనుక ఉన్న కుట్ర స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'కేసీఆర్ వర్సెస్ అందరూ' అనే తరహాలో రాజకీయ పోరాటం సాగుతోందని, తమను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలు కుమ్మక్కయ్యాయని విమర్శించారు. ఇప్పుడు ఆ కుమ్మక్కు రాజకీయాల్లోకి ఎన్నికల సంఘం కూడా చేరుతుండటం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. చట్టవిరుద్ధంగా తొలగించిన ప్రతి ఓటును తిరిగి చేర్పించే వరకు న్యాయస్థానాల్లోనూ, ప్రజల్లోనూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## వికసిత భారత్ నిర్మాణంలో

# యువతదే కీలక పాత్రన్న ప్రధాని!

### 'నాగరిక్ దేవో భవ' సూత్రమే ప్రతి విధానానికి మూలం

### జన్మభూమి నుంచి కర్మభూమి వరకు సేవా నిబద్ధత

### అధికారం ఎంత వచ్చినా సేవా మార్గమే మా దారి



**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (వుదయం)**
భారతీయ జనతా పార్టీ పాలనకు, పార్టీ నైతిక విలువలకు సేవా భావమే ప్రధాన ఆత్మ అని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. రాజకీయంగా ఎంతటి అత్యున్నత అధికారం సిద్ధించినప్పటికీ తమ పార్టీ ఈ సేవా మార్గం నుంచి ఎప్పటికీ పక్కకు తప్పుకోదని తేల్చి చెప్పారు. తన 76వ జన్మదినం, అలాగే ప్రజాప్రతినిధిగా 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని గుజరాత్‌లోని వడ్ నగర్ నుంచి ఉత్తర ప్రదేశ్‌లోని వారాణాసి వరకు చేపట్టిన 'సేవా సంకల్ప్ యాత్ర' ప్రతినిధులతో ఆయన గురువారం దృశ్యమాధ్యమం (వీడియో కాన్ఫరెన్స్) ద్వారా ముచ్చటించారు. మధ్యప్రదేశ్‌లోని దేవాస్ జిల్లాకు చేరిన యాత్రికులను ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు.

**జాతి నిర్మాణమే ప్రధాన లక్ష్యం**
రాజకీయాలు, ఎన్నికలు, ప్రభుత్వ నిర్వహణకు వాటి స్వంత ప్రాధాన్యం ఉన్నప్పటికీ, తమ పార్టీ సంకల్పం మాత్రం నిరంతరం జాతి నిర్మాణం, దేశాభివృద్ధి చుట్టూనే తిరుగుతుందని ప్రధాని వ్యాఖ్యానించారు. పురాతన, ఆధ్యాత్మిక వైభవం కలిగిన వడ్ నగర్ తన జన్మభూమి అని, వారాణాసి తన కర్మభూమి అని గుర్తు చేసుకున్నారు. గుజరాత్ నుంచి ఢిల్లీ వరకు తమ పాలనా వ్యవస్థలో సేవా భావమే అంతర్లీనంగా ఉందన్నారు. పాలనలో సేవకు ప్రాముఖ్యత ఇచ్చినప్పుడు 'నాగరిక్ దేవో భవ' (పౌరుడే దేవుడు) అనే సంకల్పం ప్రతి ప్రభుత్వ విధానంలోనూ స్పష్టంగా ప్రతిబింబిస్తుందని వివరించారు.

**పదవులు తాత్కాలికం.. సేవ శాశ్వతం**
మన ప్రవర్తన, పనితీరు ప్రజలకు నమ్మకం కలిగించేలా ఉండాలని ప్రధాని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో ఏ స్థాయికి ఎదిగినా ప్రాథమిక కర్తవ్యం సేవేనని పునరుద్ఘాటించారు. "సేవా భావంతో చేసిన పనులనే ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారు, సేవ చేసే వారికే ప్రజల ఆశీస్సులు లభిస్తాయి. నా జీవితానికి ప్రజల ఆశీస్సులే అతిపెద్ద శక్తి మూలం. ప్రజల సేవ ద్వారా దేశానికి సేవ చేయడమే నా జీవిత మంత్రం" అని మోదీ పేర్కొన్నారు. పేదలు, మహిళలు, యువతులు, బాధితులు మరియు గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వెనుక ఈ సేవా దృక్పథమే ఉందన్నారు.

**2047 నాటికి 'వికసిత భారత్'**
2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంలో యువతదే కీలక పాత్ర అని ప్రధాని స్పష్టం చేశారు. నేటి యువత 'వికసిత భారత్' నిర్మాతలే కాకుండా, ఆ లక్ష్యం నెరవేరిన తర్వాత దాని ప్రధాన లబ్ధిదారులు కూడా అవుతారని చెప్పారు. "మాటల ద్వారా కాకుండా చేతల ద్వారా సేవా సందేశాన్ని సమాజానికి అందించాలి. 'సేవయే పరమో ధర్మః' అనే సూత్రంతో ముందుకు సాగాలి" అని యువతకు దిశానిర్దేశం చేశారు. భారతదేశ సామాజిక విలువల్లో ప్రయాణాలు, సేవా కార్యక్రమాలు భాగమని, తమ రాజకీయ జీవితంలో తాము కూడా అనేక యాత్రలు నిర్వహించామని గుర్తు చేసుకున్నారు.

**సప్తధార సంస్కరణలు - స్థానిక పరిజ్ఞానం**
యాత్రలో భాగంగా గ్రామీణ ప్రాంత ప్రజల సాంప్రదాయ పరిజ్ఞానం, సమస్యలకు వారు కనుగొనే పరిష్కారాల నుంచి నేర్చుకోవాలని ప్రధాని సూచించారు. భారతదేశ 'భిన్నత్వంలో ఏకత్వం' భావజాలాన్ని ప్రచారం చేయడంతో పాటు ఆగస్టు 15న తాను ప్రకటించిన 'శక్తికి సప్తధార' గురించి ప్రజలకు వివరించాలని కోరారు. తయారీ రంగం, వ్యవసాయఆహార ఉత్పత్తులు, సాంకేతికత, రక్షణ, హరిత ఆర్థిక వ్యవస్థ మరియు సాంస్కృతిక బలం అనే ఏడు రంగాల ఆధారంగా ఈ సంస్కరణల చట్రాన్ని రూపొందించినట్లు చెప్పారు.
ఈ సందర్భంగా యాత్రలో పాల్గొంటున్న ప్రతినిధులు తమ అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు. మధ్యప్రదేశ్‌లోని ఝాబువా జిల్లాలోని ఒక గ్రామానికి 'మోదీ ఫలియా' అని పేరు పెట్టారని, నేటి తరం యువత (జెన్ జీ) ప్రధాని విధానాలకు పూర్తి మద్దతు ఇస్తోందని వారు ఈ సందర్భంగా తెలియజేశారు.

# ఖైరతాబాద్ నా అడ్డా

## ఉప ఎన్నికల్లో గెలుపు మాదే




**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (వుదయం)**
ఎమ్మెల్యే పదవి అనర్హత వ్యవహారంలో అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పును శిరసావహిస్తున్నట్లు శాసనసభ్యుడు దానం నాగేందర్ తెలిపారు. ప్రజాక్షేత్రంలో తనకు పూర్తి ప్రజాదరణ ఉందని, న్యాయపోరాటం చేయడం రాజ్యాంగబద్ధమైన హక్కని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తాను దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ స్థానానికి పోటీ చేసిన సమయంలోనే ఇటువంటి పరిణామాలు ఊహించానని, రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం తనకు ఉపశమనం లభిస్తుందని ఆశించానని వివరించారు. చట్టపరమైన నిబంధనల ప్రకారం మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం సుప్రీంకోర్టు కల్పించిందని తెలిపారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ వెళ్లి సేవ చేశానని, తన పనితీరుపై ప్రజలే సమాధానం చెబుతారని నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. ఉప ఎన్నికల్లో పోటీ చేయడంపై ముఖ్యమంత్రి తగిన నిర్ణయం తీసుకుంటారని, ఈ ప్రాంతంపై తనకు పూర్తి పట్టు ఉందన్నారు. గతంలో ఈ నియోజకవర్గం నుంచి మూడుసార్లు విజయం సాధించానని, కేవలం ఒక్కసారి మాత్రమే స్వల్ప తేడాతో ఓటమి చెందానని గుర్తు చేశారు. ప్రస్తుతం నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు తమకు ఎంతో అనుకూలంగా ఉన్నాయని చెబుతూ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పునరావృతమైన ఫలితమే ఇక్కడ కూడా వస్తుందని, తామంతా కలిసికట్టుగా శ్రమించి విజయం సాధిస్తామని స్పష్టం చేశారు.

## ఇంధన వాణిజ్యమే యుద్ధానికి ఆజ్యం

**కీవ్:** నాలుగేళ్లకు పైగా సుదీర్ఘంగా సాగుతున్న రష్యా మరియు ఉక్రెయిన్ ఘర్షణలు ఇటీవలి కాలంలో మరింత తీవ్రరూపం దాల్చాయి. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి 81వ సర్వప్రతినిధి సభ సమావేశంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ ప్రసంగిస్తూ భారతీయులకు, విదేశీ పౌరులకు ఒక ముఖ్యమైన విజ్ఞప్తి చేశారు. రష్యా ప్రభుత్వం తీవ్రమైన మోసపూరిత కుతంత్రాలతో భారత్ సహా వివిధ దేశాల పౌరులను ఈ యుద్ధంలోకి బలవంతంగా లాగుతోందని ఆయన ఆరోపించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విదేశీ పౌరుల ప్రాణాలతో చెలగాటమాడేందుకు ఏమాత్రం అవకాశం ఇవ్వవద్దని ఆయా దేశాల ప్రతినిధులను కోరారు. ఘనా, నేపాల్, తజికిస్థాన్, భారత్, యెమెన్, కెన్యా, క్యూబా వంటి నలభై ఏడేళ్లకు పైగా దేశాల ప్రజలు రష్యా మాయమాటలకు బలై యుద్ధరంగంలో ప్రాణాలు కోల్పోవడాన్ని అందరూ గమనిస్తున్నారని, విదేశీ ప్రతినిధులు తమ పౌరులను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరోవైపు ఇరు దేశాలు పరస్పరం ఇంధన మౌలిక సదుపాయాలనే లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతుండటంతో, వీటిని తక్షణమే నిలిపివేయాలని అమెరికా తీవ్ర ఒత్తిడి తెస్తోంది. ఈ విషయంపై ఐక్యరాజ్యసమితి వేదికగా స్పందించిన జెలెన్స్కీ, రష్యాకు చెందిన చమురు లభ్యత వ్యవస్థలను నాశనం చేయడం తమ ఉద్దేశం కాదని, కేవలం శత్రు దేశపు ఆక్రమణలకు తోడ్పడే ఆదాయ వనరులను తుడిచిపెట్టడమే తమ వ్యూహమని స్పష్టం చేశారు. ఇదే సమయంలో భారత్, చైనా వంటి దేశాలు రష్యాతో నిరంతరం వాణిజ్య సంబంధాలను కొనసాగించడం వల్లే ఈ పోరాటం మరింత సుదీర్ఘంగా సాగుతోందని వ్యాఖ్యానించారు.




## అయిజ ఎంపీడీవోగా గడ్డం కృష్ణయ్య బాధ్యతల స్వీకరణ



**అయిజ, సెప్టెంబర్ 24(వుదయం ప్రతినిధి):**
జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా గడ్డం కృష్ణయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఆయన సిద్దిపేట జిల్లా కోహెడ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహించారు. బదిలీపై అయిజకు వచ్చిన గడ్డం కృష్ణయ్య గురువారం అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పెన్షన్



- **క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల గుర్తింపు.. అర్హత ఉన్న వారెవరూ సంక్షేమ పథకాలకు దూరం కాకుండా చర్యలు**

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 24 (వుదయం):**
గ్రామంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న చేయూత పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామ సర్పంచ్ ముచ్చుమర్రి అనురాధ రమేష్ తెలిపారు. ఇందులో భాగంగా పెన్షన్‌కు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, నేత కార్మికులు తదితర అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని సర్పంచ్ పేర్కొన్నారు. అర్హత ఉన్న ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కాకుండా, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తామని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆది బాలకృష్ణ, పాలక వర్గ సభ్యులు పాపగౌని ప్రవీణ్‌గౌడ్, కేంసారం నాగరాజు, ఎంక్వైరీ అధికారులు, ఐసీడీఎస్ దౌల్తాబాద్ సూపర్‌వైజర్ రేణుక, జూనియర్ అసిస్టెంట్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ సీటుతో గుర్జివాడకు గర్వకారణం

- **శ్రీజకు ఘన సన్మానం**
- **పట్టుదలతో నీట్‌లో ప్రతిభ.. వైద్య విద్యలోకి అడుగులు**
- **పాస్టర్ యేసు రత్నం కుమార్తెకు కౌన్సిలర్ సంపత్‌కుమార్ అభినందనలు**
- **గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్ష**

**కోహీర్, సెప్టెంబరు 24 (వుదయం ప్రతినిధి):**



కోహీర్ మండలం గుర్జివాడ గ్రామానికి చెందిన పాస్టర్ యేసు రత్నం కుమార్తె శ్రీజ ఎంబీబీఎస్ సీటు సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది.
చిన్ననాటి నుంచే చదువుపై ఆసక్తి పెంచుకున్న శ్రీజ పట్టుదలతో విద్యాభ్యాసాన్ని కొనసాగించింది. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ప్రైవేట్ పాఠశాలలో విద్యనభ్యసించింది. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు హైదరాబాద్‌లోని సీజీఈ నర్సింగి కళాశాలలో చదువుకుంది. వైద్య విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో నీట్ పరీక్షకు సిద్ధమైంది. 2024లో హైదరాబాద్‌లోని ఏబీబీ ఇన్‌స్టిట్యూట్‌లో నీట్ కోచింగ్ తీసుకుంది. నిరంతర సాధన, కృషితో నీట్‌లో ప్రతిభ కనబరిచి 2025లో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ప్రస్తుతం వైద్య విద్యకు సంబంధించిన కోచింగ్‌ను కొనసాగిస్తూ తన లక్ష్యం వైపు ముందుకు సాగుతోంది.
శ్రీజ సాధించిన విజయాన్ని తెలుసుకున్న కోహీర్ మున్సిపల్ కౌన్సిలర్ ఎన్. సంపత్‌కుమార్ ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీజను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సంపత్‌కుమార్ అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు శ్రీజ విజయం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వైద్య విద్యలోనూ శ్రీజ మరింత రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. భవిష్యత్తులో ప్రజలకు సేవ చేసే మంచి వైద్యురాలిగా ఎదగాలని కోరారు. శ్రీజ ఎంబీబీఎస్ సీటు సాధించడంపై గుర్జివాడ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు, బంధువులు ఆమెను అభినందించారు. శ్రీజ సాధించిన విజయం గ్రామంలోని విద్యార్థుల్లోనూ నూతన ఉత్సాహాన్ని నింపింది. చదువుతో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని ఆమె నిరూపించిందని పలువురు పేర్కొన్నారు. వైద్య విద్యలో విజయవంతంగా రాణించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## బీరం హర్షవర్ధన్‌రెడ్డిని పరామర్శించిన కొప్పునూరు బీఆర్ఎస్ నాయకులు

- **బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు**

**చిన్నంబావి మండలం 24 వుదయం రిపోర్టర్**



పితృవియోగంతో బాధలో ఉన్న కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని కొప్పునూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు. ఈ సందర్భంగా సింగోటం గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీ.శే. బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ తగరం లక్ష్మి కురుమయ్య, డైరెక్టర్ దేగ శేఖర్, సీనియర్ నాయకులు మహేశ్వర్‌రెడ్డితో పాటు కొప్పునూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. బీరం లక్ష్మారెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. "లక్ష్మారెడ్డి సేవలు చిరస్మరణీయం" బీరం లక్ష్మారెడ్డి మృతి కుటుంబానికే కాకుండా ఆయనతో అనుబంధం ఉన్న వారందరికీ తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షురాలు తగరం లక్ష్మి కురుమయ్య, మండల సీనియర్ నాయకులు వులు పాల మహేశ్వర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కురుమయ్య, సొసైటీ మెంబర్ దేగ శేఖర్ యాదవ్, వార్డు మెంబర్లు బిజనములో జగదీష్, బడికల సత్తి, కొట్టే స్వాములు, డ్రైవర్ కురుమయ్య, గుడిసె కురుమయ్య, బోర్గా ఆంజనేయులు, ఉదయ్ కుమార్, బూర్గుల బాలు, మధు, పసుల రాజు, బూరుగుల సురేష్, బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కబడ్డీ క్రీడలో కోహీర్ కీర్తి.. రాష్ట్ర జట్టులోకి అర్చన

- **అండర్–19 రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు వెంకటాపూర్ విద్యార్థిని ఎంపిక**
- **కొండాపూర్ ఎంపిక పోటీల్లో అద్భుత ప్రతిభ**
- **కష్టపడి సాధన చేసి రాష్ట్రస్థాయికి ఎదిగిన అర్చన**
- **కుటుంబ సభ్యులు, గ్రామస్థుల అభినందనలు**

**కోహీర్, సెప్టెంబరు 24 (వుదయం ప్రతినిధి):**



కోహీర్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని అర్చన కబడ్డీ క్రీడలో సత్తా చాటి అండర్-19 రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైంది.
కొండాపూర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో అర్చన ప్రతిభ కనబరిచి జట్టులో చోటు సంపాదించింది.
చిన్ననాటి నుంచే కబడ్డీపై ఆసక్తి పెంచుకున్న అర్చన క్రమం తప్పకుండా సాధన చేస్తూ క్రీడలో తన ప్రతిభను మెరుగుపరుచుకుంది. పోటీల్లో ప్రత్యర్థులను సమర్థంగా ఎదుర్కొంటూ అద్భుతమైన ఆట తీరును ప్రదర్శించడంతో రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. అర్చనకు పీఈటీ ప్రదీప్ ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ అందిస్తూ కబడ్డీలో మెళకువలు నేర్పించారు. మెరుగైన శిక్షణతో పాటు అర్చన పట్టుదల, నిరంతర సాధన ఆమెను రాష్ట్రస్థాయికి చేర్చాయని పీఈటీ ప్రదీప్ తెలిపారు. అర్చన తండ్రి మల్లేశం జీఎంఆర్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన అర్చన క్రీడారంగంలో సాధించిన ఈ విజయం పట్ల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. అర్చన రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడంతో వెంకటాపూర్ గ్రామంలో హర్షం వ్యక్తమైంది. గ్రామస్థులు ఆమెను అభినందిస్తూ ఘనంగా సత్కరించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో ప్రతిభకు ప్రోత్సాహం అందిస్తే గ్రామీణ ప్రాంతాల నుంచి మరింత మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగే అవకాశం ఉందని పలువురు పేర్కొన్నారు. అర్చన ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో అర్చన అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కోహీర్ మండలానికి, సంగారెడ్డి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పలువురు కోరారు.

## నూతన చేయూత పింఛన్ దరఖాస్తుల పరిశీలన

- **పైడిగుమ్మల్‌లో పింఛన్ లబ్ధిదారుల వెరిఫికేషన్**
- **ఇళ్ల వద్దే అర్హతలు, కుటుంబ పరిస్థితుల పరిశీలన**
- **వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్న అధికారులు**

**కోహీర్, సెప్టెంబరు 24 (వుదయం ప్రతినిధి):**



కోహీర్ మండలం పైడిగుమ్మల్ గ్రామంలో పింఛన్ లబ్ధిదారుల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. ఎంపీడీవో ఉమాదేవి ఆధ్వర్యంలో ఏఓ నవీన్‌కుమార్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి క్షేత్రస్థాయిలో వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నూతన చేయూత పింఛన్ దరఖాస్తుదారుల నివాస స్థలం, కుటుంబ పరిస్థితులు, సామాజిక, ఆర్థిక స్థితిగతులు, పింఛన్‌కు సంబంధించిన అర్హతలను అధికారులు పరిశీలించారు. దరఖాస్తుదారుల నుంచి అవసరమైన సమాచారాన్ని సేకరించి, సంబంధిత వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**ఇళ్ల వద్దే సమగ్ర పరిశీలన**
వెరిఫికేషన్‌లో భాగంగా దరఖాస్తుదారుల వాస్తవ పరిస్థితులను నేరుగా వారి ఇళ్ల వద్ద పరిశీలించారు. కుటుంబ సభ్యుల వివరాలు, జీవన పరిస్థితులు, పింఛన్‌కు సంబంధించిన అర్హతలను క్షేత్రస్థాయిలో నిర్ధారించి నమోదు చేశారు.

**పారదర్శకతకు ప్రాధాన్యం**
పింఛన్ పథకాల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పింఛన్ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహులు, వార్డు సభ్యుడు కొత్తూర్ మోహన్‌తో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొని దరఖాస్తుదారుల వివరాల సేకరణలో సహకరించారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా క్షేత్రస్థాయి పరిశీలన కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.



## అర్హులందరికీ పారదర్శకంగా ఆసరా పెన్షన్లు ఏవో మల్లేశం

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 24, వుదయం:**
రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా ఆసరా పెన్షన్లు అందించేందుకు కృషి చేస్తోందని మిరుదొడ్డి ఏవో మల్లేశం తెలిపారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో నూతన పెన్షన్ల కోసం వచ్చిన దరఖాస్తులను గురువారం ఆయన ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఆసరా పెన్షన్ అందిస్తుందని వెల్లడించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను పునఃపరిశీలన చేసి ప్రభుత్వానికి నివేదిక పంపడం జరుగుతుందన్నారు. త్వరలోనే అర్హులైన వారికి పెన్షన్లు మంజూరై అందుతాయని, ప్రభుత్వం వారికి ఆసరాగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్, చైర్ పర్సన్ సంగీతరవీందర్

### వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన

**దుబ్బాక, సెప్టెంబర్ 24, వుదయం:**
దుబ్బాక పట్టణంలో వాడవాడలా కొలువైన గణనాథులు నవరాత్రులు పూర్తి చేసుకోవడంతో గంగమ్మ ఒడికి చేరుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో నిమజ్జన ప్రాంతంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్, చైర్ పర్సన్ సంగీతరవీందర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టి వినాయకులను ఏర్పాటు చేసే దిశగా ప్రజలను ప్రోత్సహించినట్లు తెలిపారు. నిమజ్జన సమయంలో భక్తులు చిన్నారులను చెరువుల వద్దకు తీసుకురావద్దని సూచించారు. నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగేలా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అయితే నిమజ్జన ప్రదేశంలో నేటికీ చెత్తా చెదారంతో నిండి ఉండటంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని గణనాథుల నిమజ్జనాలు పూర్తయినప్పటికీ అధికారులు నామమాత్రంగా పరిశీలనకే పరిమితమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బండి శ్రీలేఖ, చాంద్ మియా తదితరులు పాల్గొన్నారు.



## వేంకటాచల దివ్యక్షేత్రంలో రేపు 'శ్రీ అనంత పద్మనాభ వ్రత మహోత్సవం'

- **అద్భుత వేంకటేశ్వర సన్నిధిలో భక్తులచే సామూహిక పూజలు, లక్షవత్తుల దీపోత్సవం**
- **సదాశివపేటతో పాటు పరిసర గ్రామాల భక్తులకు ఆలయ కమిటీ ఆహ్వానం**

**సదాశివపేట సెప్టెంబర్ 24 (వుదమం):**
స్థానిక శ్రీ వేంకటాచల దివ్యక్షేత్రంలోని అద్భుత వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో పవిత్ర అనంత చతుర్దశిని పురస్కరించుకుని రేపు (25 092026, శుక్రవారం) 'శ్రీ అనంత పద్మనాభ వ్రత మహోత్సవం' అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చక మరియు కమిటీ బృందం వెల్లడించింది. శుక్రవారం ఉదయం 09:00 గంటల నుండి ఆలయంలో విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు.



**కార్యక్రమ వివరాలు:**
ఉదయం 09:00 గంటలకు: స్వామి వారికి శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, దివ్య మంగళ అలంకరణ.
సామూహిక పూజలు: భక్తులందరి చేత ఏకకాలంలో సా[illegible] అర్చన, దేదీప్యమానంగా లక్షవత్తుల పూజ. నైవేద్య సమర్పణ: స్వామి వారికి ప్రీతిపాత్రమైన 14 రకాల పిండివంటలతో 'చతుర్దశ ప్రసాద నివేదన'.
హారతి & ఆశీర్వచనం: మహా మంగళహారతి, వేద పండితులచే మహా ఆశీర్వచనం మరియు తీర్థ ప్రసాద వితరణ.
సదాశివపేట పరిసర గ్రామాల ప్రజలకు విజ్ఞప్తి: సకల పాపహరణం, అనంత పుణ్యఫలాన్ని ప్రసాదించే ఈ దివ్య వ్రత మహోత్సవానికి సదాశివపేట పట్టణంతో పాటు నందికంది, కొల్కూర్, ఆరూర్, మద్దికుంట, కోనాపూర్ తదితర చుట్టుపక్కల గ్రామాల భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి, సామూహిక పూజలలో పాల్గొని శ్రీవారి కృపాకటాక్షాలు పొందగలరని ఆలయ నిర్వాహక వర్గం విజ్ఞప్తి చేసింది.
వేదిక: శ్రీ వేంకటాచల దివ్యక్షేత్రం, వేంకటాపూర్ సమయం: ఉదయం 09:00 గంటల నుండి నిర్వాహకులు: ఆలయ అర్చక మరియు కమిటీ బృందం, వేంకటాపూర్

హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం

## నూతన ఎంపీడీఓను మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులు

**కోహెడ సెప్టెంబర్ 24 (వుదయం ప్రతినిధి)**



కోహెడ మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ మైహిపాల్ రెడ్డిని బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి, గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం అధ్యక్షులు నాగు అజయ్, బీజేవైఎం వైస్ ప్రెసిడెంట్ అఖిల్ రెడ్డి, సీనియర్ బీజేపీ నాయకులు, రాంచంద్రపూర్ వార్డు సభ్యులు కక్కెర్ల దామోదర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. నూతన ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన మైహిపాల్ రెడ్డికి వారు అభినందనలు తెలియజేసి, మండల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

## మహిళల సమగ్ర అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్

- **మిరుదొడ్డి మండల సమైక్య ఆధ్వర్యంలో శిక్షణ**

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 24, వుదయం:**
మహిళలు జీవనోపాధి, సామాజిక, ఆర్థిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించేలా గ్రామస్థాయిలో విజన్ డాక్యుమెంట్ రూపొందించేందుకు మిరుదొడ్డి మండల సమైక్య ఆధ్వర్యంలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల సమైక్య కోశాధికారి అరుణ, కార్యదర్శి నవనీత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.
ప్రతి సభ్యురాలు, సంఘం, గ్రామం వారీగా భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించడమే విజన్ డాక్యుమెంట్ ముఖ్య ఉద్దేశమని శిక్షణలో వివరించారు. మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు స్థిరమైన జీవనోపాధి అవకాశాలు, ఆర్థిక స్వావలంబన, సామాజిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి అధ్యక్షురాలు, వీవోఏలకు ప్రత్యేకంగా శిక్షణ అందించారు. రాష్ట్ర స్థాయి నుంచి వచ్చిన ఎస్‌ఆర్‌పీలు మహిళా సంఘాల ప్రతినిధులకు విజన్ డాక్యుమెంట్ తయారీ విధానం, గ్రామస్థాయిలో అవసరాలను గుర్తించడం, ప్రాధాన్యతా అంశాలను ఎంపిక చేసుకోవడం, లక్ష్యాలను నిర్దేశించుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.



ఈ సందర్భంగా గ్రామంలోని మహిళల అవసరాలు, అందుబాటులో ఉన్న వనరులు, ఉపాధి అవకాశాలు, ఆర్థిక పరిస్థితులు, సామాజిక అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సభ్యురాలి స్థాయి నుంచి సంఘం, గ్రామ స్థాయి వరకు సమగ్ర ప్రణాళిక రూపొందించడం ద్వారా మహిళల సాధికారతకు మరింత దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల అధ్యక్షురాళ్లు, వీవోఏలు పాల్గొన్నారు. సీసీలు వైకుంఠం, బాలరాజు, ప్రభాకర్, జ్యోతి, వరలక్ష్మి, ఈశ్వరమ్మ, అకౌంటెంట్ శారద, ఆపరేటర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రోస్టర్ విధానాన్ని రద్దు చేయాలి మిరుదొడ్డిలో మాల మహానాడు డిమాండ్

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 24, వుదయం:**
రోస్టర్ విధానం వల్ల మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ, రోస్టర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మిరుదొడ్డిలో మాల మహానాడు నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. మిరుదొడ్డి అంబేద్కర్ విగ్రహం వద్ద వచ్చే నెల 10వ తేదీన హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో జరపతలపెట్టిన "మాల విద్యార్థి గర్జన" కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రోస్టర్ వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షురాలు గీతాంజలి, జనరల్ సెక్రెటరీ రాజు, ఎస్సీ ఎస్టీ జిల్లా అధ్యక్షుడు రమేష్ నాస్తిక్, ఎంఎన్ఎస్ జిల్లా సభ్యులు శేఖర్, మిరుదొడ్డి మాల మహానాడు నాయకులు మంకయ్య, మల్లయ్య, స్వామి, నర్సింలు, రోశయ్య, కుమార్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

- **ఐజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమం**
- **రక్త గ్రూపు, హిమోగ్లోబిన్‌తో పాటు కంటి, దంత సమస్యలకు పరీక్షలు**

**అయిజ, సెప్టెంబర్ 24 (వుదయం ప్రతినిధి)**
జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమంలో భాగంగా గురువారం అయిజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రక్త గ్రూపు, హిమోగ్లోబిన్ శాతం పరీక్షలు నిర్వహించడంతోపాటు కంటి సంబంధిత సమస్యలు, దంత సమస్యలను పరీక్షించారు. బాలికలకు రుతుస్రావ సంబంధిత సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స, ఆరోగ్య సూచనలు అందించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధవిద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ముందుగానే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించడమే ఆరోగ్య పాఠశాల కార్యక్రమం లక్ష్యమని వైద్య సిబ్బంది తెలిపారు. విద్యార్థులు ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు.
ఈ కార్యక్రమం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించగా పీహెచ్‌సీ సిబ్బంది, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.




## మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలు



- **"నాకోసం కాదు.. మన కోసం" అనే నినాదంతో సమాజ సేవలో యువత భాగస్వామ్యం కావాలి**

**మల్దకల్, సెప్టెంబర్ 24 (వుదయం కరస్పాండెంట్)**
మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లు కళాశాల ఆవరణలో శ్రమదానం చేపట్టారు. ముళ్లపొదలు, చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు.
అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల విశిష్టతను ప్రోగ్రాం అధికారి రామాంజనేయులు గౌడ్ విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత మాట్లాడుతూ యువతలో సమాజ సేవా భావాన్ని పెంపొందించేందుకు 1969 సెప్టెంబర్ 24న ఎన్ఎస్ఎస్‌ను ప్రారంభించారని తెలిపారు. "నాకోసం కాదు.. మన కోసం" అనే నినాదంతో ఎన్ఎస్ఎస్ పనిచేస్తుందని, సమాజ సేవ ద్వారా యువతలో నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్‌లో భాగంగా నిరంతర కార్యక్రమాలతో పాటు ప్రత్యేక శీతాకాల శిబిరాలను నిర్వహించి గ్రామీణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు, బాల కార్మిక వ్యవస్థ, వివిధ వ్యాధులు, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొని సమాజ సేవలో భాగస్వాములు కావాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే విద్యార్థులకు జాతీయ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని, ఉన్నత విద్యలో ప్రభుత్వం కల్పిస్తున్న ప్రత్యేక అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ, సాంస్కృతిక, సామాజిక బాధ్యతా లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారులు కళాశాల ప్రిన్సిపాల్, చైర్మన్‌లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ప్రోగ్రాం అధికారి నరసింహులు, అధ్యాపకులు భాగ్యలక్ష్మి, గోవర్ధన్ శెట్టి, మాధురి, శ్రీకాంత్, సుధాకర్, రాఘవేంద్ర, ఈస్తికర్, కమల హాసన్, సిబ్బంది హనుమంతు, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగా కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరాలని ఆదేశం



## విధుల్లో చేరని 81 మంది ఉపాధ్యాయులపై సమీక్ష: అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్ , సెప్టెంబర్ 24 (వుదయం)**

కొత్తగా కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరని 81 మంది ఉపాధ్యాయులు వెంటనే తమకు కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్ సూచించారు. ఈ మేరకు గురువారం ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, విధుల్లో చేరని ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్తగా పోస్టింగ్ పొందిన స్థానాల్లో విధుల్లో చేరని ఉపాధ్యాయులను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంటనే రిలీవ్ చేసి, వారు తమకు కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరేలా చూడాలని సూచించారు. ఉపాధ్యాయుల రిలీవింగ్, జాయినింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని, కొత్తగా కేటాయించిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు వెంటనే విధుల్లో చేరేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

# 50 ఏళ్లుగా మట్టి వినాయకుడి ప్రతిష్ఠాపన

## నింబోలి అడ్డ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా ఉత్సవాలు



**ముషీరాబాద్, సెప్టెంబర్ 24(వుదయం)**

నింబోలి అడ్డ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గత 50 ఏళ్లుగా సంప్రదాయాన్ని కొనసాగిస్తూ మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు కేసరి నర్సింగ్ రావు యాదవ్ తెలిపారు. 11 రోజుల పాటు గణనాథుడికి నిత్య పూజలు, ప్రత్యేక కార్యక్రమాలను అసోసియేషన్ సభ్యులు నిష్ఠతో నిర్వహించారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని సభ్యులు ఆకాంక్షించారు. ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని భవిష్యత్ తరాలకు కూడా కొనసాగిస్తామని తెలిపారు. ప్రతి ఏడాది ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలకు అసోసియేషన్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్. రమేష్, అనిల్, మహేష్, సురేష్‌తో పాటు అసోసియేషన్ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత కాలనీలో మందుబాబుల రచ్చ



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 24(వుదయం)**


నగర పరిధిలోని యాప్రాల్ సిబిఆర్ కృష్ణవేణి ఎస్టేట్స్ నివాస ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా వెలిసిన ఒక టీ దుకాణాన్ని తక్షణమే తొలగించాలని కోరుతూ ఏకంగా ఆరుసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, స్థానిక రక్షక భట నిలయ సిబ్బంది కనీసం స్పందించకపోవడంతో కాలనీ నివాసులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. నివాస సమూహాల మధ్య వెలిసిన ఈ దుకాణం కారణంగా ప్రశాంతంగా ఉండాల్సిన ప్రాంతం ఆకతాయిలు, మందుబాబుల అడ్డాగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద పెద్ద వాహనాల్లో ఆకతాయిలు ఇక్కడికి చేరుకుని మద్యం, పొగతాగడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని వాపోతున్నారు.

ఈ దుకాణ నిర్వాహకుల తీరుతో రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపివేయడమే కాకుండా, ఇళ్ల ముందే బహిరంగ మూత్ర విసర్జనకు పాల్పడుతుండటంతో స్త్రీలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా యువత గుమిగూడి చేసే హంగామాతో ఆ దారిన నడవాలంటేనే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆకతాయిల ఆగడాల భయంతో వృద్ధులు, మహిళలు ఉదయపు, సాయంత్రపు నడకలను పూర్తిగా మానేశారని, పిల్లలు కూడా బయట ఆడుకోవడానికి వెళ్లకుండా ఇళ్లకే పరిమితమయ్యారని స్థానికులు పేర్కొన్నారు. ప్రజా విన్నపాల కార్యక్రమంలోనూ, పోలీసు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించినా ఎవరూ పట్టించుకోవడం లేదని, రేపు ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే దానికి బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు. రోడ్లపై పారవేస్తున్న మద్యం సీసాలు, దుర్గంధంతో పచ్చని కాలనీ ప్రతిష్ఠ మసకబారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఈ దుకాణాన్ని తొలగించి కాలనీ వాసులకు ప్రశాంత వాతావరణాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


SRI CBR KRISHNAVENI ESTATES
RESIDENTIAL WELFARE ASSOCIATION

# అంతర్జాతీయ సదస్సుకు డాక్టర్ సామ రవీందర్ రెడ్డికి ఆహ్వానం

## మొగిలిగిద్దకు చెందిన అధ్యాపకుడి పరిశోధనా పత్రానికి అంతర్జాతీయ వేదికపై అవకాశం



**షాద్‌నగర్, సెప్టెంబర్ 24(వుదయం)**

ప్రాంతానికి చెందిన డాక్టర్ సామ రవీందర్ రెడ్డికి అంతర్జాతీయ సదస్సులో పాల్గొనే అవకాశం లభించింది. తమిళనాడు రాష్ట్రం తిరుచెంగోడ్‌లోని సేలం పెరియార్ యూనివర్సిటీ అనుబంధ కే.ఎస్. రంగస్వామి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ నెల 30న నిర్వహించనున్న అంతర్జాతీయ విద్యా సదస్సులో ఆయన పరిశోధనా పత్రం ప్రజెంటేషన్‌కు ఎంపికైంది.

"డిజిటల్ యుగంలో మానవ మూలధనం - భవిష్యత్ ఉపాధి అవకాశాలపై అధ్యయనం" అనే అంశంపై డాక్టర్ సామ రవీందర్ రెడ్డి రూపొందించిన పరిశోధనా పత్రాన్ని సదస్సులో ప్రదర్శించనున్నారు. డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్ వంటి ఆధునిక పరిణామాల నేపథ్యంలో మానవ మూలధనం, నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ ఉపాధి అవకాశాలపై ఆయన పరిశోధన సాగింది. డిజిటల్ యుగంలో ఉద్యోగ రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులు, కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్, డిజిటల్ నైపుణ్యాలు, నైపుణ్య పునరాభివృద్ధి, జీవితాంతం అభ్యాసం వంటి అంశాలతో పాటు భవిష్యత్ ఉద్యోగ మార్కెట్‌లో మానవ నైపుణ్యాల ప్రాధాన్యతను పరిశోధనా పత్రంలో విశ్లేషించారు. సాంకేతిక అభివృద్ధి కారణంగా కొన్ని సాంప్రదాయ ఉద్యోగాల స్వభావం మారుతున్నప్పటికీ, అదే సమయంలో కొత్త ఉద్యోగాలు, కొత్త నైపుణ్యాలు, కొత్త ఉపాధి అవకాశాలు కూడా ఏర్పడుతున్నాయని వివరించారు. భవిష్యత్ ఉద్యోగ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, కమ్యూనికేషన్, సమస్య పరిష్కార సామర్థ్యం, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పనిచేసే నైపుణ్యాలు కీలకంగా మారనున్నాయని పరిశోధనా పత్రంలో వివరించనున్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో వివిధ దేశాలకు చెందిన అధ్యాపకులతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల అధ్యాపకులు తమ పరిశోధనా అంశాలను ప్రజెంట్ చేయనున్నారు. ఈ నేపథ్యంలో డాక్టర్ సామ రవీందర్ రెడ్డికి అంతర్జాతీయ వేదికపై పరిశోధనా పత్రాన్ని సమర్పించే అవకాశం లభించడం పట్ల పలువురు విద్యావేత్తలు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు. రాజేంద్రనగర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు డాక్టర్ సామ రవీందర్ రెడ్డిని అభినందించారు. ఉన్నత విద్యా రంగంలో పరిశోధనకు, అంతర్జాతీయ వేదికలపై కళాశాల ప్రాతినిధ్యానికి ఈ అవకాశం ఎంతో ఉపయోగకరమని ఆమె పేర్కొన్నారు. మొగిలిగిద్దకు చెందిన డాక్టర్ సామ రవీందర్ రెడ్డి బోధనతో పాటు ఆర్థిక, సామాజిక అంశాలపై పరిశోధన, అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తెలంగాణకు చెందిన అధ్యాపకుడిగా పలు పరిశోధనా పత్రాలను సమర్పించడం ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు షాద్‌నగర్ ప్రాంతానికి కూడా గర్వకారణంగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు.

# మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమతి లేకుండా డి జె నిర్వహణ

## – డి జె యాంప్లిఫైయర్ మరియు ఎక్యూప్మెంట్ స్వాధీనం

**మేడిపల్లి వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 24 :**



మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని P&T కాలనీలో బుధవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో, మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న కమ్మాన్ రోడ్డులో అనుమతి లేకుండా డి జె సౌండ్ సిస్టమ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడ ఉన్న వ్యక్తిని ఆపి, డి జె నిర్వహణకు సంబంధించిన అనుమతి గురించి విచారించారు. అనుమతి లేకుండా డి జె నిర్వహిస్తున్న వ్యక్తి ప్రవీణ్ కుమార్ గా గుర్తించారు. సదరు వ్యక్తి పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తూ, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించాడు. అనంతరం ఆ వ్యక్తి పై మేడిపల్లి పోలీసులు కేసు నమోదు అనుమతి లేకుండా వినియోగిస్తున్న డి జె యాంప్లిఫైయర్ మరియు ఎక్విప్మెంట్ ను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టడం జరిగిందని మేడిపల్లి సీఐ డి. జలేందర్ రెడ్డి తెలిపారు.

# ఘనంగా బిఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ జన్మదిన వేడుకలు



**బాచుపల్లి, సెప్టెంబర్ 24,(వుదయం ప్రతినిధి ) :**

నిజాంపేట్ సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వాకలపూడి రంగరాయ ప్రసాద్ జన్మదిన వేడుకలు నిజాంపేట్ హిల్ కౌంటీలోని వారి నివాసంలో బాచుపల్లి లోని రేణుక ఎల్లమ్మ దేవాలయ ప్రాంగణంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మిత్రుల సమక్షంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పీ విప్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేష్ ముదిరాజ్, ఎన్ఎంసి మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై రంగరాయ ప్రసాద్ ని శాలువాతో సత్కరించి కేక్ కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసి మాజీ కార్పొరేటర్లు, దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు, నియోజకవర్గం మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మిత్రులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శుభ కార్య వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



వట్టిపల్లి, సెప్టెంబర్ 24( వుదయం ప్రతినిధి):రాయికోడ్ మండలం మామిడిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సలీం కుమారుడి శుభ కార్య వేడుక వట్టిపల్లి మండలంలోని హుసేన్ నగర్ గ్రామ శివారులోని దర్గా వద్ద గురువారం జరిగింది. ఈ వేడుకకు అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, మామిడిపల్లి గ్రామ సర్పంచ్ మహబూబ్ హాజరై దర్గా ను దర్శంచుకుని వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సలీం కుమారుడిని ఆశీర్వదించి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. కార్యక్రమం లో మామిడిపల్లి గ్రామ సర్పంచ్ మహబూబ్ , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 1 నుంచి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్



**సిద్దిపేట, సెప్టెంబర్ 24 (వుదయం బ్యూరో) :**

రాబోయే వానాకాలం (2026-27) పంట కాలానికి సంబంధించిన వరి ధాన్యం కొనుగోళ్లకు గాను అక్టోబర్ 1వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ వెల్లడించారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో పౌరసరఫరాలు, సహకార, మార్కెటింగ్, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖల అధికారులతో కొనుగోళ్ల సన్నాహకాలపై ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, నీడ నివాసాలు, కూర్చునే సదుపాయం వంటి కనీస వసతులు కల్పించాలని ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ నాణ్యతా ప్రమాణాల ప్రకారం ధాన్యం స్వీకరించాలని, సన్నరకం వరి ధాన్యం కోసం ప్రత్యేక కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తేవాలని సూచించారు.

# అంగరంగ వైభవంగా నిజాంపేట్ వినాయక నిమజ్జనం



**నిజాంపేట్, సెప్టెంబర్ 24 (వుదయం ప్రతినిధి )**

నిజాంపేట్ గ్రామ పంచాయతీ వినాయక యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని శోభ యాత్ర నిమర్జనం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లడ్డు వేలం పాటలో 276 ప్రగతి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి) రూ.5,31,000/ లకు అమూల్యమైన వినాయక లడ్డును గెలుచుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో లీడర్ కొలన్ నరసింహారెడ్డి, 276 డివిజన్ ప్రగతి నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి, బండారి లేఔట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వరగాని వాసు, శ్రీ వినాయక యూత్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, నిజాంపేట్ గ్రామ పెద్దలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# రాయసముద్రం చెరువులో గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలించిన

## సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. శ్రీ రమేష్



రామచంద్రాపురం: సెప్టెంబర్ 24 (వుదయం) రామచంద్రాపురం పరిధిలోని రాయసముద్రం చెరువును సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. శ్రీ రమేష్, ఐపీఎస్ గురువారం సందర్శించి గణేష్ విగ్రహాల నిమజ్జనానికి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేపట్టిన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్, వాహనాల రాకపోకల నియంత్రణ, నిమజ్జన ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.

భక్తులు పోలీసుల సూచనలు పాటిస్తూ నిర్దేశించిన మార్గాల్లోనే ప్రయాణించాలని, బారికేడ్లు దాటి ముందుకు వెళ్లకూడదని, చెరువులోకి వెళ్లి ప్రమాదకరంగా నిమజ్జనం చేయవద్దని సూచించారు. పిల్లలు, మహిళలు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. భారీ విగ్రహాల నిమజ్జనం సమయంలో క్రేన్లు, ఇతర పరికరాల వద్ద ప్రజలు గుమికూడకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి డీసీపీ CH శ్రీనివాస్, ఐపీఎస్, ఆర్‌సీ పురం డివిజన్ ఏసీపీ CH.Y. శ్రీనివాస్ కుమార్, ఆర్‌సీ పురం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ G. లాలు నాయక్, అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ M. ప్రవీణ్ రెడ్డి, చందానగర్ ఇన్‌స్పెక్టర్ A. శ్రీధర్ కుమార్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేత

**దుండిగల్, సెప్టెంబర్ 24, (వుదయం ప్రతినిధి ) :**



దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట్ నివాసులు కీ.శే. మునిగాల మమత ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి మామ మునిగాల శ్రీనివాస్ కుటుంబ సభ్యులు బౌరంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 500 మంది విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, స్టీల్ వాటర్ బాటిల్స్ ను కుటుంబ సభ్యులు పంపిణీ చేశారు. విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండి, ఆరోగ్యానికి మేలు చేసే స్టీల్ వాడకాన్ని అలవాటు చేసుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. రాంరెడ్డి మునిగాల కుటుంబ సభ్యులను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో స బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పల్పునూరి విష్ణువర్ధన్ రెడ్డి, రవీందర్, కుటుంబ సభ్యులు హరిహారన్, వైష్ణవి, సప్తగిరి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# భూమి వివాదం, అప్పుల భారంతో రైతు ఆత్మహత్య



**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 24 (వుదయం ప్రతినిధి) :**

భూమి వివాదం తలెత్తడంతో పాటు బ్యాంకులో చేసిన అప్పుల భారం పెరిగిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువ రైతు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జగదేవ్‌పూర్ మండల పరిధిలోని పలుగడ్డ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం పలుగడ్డ గ్రామానికి చెందిన లోకుల సాయిరాం (30) కుటుంబానికి సంబంధించిన భూమి విషయంలో గత కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో సదరు భూమిని తన పేరిట తిరిగి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు సాయిరాం బ్యాంకు నుంచి రుణం తీసుకుని, ఒక వ్యక్తికి చెల్లించాడు. అయితే డబ్బులు చెల్లించినప్పటికీ భూమి వివాదం పరిష్కారం కాకపోవడంతో పాటు రోజురోజుకూ బ్యాంకు రుణం, వడ్డీ భారం పెరిగిపోవడంతో సాయిరాం తీవ్ర తీవ్ర మానసిక, ఆర్థిక ఒత్తిడికి గురయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 23న ఉదయం పొలానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన సాయిరాం, సాయంత్రాని కల్లా నరసింహస్వామి గుండు సమీపంలోని అటవీ ప్రాంతంలో చెట్టుకు ప్లాస్టిక్ తాడుతో ఉరివేసుకుని మృతి చెంది కనిపించాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు, భూ వివాదం వెనుక ఉన్న వ్యక్తుల పాత్రపై సమగ్ర విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

IN THE COURT OF THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE CUM XI ADDL.JUDICIAL MAGISTATE OF FIRST CLASS :MEDCHAL-MALKAJGIRI DISTRICT: AT KUKATPALLY

O.S.NO. 450 OF 2026

**Between :**

Maddi Hanumantha Rao and others ...Plaintiffs

AND

The Tahsildar and another ...Defendants

To

All concerned ...Defendant no.2

**NOTICE**

Please take notice that the above named plaintiffs filed a suit for Declaration to Declare the Plaintiffs are the Legal Heirs of Late Maddi Sai Rohith and the same is stand posted to 30-10-2026, if anybody having any objection in the above suit, appear at 10.00 A.M. before the Hon'ble court in person or by an Advocate, failing which the Hon'ble court will proceed with the matter as per the law.

// By Order of the Hon'ble Court //

Sd/-
S. UMA DEVI
Advocate
# 9-4-61/1 Lions Town Colony,
Hasmthpet, Old Bowenpally, Hyderabad,
Telangana 500009




"నాలుగేళ్లకు పైగా రష్యా ఉక్రెయిన్ మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. ఇటీవలికాలంలో అవి మరింత తీవ్రమయ్యాయి. మోసం, కుతంత్రాలతో భారతీయులను రష్యా ఈ యుద్ధంలోని లాగుతున్నది. పుతిన్‌కు ఆ అవకాశాన్ని ఇవ్వద్దు. రష్యా ఈయుద్ధంలో 47 దేశాల ప్రజలను ఉపయోగించుకుంటోంది. ఈ విషయం మీ అందరికీ తెలుసు. ఘనా, నేపాల్, తజికిస్థాన్, భారత్, యెమెన్, కెన్యా, క్యూబా.. ఇలా పలు దేశాల పౌరులు ఈ యుద్ధ రంగంలో చనిపోయారు. వారంతా మోసం, కుతంత్రాలతో రష్యాలో చిక్కుకుపోయిన విదేశీయులు. ఈ దేశాల ప్రతినిధులతో నేరుగా మాట్లాడాలని ఉంది. మీ ప్రజలను జాగ్రత్తగా చూడండి."

**- జెలెన్‌స్కీ, ఉక్రెయిన్ అధ్యక్షుడు**

## వే'మన' పద్యం

ఓగు నోగు మెచ్చు నొనరంగ నజ్ఞాని
భావమిచ్చి మెచ్చు బరమలుబ్ధు
పంది బురద మెచ్చు బన్నీరు మెచ్చునా?
విశ్వదాభిరామ వినురవేమ



## సంపాదకీయం

# పర్యావరణానికి మూల్యం చెల్లించాల్సింది

రాజకీయాన్ని ఆర్థిక వ్యవస్థ నుంచి వేరుచేసి చూడటం అంటే చెట్టును చూసి దాని వేర్లను చూడనట్లే. ప్రపంచ రాజకీయాల ఉపరితలంపై దేశాలు, సరిహద్దులు, కూటములు, దౌత్య సంబంధాలు కనిపిస్తాయి. వాటి అడుగున మాత్రం పెట్టుబడి తన ప్రయాణాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది. ముడిసరుకు ఎక్కడుంది? మార్కెట్ ఎక్కడుంది? చౌకైన శ్రమ ఎక్కడుంది? ఇంధన వనరులు ఎక్కడున్నాయి? రవాణా మార్గాలు ఎవరి ఆధీనంలో ఉన్నాయి? సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు ఎవరిది? ఈ ప్రశ్నలన్నీ అంతర్జాతీయ రాజకీయాల గర్భంలోకి తీసుకెళ్తాయి. అందుకే యుద్ధం ఎప్పుడూ కేవలం సరిహద్దుల మధ్య జరిగే సంఘటన కాదు. దాని వెనుక భూ భౌగోళిక ప్రయోజనాలు ఉంటాయి. వనరులపై ఆధిపత్యం ఉంటుంది.

మార్కెట్లపై పట్టు కోసం పోటీ ఉంటుంది. సైనిక కూటముల ప్రయోజనాలు ఉంటాయి. ఆయుధ పరిశ్రమకు మార్కెట్లు ఉంటాయి. సామ్రాజ్యవాద శక్తి తన ప్రభావ పరిధిని నిలబెట్టుకోవాలనే ఆకాంక్ష ఉంటుంది. అందుకే మార్క్స్ పెట్టుబడిని కేవలం సంపదగా చూడలేదు, విస్తరణకు వాహకమైన సామాజిక శక్తిగా చూశారు. అది జాతీయ సరిహద్దులను దాటినప్పుడు ప్రపంచీకరణ రూపం తీసుకుంటుంది. ఈ పెట్టుబడి మొత్తం ప్రపంచాన్నంతా ఒకే మార్కెట్‌గా కుట్టేస్తుంది. కానీ సంపదను మాత్రం సమానంగా పంచదు. ఇక్కడే నేటి ప్రపంచపు ప్రధాన వైరుధ్యం దాగి ఉంది.

ఉత్పత్తి ప్రపంచవ్యాప్తమైంది. శ్రమ ప్రపంచవ్యాప్తమైంది. మార్కెట్ ప్రపంచవ్యాప్తమైంది. కానీ సంపదపై నియంత్రణ మాత్రం కేంద్రీకృతమైంది. అందుకే ప్రపంచ పేదరికాన్ని కేవలం పేద దేశాల లోపంగా చూడటం చరిత్రను తలకిందులు చేయడమే. వలస పాలన శతాబ్దాల పాటు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా వనరులను ప్రపంచ పెట్టుబడి విస్తరణకు ఉపయోగించింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా అసమాన వాణిజ్య సంబంధాలు, అప్పులు, సాంకేతికంగా ఆధారపడటం, మూలధన ప్రవాహాల అసమానతలు అనేక దేశాల అభివృద్ధిని పరిమితం చేశాయి. అందుకే ఒక దేశం పేదగా ఉండటానికి ఆ దేశ ప్రజలే కారణమని చెప్పే సిద్ధాంతం చరిత్రకు చేసే అన్యాయం. పేదరికం కూడా ఉత్పత్తి చేయబడుతుంది. అసమానత కూడా నిర్మించబడుతుంది. అధీనత కూడా ఒక వ్యవస్థలోనే పుడుతుంది.

వాతావరణ సంక్షోభం కూడా ఇదే కథను మరో రూపంలో చెబుతోంది. భూమి వేడెక్కుతోంది. సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. తుఫాన్లు, వరదలు, కరువులు, పంట నష్టాలు తీవ్రతరం అవుతున్నాయి. కానీ ఈ సంక్షోభానికి కారణమైన ఉత్పత్తి విధానాల చరిత్ర సమానంగా లేదు. పారిశ్రామిక విప్లవం నుంచి అపారమైన సంపదను కూడబెట్టుకున్న దేశాల అంతులేని ఉద్గారాలు ఒక వైపు ఉంటే, వాతావరణ మార్పుల దెబ్బను అధికంగా భరిస్తున్న పేద సమాజాలు మరో వైపు ఉన్నాయి. అందుకే వాతావరణ న్యాయం అంటే చెట్లు నాటడం మాత్రమే కాదు. కాలుష్యానికి కారకులెవరు? లాభపడింది ఎవరు? నష్టపోతున్నది ఎవరు? పరిష్కారానికి మూల్యం చెల్లించాల్సింది ఎవరు? ఈ నాలుగు ప్రశ్నలు లేకుండా వాతావరణ చర్చ అసంపూర్ణం. అలాగే కొత్త సాంకేతిక విప్లవం కూడా మానవ విముక్తికి స్వయంగా హామీ ఇవ్వదు. కృత్రిమ మేధస్సు ఉత్పాదకతను పెంచవచ్చు, వైద్యం, విద్య, పరిశోధనకు కొత్త మార్గాలు తెరవవచ్చు. కానీ ఆ సాంకేతికతపై యాజమాన్యం కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమైతే, అది కొత్త ఉత్పత్తి శక్తి మాత్రమే కాదు? కొత్త అధికార శక్తి కూడా అవుతుంది. ఇప్పుడు ప్రశ్న "సాంకేతికత ఎవరి వద్ద ఉంది?" అనేది కాదు. సాంకేతికతను ఎవరు నియంత్రిస్తున్నారు? డేటా ఎవరిది? జ్ఞానం ఎవరిది? యంత్రాల వల్ల పెరిగిన ఉత్పాదకత ఫలితం ఎవరిది? అనేవి అసలు ప్రశ్నలు. కానీ అంతటితో ఆగిపోతే ప్రయోజనం లేదు. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలోని అసమానతలను కూడా ప్రశ్నించా. పేద దేశాల అభివృద్ధి హక్కును గుర్తించాలి. యుద్ధాన్ని ఆపే దౌత్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. వాతావరణ న్యాయాన్ని నిధులూ, సాంకేతికతతో అనుసంధానించాలి. సాంకేతిక పరిజ్ఞానం మానవాళి ఉమ్మడి సంపదగా మారే మార్గాలను అన్వేషించాలి. ఈ దిశగా ఐరాస శక్తివంతం కావాలి.

**రచనలు పంపండి**

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# అంతరిక్ష వాస్తుశిల్పి సతీష్ ధావన్

భారత దేశం గర్వించదగిన అంతరిక్ష శాస్త్రవేత్త సతీష్ ధావన్. ఆయన్ను భారత ఎక్స్పెరిమెంటల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ ప్రయోగాత్మక (ద్రవ డైనమిక్స్ పరిశోధన) కు పితామహుడిగా పరిగణిస్తారు. అల్లకల్లోలం మరియు సరిహద్దు పొరల రంగంలో అత్యంత ప్రసిద్ధ పరిశోధకులలో అగ్రగణ్యుడుగా భావిస్తారు. గణితం, ఏరోస్పేస్ ఇంజనీరింగుల్లో డబల్ పి.హెచ్.డి సాధించి, ధావన్ గ్రామీణ విద్యలోను, రిమోట్ సెన్సింగు, ఉపగ్రహ సమాచారాల లోను పరిశోధనలు చేసాడు. వాటి ఫలితంగానే ఇన్‌శాట్, ఐఆర్ఎస్, పిఎస్ఎల్‌విలు రూపొందాయి.

స్పేస్ కమిషను ఛైర్మనుగా, ఇస్రో ఛైర్మనుగా భారత ప్రభుత్వ అంతరిక్ష శాఖలో సెక్రెటరీగా బాధ్యతలు స్వీకరించాడు. భారత దేశపు మొట్టమొదటి సూపర్‌సోనిక్ విండ్ టన్నెల్‌ను నిర్మించాడు. భారత దేశపు అత్యున్నత పురస్కారాలు పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పొందాడు. విశిష్ట పూర్వ విద్యార్థి పురస్కారం, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, విశిష్ట పూర్వ విద్యార్థి కాలిఫోర్నియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, 1969 అవార్డు పొందాడు.

సతీష్ ధావన్ (1920 సెప్టెంబరు 25 - 2002 జనవరి 3) శ్రీనగర్‌లో జన్మించిన ధావన్, భారత దేశం, అమెరికాలో తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేసాడు. టర్బులెన్స్, బౌండరీ లేయర్స్ రంగాల్లో ఆయనను అత్యున్నత స్థాయి పరిశోధకుల్లో ఒకరిగా పరిగణిస్తారు. ఆయా రంగాల్లో ఆయన శక్తి సామర్థ్యాలు భారత స్వదేశీ అంతరిక్ష కార్యక్రమ అభివృద్ధికి దోహద పడింది. 1972 లో ఎమ్.జి.కె. మీనన్ తరువాత, ఇస్రో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ప్రొఫెసర్ సతీష్ ధావన్ సమాజాన్ని మార్చే మార్గంగా టెక్నాలజీని, ముఖ్యంగా హై టెక్నాలజీని చూసిన మానవతా వాది. భారతదేశం యొక్క అత్యంత విజయవంతమైన అంతరిక్ష కార్యక్రమానికి వాస్తుశిల్పి సతీష్ ధావన్.

ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న లాహోరు లోని యూనివర్సిటీ ఆఫ్ పంజాబ్ నుండి బాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ, మెకానికల్ ఇంజనీరింగ్ డిగ్రీ, ఇంగ్లీషు సాహిత్యంలో ఎమ్.ఏ డిగ్రీ పొందాడు. 1947 లో మిన్నియా పోలిస్ లోని యూనివర్సిటీ ఆఫ్ మిన్నెసోటా నుండి ఏరోస్పేస్ ఇంజనీరింగులో ఎమ్.ఎస్., కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఏరోనాటికల్ ఇంజనీరింగులో డిగ్రీ, ఆ తరువాత 1951 లో డా. హాన్స్ డబ్ల్యు లేప్‌మ్యాన్ మార్గదర్శకుడిగా గణితం, ఏరోస్పేస్ ఇంజనీరింగుల్లో డబుల్ పి.హెచ్.డి పొందాడు.



డా. ధావన్ స్పేస్ కమిషను ఛైర్మనుగా, ఇస్రో ఛైర్మనుగా (1972-1984) భారత ప్రభుత్వ అంతరిక్ష శాఖలో సెక్రెటరీగా పని చేశాడు. స్పేస్ కమిషన్ ఛైర్మన్ గా బాధ్యతలు తీసుకోగానే అణుశక్తి కమిషనులో ఉన్న బ్రహ్మ ప్రకాష్‌ను తిరువనంతపురంలో ఉన్న విక్రం సారాభాయ్ అంతరిక్ష కేంద్రానికి ఛైర్మనుగా నియమించాడు. ఇస్రో శీఘ్రగతిన ఎదగడానికి ఆయన తీసుకున్న నిర్ణయం ఎంతో తోడ్పడింది. ఆ తరువాత భారత తొలి ఉపగ్రహ వాహక నౌక ఎస్ఎల్‌వి అభివృద్ధి కార్యక్రమానికి అబ్దుల్ కలాంను నాయకుడిగా నియమించాడు.

1975 లో ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ నాయకత్వంలో ఎస్ఎల్‌వి అభివృద్ధి జరుగగా, దాని మొదటి ప్రయోగం విఫలమైంది. వైఫల్యానికి బాధ్యత వహిస్తూ ఆనాటి పత్రికా సమావేశంలో పాల్గొని ఆ వైఫల్యాన్ని తానే స్వీకరించాడు. రెండవ ప్రయోగం విజయవంత మైనపుడు ఆనాటి పత్రికా సమావేశాన్ని అబ్దుల్ కలాం చేత చేయించాడు.

1951 లో ధావన్ భారత్ శాస్త్ర విజ్ఞాన సంస్థలో ఉపాధ్యాయుడిగా చేరాడు. 1962 దానికి డైరెక్టరుగా నియమితుడై, 1962-1981 వరకు ఐఐఎస్‌సి ఛైర్మన్ గా పని చేశాడు.

ఆయన ఇస్రో ఛైర్మనుగా ఉన్నప్పటికీ, బౌండరీ లేయర్ పరిశోధనలో తన శక్తియుక్తులు నియోగించాడు. ఆయన చేసిన పరిశోధనలను హెర్మన్ ష్లిక్టింగ్, తాను రాసిన బౌండరీ లేయర్ థియరీ పుస్తకంలో వివరించాడు. ధావన్ ఐఐఎస్‌సి లో భారతదేశపు మొట్టమొదటి సూపర్‌సోనిక్ విండ్ టన్నెల్‌ను నిర్మించాడు. అయన గ్రామీణ విద్య, రిమోట్ సెన్సింగ్ మరియు ఉపగ్రహ సమాచార మార్పిడిలో మార్గదర్శక ప్రయోగాలు చేశారు. ధావన్ ప్రయత్నాలు INSAT ఒక టెలి కమ్యూనికేషన్ ఉపగ్రహం, IRS ఇండియన్ రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహం మరియు పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (PSLV) వంటి కార్యాచరణ వ్యవస్థలకు దారితీశాయి, ఇవి భారతదేశాన్ని అంతరిక్ష వ్యవసాయ దేశాల లీగ్‌లో ఉంచాయి.

2002 లో ధావన్ మరణించాక, నెల్లూరు జిల్లా శ్రీహరికోట లోని అంతరిక్ష ప్రయోగ కేంద్రానికి ఆయన పేరుతో "సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రం"గా పేరు పెట్టారు. లూధియానా లోని ప్రభుత్వ కళాశాలను ఆయన పేరిట మార్చారు.

పద్మ విభూషణ్, 1981, పద్మ భూషణ్, 1971, ఇందిరా గాంధీ జాతీయ సమైక్యతా పురస్కారం, 1999 స్వీకరించాడు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరు సీనియర్ సైంటిఫిక్ ఆఫీసరు, 1951; ప్రొఫెసర్ అండ్ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఏరొనాటికల్ ఇంజనీరింగ్, 1955; డైరెక్టరు, 1962-1981; కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అమెరికా విజిటింగ్ ప్రొఫెసరు, 1971-72; నేషనల్ ఏరోస్పేస్ లాబరేటరీస్, బెంగళూరు రీసెర్చి కౌన్సిల్ ఛైర్మను, 1984-93; ఇండియన్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్కి ప్రెసిడెంట్ 1977-1979; ఇస్రో ఛైర్మన్, 1972-1984; ఇండియన్ స్పేస్ కమిషను ఛైర్మన్, 1972-2002 గా విధులు నిర్వర్తించాడు. 2002 జనవరి 3న 81ఏళ్ళ వయసులో మరణించాడు.

*ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న లాహోరు లోని యూనివర్సిటీ ఆఫ్ పంజాబ్ నుండి బాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ, మెకానికల్ ఇంజనీరింగ్ డిగ్రీ, ఇంగ్లీషు సాహిత్యంలో ఎమ్.ఏ డిగ్రీ పొందాడు. 1947 లో మిన్నియా పోలిస్ లోని యూనివర్సిటీ ఆఫ్ మిన్నెసోటా నుండి ఏరోస్పేస్ ఇంజనీరింగులో ఎమ్.ఎస్., కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఏరోనాటికల్ ఇంజనీరింగులో డిగ్రీ, ఆ తరువాత 1951 లో డా. హాన్స్ డబ్ల్యు లేప్‌మ్యాన్ మార్గదర్శకుడిగా గణితం, ఏరోస్పేస్ ఇంజనీరింగుల్లో డబుల్ పి. హెచ్.డి పొందాడు.*



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

## విద్యార్థి దశనుంచే సామాజిక స్పృహ

విద్యార్థుల ప్రప్రథమ కర్తవ్యం విద్యాభ్యాసం. కానీ భావి భారతాన్ని నిర్ణయించవలసినది యువకులే. ప్రతి దేశ పురోభివృద్ధి లోనూ, ఉద్యమాల లోనూ విద్యార్థులు పాలు పంచు కుంటారు. ఒక్కొక్కసారి ఆవేశం ఎక్కువ కావచ్చు కానీ కల్లాకపటం ఎరగని నిర్మల, సున్నిత మనస్కులు విద్యార్థులు. వారు కూడా సంఘజీ వులే, సంఘంలో భాగస్వాములే, సంఘసేవ నిరుపేదల కష్ట సుఖాలలో పాలు పంచుకుంటూ, సమాజ సేవ చేసే లక్ష్యంతో జాతిపిత మహాత్మా గాంధీ శత జయంతి సందర్భంగా 1969 సెప్టెంబర్ 24వ తేదీన ఈ పథకాన్ని దేశ వ్యాప్తంగా మొదలు పెట్టారు. అప్పటి "విశ్వ విద్యాలయాల నిధుల సంఘం" (యూజీసీ) ఛైర్మన్ రాధాకృష్ణన్ జాతీయ సేవా పథకాన్ని విద్యా సంస్థలలో ప్రారంభించాలని సూచించారు. 1959 జనవరిలో జరిగిన సీఏబీఈ పాలక మండలి ఆయన సూచనకు ఆమోదం తెలిపింది. 1952లో పంచవర్ష ప్రణాళికలో ప్రతిపాదించబడి, 4వ పంచవర్ష ప్రణాళికలో ప్లానింగ్ కమిషనర్ ద్వారా 5కోట్ల రూపాయలను ఎన్ఎస్ఎస్ పథకానికి కేటాయించారు.1958లో అప్పటి ప్రధాన మంత్రి పండిట్ నెహ్రూ దేశంలోని ముఖ్య మంత్రులకు జాతీయ సేవా పథకాన్ని అమలు చేయాలంటూ లేఖలు రాశారు. ఈ పథకానికి తగిన వ్యూహ రచన చేయాలని కూడా ఆయన కేంద్ర విద్యాశాఖను ఆదేశించారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 37 విశ్వ విద్యాలయాలలో సుమారు 40,000 మంది వాలంటీర్లతో అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి వి.కె.ఆర్.రావు ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. 1999 నాటికి ఈ పథకంలో 13,52,000 మంది వాలంటీర్లు ఉన్నారు. 176 విశ్వ విద్యాలయాల పరిధిలో లక్షలాది మంది విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో సేవలందిస్తున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనూ ఎన్ఎస్ఎస్ యూనిట్లను కళాశాల స్థాయిలో ప్రారంభించారు. లక్షలాది మంది వాలంటీర్లు సమాజ సేవలో భాగస్వాములు అవుతున్నారు. ప్రతిఫలం ఆశించకుండా సేవా మార్గం పట్టేవారే ఎన్ఎస్ఎస్‌లో వలంటీర్లుగా చేరతారు. సామాజిక కార్యక్రమాలపై యువతకు తర్ఫీదునివ్వడమే గాక, వారి సేవలను వినియోగించు కోవడం ఎన్ఎస్ఎస్‌లో కనిపిస్తుంది. కళాశాల స్థాయిలో ఎన్ఎస్ఎస్ విభాగాలకు ప్రిన్సిపాల్ పర్యవేక్షకుడిగా, ఒక అధ్యాపకుడు ప్రోగ్రాం అధికారిగా వ్యవహరిస్తారు. సమాజ సేవ పట్ల ఆసక్తి చూపే విద్యార్థులను ఇందులో చేర్చుకుంటూ, ప్రతి వందమంది విద్యార్థులను ఒక యూనిట్‌గా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూంటారు. రెండు విద్యా సంవత్సరాలలో కనీసం 240 గంటలు సంఘసేవలో పాల్గొనేలా కృషి జరుగుతోంది. భావితరాలకు వారసులైన విద్యార్థులు జట్లుగా పనిచేస్తూ ఐక్యతా భావాన్ని పంచు కుంటారు. సమాజంలో విద్యార్థి తన స్థానాన్ని, గమ్యాన్ని నిర్ణయించు కొనేలా చేయడం ఇందులోని ప్రధాన అంశం. విద్యార్థులు చిత్తశుద్ధితో, క్రమశిక్షణతో సామాజిక సేవలో పాల్గొనేలా చేయడమే జాతీయ సేవా పథకం ప్రధాన ధ్యేయం. రక్తదానం, ఉత్సవాలలో స్వచ్ఛంద సేవ, అతివృష్టి, అనావృష్టి, వరదలు, తుఫానులు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నపుడు విరాళాలు సేకరించి తగు సహాయ సహకారాలను అందించడం కూడా ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలుగా ఉన్నాయి. అక్షరాస్యతా కార్యక్రమాల అమలులో భాగస్వాములు కావడం, ఆరోగ్య సూత్రాలను బోధించడం, ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధులపై ప్రజలను చైతన్య పరచడం వంటి కార్యక్రమాల్లోనూ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొంటారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలకు గుర్తింపుగా విశ్వ విద్యాలయాలు ధ్రువీకరణ పత్రాలను అంద జేస్తాయి. ఉద్యోగ నియామకాలు, ఇతర సందర్భాల్లో ఈ సర్టిఫికెట్ లకు విలువ ఉంటుంది. ఆర్మీ, ఎయిర్ ఫోర్సు, మిలటరీ, నర్సింగ్ సర్వీసులలో, పోలీసు, టెలికాం, సమాచార వ్యవస్థ తదితర విభాగాల్లో నియామకాల సందర్భంగా ఎన్ఎస్ఎస్ సర్టిఫికెట్లు ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.'నా కోసం కాదు, నీ కోసమే..' అనే దీక్షా నినాదంతో సేవలు అందించడమే ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల లక్ష్యం. యువతలో సామాజిక స్పృహను కల్పిస్తూ, వారిని సేవా భావంతో ముందుకు నడిపించడం నిరంతర కార్యక్రమంగా కొనసాగాలి. ఈ లక్ష్యంతో ఏర్పాటైన జాతీయ సేవా పథకం ఎంతోమంది విద్యార్థులను ఆకర్షిస్తోంది. ఈ పథకంలో చేరిన వారు క్రమశిక్షణ, సామాజిక చైతన్యం కలిగి జీవితంలో ముందుకు రాణించే అవకాశం ఉంది.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

# ఫార్మాసిస్టులు.. నిరంతర శ్రామికులు....

వైద్య ఆరోగ్య రంగంలో రోగుల చికిత్స, శ్రేయస్సు కల్పనలో ఫార్మసిస్టుల పాత్ర మరువలేనిది. అపార అనుభవం, అపరిమిత విజ్ఞానం, వృత్తి నిబద్ధత లాంటి సుగుణాలు కలిగిన ఫార్మసిస్టులు వైద్యునికి, రోగికి లేదా ఆరోగ్యకర పౌర సమాజానికి మధ్య అనుసంధాన కర్తగా విశిష్ట సేవలు అందిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్య పరిరక్షణలో తమదైన విలక్షణ పాత్రను పోషిస్తున్న ఫార్మసిస్టుల వర్గాలకు కృతజ్ఞతలు తెలియజేయడానికి ప్రతి ఏట 25 సెప్టెంబర్ రోజున "ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం (వరల్డ్ ఫార్మసిస్ట్స్ డే)" పాటించడం 2009 నుంచి ఆనవాయితీగా మారింది. 25 సెప్టెంబర్ 1912 రోజున ప్రారంభమైన "అంతర్జాతీయ ఫార్మసిస్యూటికల్ ఫెడరేషన్"కు గుర్తుగా ఈ వేదికను నిర్వహించడం జరుగుతోంది. ఔషధాల భద్రత, ఆరోగ్య పరిరక్షణ, రోగులకు భరోసా ఇవ్వడం లాంటి లక్ష్యాలను అధిగమించడానికి అంకితభావం, వృత్తి నైపుణ్యం, చిరునవ్వు చెరగని ముఖాలు, గంటల తరబడి వృత్తిలో నిమగ్నం కావడం, దయ కరుణలను వర్షించడం లాంటి సుగుణాల రాసులుగా ఫార్మసిస్టులు విశిష్ట సేవలను బేషరతుగా అందిస్తున్నారు. 2026 ప్రపంచ ఫార్మసిస్టుల దినం ఇతివృత్తంగా "ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు ఫార్మసిస్టులను శక్తివంతం చేయడం (ఎంపవరింగ్ ఫార్మసిస్ట్స్ ఫర్ హెల్దియర్ ఫ్యూచర్స్)" అనబడే అంశాన్ని తీసుకొని విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

*సురక్షిత ఔషధ ప్రయోగాలు, ఔషధ నిర్వహణ, ప్రజారోగ్య సంస్థల నిర్వహణ, యూనివర్సిటీ విద్య, స్థానిక పౌర సమాజ చొరవలను సునాయాసంగా నిర్వహిస్తున్న ఫార్మసిసులకు మనందరం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేయాల్సిన రోజుగా 25 సెప్టెంబర్ మనకు ఒక సదవకాశాన్ని ఇస్తున్నది. మన ఆరోగ్య దీపాలకు తమ చేతులు జోడిస్తున్న నిశ్శబ్ద ఫార్మసిస్టుల అంకితభావానికి, సేవానిరతికి మనం చేతులెత్తి నమస్కరిద్దాం, గుండెల నిండుగా ప్రేమలను కురిపిద్దాం.*

ఫార్మసిస్టుల విలక్షణ పాత్ర:

పెరుగుతున్న ప్రజారోగ్య ఖర్చులు, వైద్య ఆరోగ్య డిమాండ్‌లు, వాతావరణ ప్రతికూల మార్పులు, అసాధారణ ఆంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ లాంటి ప్రతికూలత మధ్య ఫార్మసిస్టులు భద్రతతో కూడిన చవకైన ఔషధాలను అందిస్తూ, అందరికీ అందుబాటులో ఉంటూ తమదైన విలక్షణ పాత్రను పోషిస్తున్నారు. ఆరోగ్య అక్షరాస్యత, టీకాలను రూపొందించడం, ఔషధాల సురక్షిత వినియోగం, పౌర సమాజంలో ఒక అదృశ్య భాగంగా బహుముఖ విధులను నిర్వహిస్తున్న ఫార్మసిస్టులు పేదలపాలిట వరంగా నిస్వార్థ సేవలను అందిస్తున్నారు. అత్యవసర ఔషధాలు, ముఖ్యంగా ఆంటీబయాటిక్స్ వాడడంలో మెలకువలను నేర్పుతున్న ఫార్మసిస్టులు ఆరోగ్య సలహాలు, ఆరోగ్య శిబిరాలు, రోగులకు అవసర విజ్ఞానాలు, ప్రజారోగ్య ప్రచారాలు, పరిశోధనలు, నూతన ఔషధాల ఆవిష్కరణలు లాంటి అమూల్య సేవలతో పేద ప్రజల చెంతకు ఆరోగ్యాలను తీసుకురావడం కొనసాగుతున్నది.

సురక్షిత ఔషధ ప్రయోగాలు, ఔషధ నిర్వహణ, ప్రజారోగ్య సంస్థల నిర్వహణ, యూనివర్సిటీ విద్య, స్థానిక పౌర సమాజ చొరవలను సునాయాసంగా నిర్వహిస్తున్న ఫార్మసిసులకు మనందరం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేయాల్సిన రోజుగా 25 సెప్టెంబర్ మనకు ఒక సదవకాశాన్ని ఇస్తున్నది. మన ఆరోగ్య దీపాలకు తమ చేతులు జోడిస్తున్న నిశ్శబ్ద ఫార్మసిస్టుల అంకిత భావానికి, సేవానిరతికి మనం చేతులెత్తి నమస్కరిద్దాం, గుండెల నిండుగా ప్రేమలను కురిపిద్దాం.





మధుసూదన్ రెడ్డి
9949700 037

## మారని లోకం....! మారని మనుషులు !!

ఓ బ్రహ్మ దేవా......!
ఈ లోకం ఇంతేనా... !!
కులవృక్షం కూలదా ?
మతం మంట ఆరదా ?
మనిషి మరో మనిషికి
అడ్డుగోడలు కడతాడా ?

సృష్టి ఆదిలో.....
కులం లేదు......!
మతం లేదు......!

మనిషి ఒక్కడే.....!!
మానవత్వమే కులం !
మధ్యలో రగిలిన
కులాల కుంపట్లు
మరణహోమాలు
సృష్టి స్తున్నాయి
మధ్యలో మొలిచిన

మతాల ముళ్లచెట్లు
మనిషి గుండెల్లోముల్లై
గుచ్చుకుంటున్నాయి

ఓ బ్రహ్మదేవా.....!!
నువ్వు సృష్టించిన లోకంలో
ఈ కులమతాల

గోడలే లేవు గొడవలే లేవుగా !

మరి...సృష్టి నీదైతే
ఈ విభజనల విత్తనాలెక్కడివి ?
బ్రహ్మ సృష్టిలో మనిషి
ఒక్కటే......
మధ్యలో ఎవరో.....?
మాయగాళ్ళు నాటారు !
ఈ కులమతాల
కలుపుమొక్కల్ని !

కులరక్కసి కోరలు పీకి......
మతపిశాచిని మాయం
చేసి.....
పిడుగులు పడని గగనంలా.
భూకంపాలు లేని భూమిలా....
మనుషులంతా ఒక్కటై......
మానవ కులం ఒక్కటైన....
మరో కొత్త లోకాన్ని...
సృష్టించు బ్రహ్మ దేవా !

**కావ్యసుధ**
9247313488



# జాతీయం-అంతర్జాతీయం






## నీట్ లీక్ కేసులో కఠిన చర్యలు

### రెండేళ్ల నిషేధానికి గురైన మోటేగాంకర్ కుమారుడు

**న్యూఢిల్లీ సెప్టెంబరు 24 (ఏ.ఎం.ఎస్):** నీట్ యుజి పేపర్ లీక్ కేసులో నిందితుడైన లాతూర్ కోచింగ్ సెంటర్ యజమాని శివరాజ్ మోటేగాంకర్ కుమారుడు ఆదిత్య మోటేగాంకర్‌పై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) రెండేళ్ల నిషేధం విధించింది. ఈ ఏడాది నీట్‌యుజి పరీక్ష ఫలితాన్ని నిలిపివేయడంతోపాటు, 2027లో జరిగే నీట్‌యూజీ పరీక్షకు హాజరుకాకుండా అతడిని అనర్హుడిగా ప్రకటించింది. సెప్టెంబర్ 19న ఎన్‌టీఏ ఉత్తర్వులు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ కేసులో శివరాజ్ మోటేగాంకర్‌ను సిబిఐ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. నీట్‌యుజి ప్రశ్నాపత్రం రూపొందించే ఎన్‌టిఏ ప్యానెల్‌లో సభ్యుడిగా ఉన్న పి.వి. కులకర్ణి నుండి కెమిస్ట్రీ ప్రశ్నలను పొందేందుకు మోటేగాంకర్ రూ.5 లక్షలు చెల్లించారని సిబిఐ వెల్లడించింది. కులకర్ణి నిర్వహించిన కోచింగ్ తరగతులకు ఆదిత్య హాజరయ్యేవాడని, అక్కడే ఆ ప్రశ్నలను అతడికి అందించారని దర్యాప్తు సంస్థ పేర్కొంది. మే 3న జరిగిన నీట్‌యుజీ పరీక్షకు సంబంధించి అక్రమాల ఆరోపణలు రావడంతో జూన్ 21న ఎన్‌టిఏ పునఃపరీక్ష నిర్వహించింది. అనంతరం ఆదిత్య ఫలితాన్ని నిలిపివేసి, ఆరోపణలపై వివరణ కోరింది. అయితే పరీక్ష సమయంలో తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని ఆదిత్య తన సమాధానంలో పేర్కొన్నాడు. మే 3న జరిగిన పరీక్షకు సంబంధించిన అక్రమాలపై తనకు నోటీసు ఇచ్చినప్పటికీ, ఆ తర్వాత నిర్వహించిన పునఃపరీక్ష ఫలితాన్ని ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించాడు. పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 3న నిర్వహించిన నీట్‌యుజి పరీక్షను ఎన్‌టిఏ మే 12న రద్దు చేసి, జూన్ 21న పునఃపరీక్ష నిర్వహించింది. ప్రభుత్వ పరీక్షల్లో పేపర్ లీక్‌లు, ఇతర అక్రమ పద్ధతులకు సంబంధించిన కేసులపై సిబిఐ తన తుది నివేదికను గత నెలలో ఢిల్లీలోని ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు సమర్పించింది.

# ఇసిల నియామకం కేసు

## రాజ్యాంగ ధర్మాసనానికి విచారణ బదిలీ

- సిజెఐకి సిఫార్సు
- కేంద్ర ప్రభుత్వ విజ్ఞప్తిపై న్యాయమూర్తుల భిన్నాభిప్రాయాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24(ఏ.ఎం.ఎస్) :** ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి), ఇతర ఎన్నికల కమిషనర్ల (ఇసి) నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం భిన్న తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించాలన్న కేంద్ర ప్రభుత్వ అభ్యర్థనపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలు విభిన్న అభిప్రాయాలు వ్యక్తం చేశారు. దీంతో కేసును తగిన సంఖ్యలో న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) ముందుంచేందుకు ఇద్దరు న్యాయమూర్తులు అంగీకరించారు. 2023లో పార్లమెంట్ ఆమోదించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్ల చట్టంలో సిఇసి, ఇసిల నియామక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో ప్రధానమంత్రి నామినేట్ చేసే కేంద్ర మంత్రిని చేర్చారు. ప్రస్తుతం ఈ కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేత, ప్రధానమంత్రి నామినేట్ చేసిన కేంద్ర మంత్రి సభ్యులుగా ఉంటారు. ఈ మార్పునే పిటిషనర్లు సవాల్ చేశారు.

**ఇసి స్వతంత్రంగా ఉందనే భావన ప్రజల్లో ఉండాలి:**

**జస్టిస్ దత్తా** కేంద్రం కోరిన విధంగా కేసును విస్తృత ధర్మాసనానికి పంపాల్సిన అవసరం లేదని జస్టిస్ దీపాంకర్ దత్తా అభిప్రాయపడ్డారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా పనిచేయడం మాత్రమే కాకుండా, అది స్వతంత్రంగా పనిచేస్తుందనే నమ్మకం ప్రజల్లో కలిగించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ప్రధాన మంత్రి నామినేట్ చేసే కేంద్ర మంత్రి అదే ప్రభుత్వంలో భాగంగా ఉన్నందున, ప్రధానమంత్రికి వ్యతిరేకంగా స్వతంత్రంగా వ్యవహరిస్తారని ఆశించడం కష్టమని జస్టిస్ దత్తా వ్యాఖ్యానించారు. అటువంటి వ్యవస్థలో తటస్థ సభ్యుడు అందించే స్వతంత్ర ప్రతిస్పందనకు సమానమైన సమతుల్యత ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసం అత్యంత కీలకమని, ఎన్నికల సంఘం స్వతంత్రంగా ఉండటమే కాకుండా అది స్వతంత్రంగా ఉందనే భావన కూడా ప్రజల్లో ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ పిటిషన్లలో గణనీయమైన రాజ్యాంగపరమైన ప్రశ్నలు ఉన్నందున వాటిని విస్తృత ధర్మాసనం తేల్చాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 145(3) ప్రకారం కనీసం ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ అంశాన్ని పరిశీలించాల్సి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, ఇద్దరు న్యాయమూర్తుల మధ్య అభిప్రాయ భేదం ఉన్నప్పటికీ, ఈ వ్యవహారాన్ని మరో ధర్మాసనం వద్దకు పంపి, ఆ తర్వాత మళ్లీ రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే ప్రక్రియ వల్ల మరింత జాప్యం జరిగే అవకాశం ఉందని కోర్టు పేర్కొంది. అందువల్ల నేరుగా సిజెఐ వద్దకు పంపి, తగిన రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించింది.

**'అనూప్ బరన్వాల్' తీర్పు నేపథ్యంలో**

ఈ వివాదానికి 2023లో సుప్రీంకోర్టు ఇచ్చిన అనూప్ బరన్వాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పు కీలక నేపథ్యంగా ఉంది. పార్లమెంట్ చట్టం చేసే వరకు సిఇసి, ఇసిల నియామకానికి ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేత, సిజెఐలతో కూడిన కమిటీని సుప్రీంకోర్టు సూచించింది. అయితే అనంతరం పార్లమెంట్ 2023లో కొత్త చట్టం తీసుకువచ్చి సిజెఐ స్థానంలో ప్రధానమంత్రి నామినేట్ చేసే కేంద్ర మంత్రిని నియామక కమిటీలో చేర్చింది. ఈ మార్పుతో నియామక కమిటీలో ప్రభుత్వానికి చెందిన ఇద్దరు సభ్యులు, ప్రతిపక్షానికి చెందిన ఒక సభ్యుడు ఉండే పరిస్థితి ఏర్పడిందని పిటిషనర్లు వాదిస్తున్నారు. మరోవైపు, పార్లమెంట్ తన శాసనాధికార పరిధిలోనే కొత్త నియామక వ్యవస్థను రూపొందించిందని కేంద్ర ప్రభుత్వం వాదించింది. అనూప్ బరన్వాల్ తీర్పు శాసనపరమైన ఖాళీని భర్తీ చేయడానికి మాత్రమే తాత్కాలిక వ్యవస్థను ఏర్పాటు చేసిందని కేంద్రం పేర్కొంది.

**ఏళ్ల తరబడి జాప్యంపై ఆందోళన**

విస్తృత ధర్మాసనాలకు పంపుతున్న రాజ్యాంగపరమైన కేసుల విచారణలో జాప్యం జరుగుతున్న అంశాన్ని కూడా సుప్రీంకోర్టు ప్రస్తావించింది. కొన్ని రాజ్యాంగపరమైన అంశాలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రాజ్యాంగ కేసుల విచారణ కోసం శాశ్వతంగా ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఏర్పాటు చేసే అంశాన్ని సిజెఐ పరిశీలించాలని కోరింది. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం చెల్లుబాటు, ఎన్నికల సంఘం స్వతంత్రతకు రాజ్యాంగపరమైన రక్షణ, నియామక ప్రక్రియలో ప్రభుత్వప్రతిపక్షాల పాత్ర వంటి కీలక అంశాలపై తుది నిర్ణయం ఇక రాజ్యాంగ ధర్మాసనం పరిధిలోకి వెళ్లనుంది.



## సంక్షోభం కాకుండా సహకారం దిశగా

### ఇరు దేశాలు భాగస్వాములుగా ఉండాలన్న జిన్‌పింగ్

**బీజింగ్ :** చైనా, అమెరికాలు ప్రత్యర్థులుగా కాకుండా భాగస్వాములుగా ఉండాలని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వాగతం పలికిన అనంతరం జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు చైనా అధికారిక మీడియా తెలిపింది. ''మన రెండు దేశాలు ప్రత్యర్థులుగా కాకుండా భాగస్వాములుగా ఉండాలి'' అని చైనా అధికారిక వార్తా సంస్థ జిన్హువా ప్రచురించిన లిఖితపూర్వక ప్రకటనలో జిన్‌పింగ్ పేర్కొన్నారు. చైనా, అమెరికా ప్రజల మధ్య దీర్ఘకాలంగా స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని, ''మన రెండు దేశాలు ప్రత్యర్థులుగా కాకుండా భాగస్వాములుగా ఉండాలి'' అని చైనా అధికారిక వార్తా సంస్థ జిన్హువా ప్రచురించిన లిఖితపూర్వక ప్రకటనలో జిన్‌పింగ్ పేర్కొన్నారు. చైనా, అమెరికా ప్రజల మధ్య దీర్ఘకాలంగా స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని,

ఇరు దేశాల ప్రయోజనాలు పరస్పరం ముడిపడి ఉన్నాయని ఆయన అన్నారు. ద్వైపాక్షిక సంబంధాలు, ప్రపంచ పరిస్థితులకు సంబంధించిన ప్రధాన అంశాలపై ట్రంప్‌తో సుదీర్ఘంగా చర్చించేందుకు ఎదురు చూస్తున్నట్లు జిన్‌పింగ్ పేర్కొన్నారని జిన్హువా నివేదించింది. సహకారమే ప్రధాన ఆధారంగా ఇరు దేశాల సంబంధాలు కొనసాగాలని, పరస్పర పోటీ పరిమితులకు లోబడి ఉండాలని, విభేదాలను అదుపులో ఉంచుకుంటూ శాంతియుతంగా ముందుకు సాగాలని జిన్‌పింగ్ అన్నారు. రెండు అగ్రరాజ్యాలు కలిసి ముందుకు సాగేందుకు సరైన మార్గాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. ఇరు పక్షాల ఉమ్మడి కృషితో తన పర్యటన సత్ఫలితాలను ఇస్తుందని, ప్రజల శ్రేయస్సును పెంపొందించడంతోపాటు ప్రపంచ శాంతికి కొత్త ఆశను కలిగిస్తుందని విశ్వసిస్తున్నట్లు జిన్‌పింగ్ పేర్కొన్నారు.

# భారత్‌లో పరిశుభ్రత లోపంపై కోర్టు వ్యాఖ్యలు

## మారిషస్‌తో పోల్చుతూ ప్రశ్నల వర్షం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24(ఏ.ఎం.ఎస్) :** పరిసరాల పరిశుభ్రతను పాటించే విషయంలో భారత్, మారిషస్‌లను పోలుస్తూ ఓ భారతీయ కంటెంట్ క్రియేటర్ చేసిన పోస్టు నెట్టింట వైరల్‌గా మారింది. మారిషస్‌లో భారత సంతతి ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నారని.. అక్కడివారు స్వచ్ఛతను పాటిస్తుండగా, మరి భారతీయులు ఎందుకు వెనుకబడ్డారని ఆయన ప్రశ్నించారు. మారిషస్‌లో పర్యటించిన విశాల్ భార్గవ అనే క్రియేటర్.. అక్కడ తనకు ఎదురైన అనుభవాన్ని వీడియోలో పంచుకున్నారు.

''మారిషస్‌ను పరిశుభ్రంగా ఉంచుతున్న భారతీయులు.. భారత్ విషయంలో ఎందుకు ఆ పని చేయడం లేదు? మారిషస్‌లో 70 శాతం మంది భారత సంతతికి చెందిన వారే. కానీ, ఆ దేశం చాలా



క్లీన్‌గా ఉంది. ఎవరూ ఎక్కడపడితే అక్కడ చెత్త వేయరు. చెత్తకుండీలను వాడతారు. బీచ్‌లు చాలా శుభ్రంగా ఉంటాయి. అయితే.. అది చాలా చిన్న దేశమని, కేవలం 12 లక్షల జనాభా ఉందని వాదించవచ్చు. మన దేశంలోని గోవాను తీసుకున్నా పరిశుభ్రత అంతంతే. వాస్తవానికి భారతీయులు పౌరస్పృహ లేనివారు కాదు. అయినప్పటికీ.. మన దేశంలో ఎందుకీ దుస్థితి నెలకొంది?'' అని విశాల్ భార్గవ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు.

ఈ వీడియో ఆన్‌లైన్‌లో చర్చకు దారితీసింది. భారతీయులు కూడా నిబంధనలు పాటిస్తారని, కానీ అధికార యంత్రాంగం వాటిని కఠినంగా అమలు చేయాల్సి ఉంటుందని ఒకరు పేర్కొన్నారు. జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో మరిన్ని చెత్తబుట్టలను అందుబాటులో ఉంచాలని మరొకరు తెలిపారు. పరిసరాల పరిశుభ్రత అనేది ఇంటినుంచే మొదలుకావాల్సిన పాఠమని.. పెద్దలు చేసినట్లే పిల్లలు కూడా చేస్తారని పలువురు చెప్పారు. పౌర స్పృహను పెంపొందించడంలో పాఠశాలలు ప్రధాన పాత్ర పోషించాలన్నారు.

## గ్లోబల్ సౌత్ దేశాలు ఐకమత్యంగా ఉండాలి



- యుఎన్ సమావేశంలో జైశంకర్

**న్యూయార్క్:** వివిధ దేశాల మధ్య కొనసాగుతున్న ఘర్షణల నివారణలో ఐక్యరాజ్యసమితి భద్రతామండలి వైఫల్యమే ఆ అంతర్జాతీయ వేదికను తక్షణమే సంస్కరించాల్సిన ఆవశ్యతను తెలియజేస్తోందని భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. సంస్కరణల అమలు ఆలస్యమైతే ప్రపంచ శాంతికి చరిత్రాత్మక అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు. ఐక్యరాజ్యసమితి 81వ సర్వసభ్య సమావేశాల సందర్భంగా అభివృద్ధి చెందుతున్న దేశాల (ఎల్.69 కన్సల్టేటివ్ మినిస్టీరియల్ ఇంటరాక్షన్) ప్రత్యేక ఉన్నత స్థాయి భేటీలో జైశంకర్ ప్రసంగించారు. సెయింట్ లూసియా విదేశాంగ మంత్రి అల్వా బాప్టిస్టే అధ్యక్షత వహించగా, జైశంకర్ సహాధ్యక్షుడిగా పాల్గొన్నారు. అంతర్జాతీయ వేదికల్లో దక్షిణార్థగోళ (గ్లోబల్ సౌత్) దేశాలు కీలక పాత్ర నిర్వహించే స్థాయికి ఎదగాలని, అందుకుగాను వీటి మధ్య సంఘీభావం మరింత పెరగాలని ఎస్. జైశంకర్ పిలుపునిచ్చారు. ఐక్యరాజ్య సమితి సమావేశాల కోసం న్యూయార్క్ చేరుకున్న భారత విదేశీవ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ బుధవారం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియోతో భేటీ అయ్యారు. రష్యా, ఇరాన్‌పై ఆంక్షలు విధించేలా అమెరికా తీసుకొచ్చిన చట్టం ప్రభావం, భారత్‌అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై ఇద్దరు నేతలు చర్చించారు. అంతకు ముందు భారత్, ఫ్రాన్స్, యూఏఈ దేశాల త్రైపాక్షిక మంత్రుల భేటీలోనూ జైశంకర్ పాల్గొన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, కృత్రిమమేధ అంశాలపై మాట్లాడుకున్నారు.

## శబరిమల స్వర్ణ కిరీటం భద్రంగానే ఉంది

### ఆరోపణలను ఖండించిన దేవస్వమ్ బోర్డు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24(ఏ.ఎం.ఎస్) :** ప్రసిద్ధ శబరిమల ఆలయం మరో వివాదంలో చిక్కుకుంది. ఈ ఆలయ సన్నిధానం నుంచి బంగారు కిరీటం మాయమైందంటూ కథనాలు వెలువడుతున్నాయి. అయితే, ఇందులో నిజం లేదని, స్వర్ణ కిరీటం భద్రంగా ఉందని ఆలయ తిరువాభరణం కమిషనర్ చెప్పడం గమనార్హం. అసలేం జరిగిందంటే..?శబరిమల ఆలయంలో ద్వారపాలక దేవతా ప్రతిమలకు బంగారు పూత, గర్భగుడి ద్వారాలకు స్వర్ణ తాపడం రేకులు అమర్చే వ్యవహారంలో అవకతవకలపై దర్యాప్తు జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఆ కేసులో భాగంగానే హైకోర్టు ఆదేశాల మేరకు సన్నిధానంలోని తిరువాభరణం, అరణ్ములలో స్వామివారి ఆభరణాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లోనే ఓ బంగారు కిరీటం మాయమైనట్లు వార్తలు వచ్చాయి. దాని స్థానంలో నకిలీది ఉంచినట్లు ఆ కథనాల సారాంశం. ఈ కిరీటాన్ని 2012లో తమిళనాడుకు చెందిన ఓ భక్తుడు కానుకగా ఇచ్చారు. అప్పుడు దాని బరువు (విలువైన అలంకరణ రాళ్లతో కలిపి) 445.78 గ్రాములు ఉండగా.. అందులో 55.7 గ్రాముల బంగారం ఉంది.అరణ్ములలో స్వామివారి ఆభరణాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లోనే ఓ బంగారు కిరీటం మాయమైనట్లు వార్తలు వచ్చాయి. దాని స్థానంలో నకిలీది ఉంచినట్లు ఆ క అయితే, స్ట్రాంగ్ రూమ్‌లో గుర్తించిన కిరీటం బరువు కేవలం 240 గ్రాములే ఉన్నట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. దీంతో ఈ కిరీటం మాయం వ్యవహారం వివాదాస్పదంగా మారింది. కు చెందిన తిరువాభరణం కమిషనర్ వీటిపై స్పందించారు. అవన్నీ అసత్య వార్తలని, స్వర్ణ కిరీటం భద్రంగా ఉందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి బోర్డుకు అధికారిక నివేదిక పంపారు. 'భక్తులు ఇచ్చే కానుకలన్నింటినీ స్ట్రాంగ్ రూమ్‌ల్లోనే భద్రపరుస్తాం. అందులో బంగారు ఆభరణాలతో పాటు ఇమిటేషన్ నగలు కూడా ఉంటాయి.

2012లో కానుకగా ఇచ్చిన ఈ బంగారం కిరీటాన్ని అప్పటి నుంచి భద్రంగా దాచిపెట్టాం. కొంత గందరగోళం కారణంగా తొలుత ఈ కిరీటం మిస్ అయినట్లు భావించాం.

కానీ, రిజిస్టర్‌లో వివరాలన్నీ సరిచూసిన తర్వాత.. కిరీటం భద్రంగా ఉన్నట్లు తేలింది'' అని కమిషనర్ తన నివేదికలో వెల్లడించారు.

## ఆ సాఫ్ట్‌వేర్‌ను నిషేధించాల్సిందే

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24(ఏ.ఎం.ఎస్) :** కొత్త ఓటర్లను చేర్చడం, పేర్లను తొలగించడం వంటి విషయాలు ఎన్నికల సంఘంలోని ఇద్దరు కమిషనర్లకు తెలియకుండా జరిగాయన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. దాంతో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి తరుణంలో ఎన్నికల సంఘం సాఫ్ట్‌వేర్ వివాదంపై చెలరేగుతోంది. ఆ వినాశకర సాఫ్ట్‌వేర్‌ను రద్దు చేయాలని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ పిలుపునివ్వడం చర్చనీయాంశమైంది.గోవాలో సర్ సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలే థరూర్ స్పందనకు కారణం. ఆ రాష్ట్రంలో కొందరు ఓటర్ల విషయంలో వైరుధ్యాలను డేటాబేస్ గుర్తించింది. క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం.. అందులోని 97 మంది తుది ఓటరు జాబితాలో చేర్పునకు అర్హులేనని ఓటరు నమోదు అధికారులు గుర్తించారు. అయితే వారి పేర్లను ఓటరు జాబితాలో పునరుద్ధరించేందుకు వారికి ఆప్షన్ అందుబాటులో లేదు. దీంతో రోల్‌బ్యాక్ ఆప్షన్ కోసం గోవా ప్రధాన ఎన్నికల అధికారి ఈసీకి విన్నవించాల్సి వచ్చింది. కానీ, వారి నుంచి



అనుమతులు లభించకపోవడంతో ఓటర్ల పేర్లు ఎంటర్ చేయలేకపోయారని, ఆ యాప్‌ను దిల్లీ నుంచి నియంత్రిస్తున్నారని జాతీయ మీడియా కథనం పేర్కొంది. గోవాలో ఓటరు జాబితాలో పేరు లేకపోతే.. కేవలం ఓటు మిస్ అవడమే గాకుండా, అనేక ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు కోల్పోతారు. ఇదే రాజకీయంగా తీవ్ర వివాదమవుతోంది. ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో లేని సూపర్‌స్పెషాలిటీ చికిత్సల (డయాలసిస్, యాంజియోప్లాస్టీ, ఓపెన్‌హార్ట్ సర్జరీ, అవయవ మార్పిడి, కీమోథెరపీ వంటివి)కు నిధులు సమకూర్చే గోవా మెడిక్లెయిమ్ పథకం కేవలం ఆ రాష్ట్ర ఓటర్లకు మాత్రమే అందుబాటులో ఉందని ఆ కథనం పేర్కొంది. దీనిపైనే థరూర్ స్పందించారు. ''ఇది తీవ్రమైన విషయం. దీని ద్వారా భారత పౌరుల రాజ్యాంగ హక్కులు కోల్పోవడమే గాకుండా డయాలసిస్ వంటి పలు చికిత్సలకూ దూరం అవుతున్నారు. రాజకీయ కుతంత్రాలే చెడ్డవనుకుంటే.. ఇక అమానవీయ ప్రవర్తన ఏమాత్రం సహించలేనిది. దీనిపై ఎన్నికల సంఘం క్షమాపణ చెప్పాలి. రాజీనామా కోరడం చాలా చిన్న డిమాండ్. ఈ వినాశకరమైన సాఫ్ట్‌వేర్‌ను వెంటనే రద్దు చేయాలి. అది కలిగించిన నష్టాన్ని సరిదిద్దడం అత్యావశ్యకం'' అని థరూర్ పోస్టు పెట్టారు.

## పశ్చిమాసియా మోహరింపుతో తీవ్ర మానసిక క్షోభ..

## అమెరికా నావికాదళంలో ఆందోళన

**వాషింగ్టన్ :** పశ్చిమాసియా ఘర్షణలు ప్రపంచ దేశాలను ఇంధన సంక్షోభంలోకి నెడితే.. యుద్ధరంగంలోని సైనికులకు మానసిక క్షోభను మిగుల్చుతున్నాయి. దాంతో యూఎస్ఎస్ అబ్రహాం లింకన్ నౌకలోని అమెరికా నావికులు సముద్రంలోకి దూకి ఆత్మహత్యకు యత్నించారని గతంలో వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ విషయాన్ని అమెరికా నేవీ తాత్కాలిక సెక్రటరీ హాంగ్ కావో ధ్రువీకరించారు. సెనెట్‌కు లేఖ రూపంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఆత్మహత్యాయత్నాలు జరిగిన మాట నిజమే కానీ.. ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదని పేర్కొన్నారు. ఇరాన్‌తో యుద్ధం ప్రారంభం కావడానికి ముందే అమెరికా పలు యుద్ధ నౌకలను పశ్చిమాసియా జలాల్లో మోహరించిన సంగతి తెలిసిందే. అబ్రహాం లింకన్‌లో ఐదు వేలమందికిపైగా నావికులు, మెరైన్లు విధులు నిర్వర్తించారు రికార్డు స్థాయిలో 250 రోజులుగా అది సముద్రజలాల్లోనే ఆ నౌక ఉంది. సుదీర్ఘ మోపరింపు, దాంతో కొరవడిన కనీస సదుపాయాలు, కుటుంబాలకు దూరంగా ఉండటంతో మానసిక ఒత్తిడి సిబ్బందిపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. అత్యహత్యయత్నాల ఘటన తర్వాత సెప్టెంబర్ ప్రారంభంలో ఆ నౌకలోని సిబ్బందికి విశ్రాంతి ఇచ్చారు.



## వైట్‌హౌస్‌లో మీడియా సంస్థల పునరుద్ధరణ




**వాషింగ్టన్ :** వైట్‌హౌస్ నుండి సిఎన్ఎన్, ఎంఎస్‌నౌ, పొలిటికో వార్తా సంస్థలను నిషేధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని ఫెడరల్ జడ్జి తాత్కాలికంగా నిలిపివేశారు. యుఎస్ జిల్లా జడ్జి తిమోతీ కెల్లీ గురువారం 14 రోజుల పాటు అమల్లో ఉండే తాత్కాలిక నిరోధక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయా మీడియా సంస్థలకు వైట్‌హౌస్‌లో ప్రవేశం పునరుద్ధరించాలని ఆదేశించారు. తమ వార్తా కథనాల కారణంగానే తమను లక్ష్యంగా చేసుకున్నారని, ఇది మొదటి సవరణ హక్కుల ఉల్లంఘన అని మీడియా సంస్థలు వాదించాయి.

## దేశం పేరు సవరణ

## నౌరూ స్థానంలో ఇకపై నౌయెరో

**న్యూయార్క్:** ప్రపంచ నాయకులు సమావేశమైన అతిపెద్ద వేదిక ముందు డేవిడ్ అడియాంగ్ గంభీరమైన స్వరంతో ఓ ప్రకటన చేశారు. ''చాలా ఏళ్లుగా ప్రపంచానికి 'నౌరూ'గా పరిచయం ఉన్న మా దేశం ఇప్పుడు 'నౌయెరో'గా తన గతకాలపు నామం, ఉచ్చారణకు మారుతోంది. ఈ పేర్లు దాదాపుగా ఒకేలా ఉన్నా.. ఇది మా దేశం తనను తాను పునర్నిర్మించుకోడానికి, ఒక బ్రాండును సృష్టించుకోడానికి చేస్తున్న ప్రయత్నానికి ప్రతీక. ఒక సత్యాన్ని ధ్రువీకరించే ప్రక్రియ'' అన్నారు. 8 చదరపు మైళ్ల విస్తీర్ణం, 12 వేల జనాభా గల దక్షిణ పసిఫిక్ దీవి నౌయెరోకు అధ్యక్షుడైన డేవిడ్ అడియాంగ్ ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో చేసిన ప్రసంగమిది. ప్రపంచంలో అతి చిన్న దేశాల్లో 'నౌయెరో' మూడోస్థానంలో ఉంది. బ్రిటన్,

న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, జర్మనీ దేశాల వలస పాలన కింద సుదీర్ఘకాలం గడిపిన ఈ దీవి 1968లో స్వతంత్ర దేశంగా మారింది. డేవిడ్ చేసిన అధికారిక ప్రకటనతో ఇప్పుడు ఈ దేశ అంతర్జాతీయ కోడ్ 'ఎన్ఆర్‌యూ' నుంచి 'ఎన్ఆర్‌వో'గా మారనుంది. గత శతాబ్ద కాలంలో ఆధునికీకరణ నుంచి వలస పాలనను తిరస్కరించడం వంటి పలు కారణాలతో చాలా దేశాలు తమ పేర్లను మార్చుకున్నాయి. జింబాబ్వే (రొడీషియా), థాయ్‌లాండ్ (సైయామ్), ఇరాన్ (పర్షియా), మయన్మార్ (బర్మా), శ్రీలంక (సిలోన్), తుర్కియే (టర్కీ) వంటి దేశాలు ఈ కోవలో ఉన్నాయి.

## గిరిజన గూడాల్లోనూ నాణ్యమైన విద్యే లక్ష్యం: మంత్రి సీతక్క



**మామిడిగూడెం, కొమరం భీమ్‌నగర్ కాలనీల్లో కంటైనర్ పాఠశాలల ప్రారంభం**

**ములుగు/ఏటూరునాగారం, సెప్టెంబర్ 24 (వుదయం ప్రతినిధి) :**

మారుమూల గిరిజన గూడాల్లోని చిన్నారులకు నాణ్యమైన విద్యను చేరువ చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) పేర్కొన్నారు. గురువారం రోజున ఏటూరునాగారం మండలం మామిడిగూడెం (సింగరేణి సి.ఎస్.ఆర్ నిధులు రూ.15 లక్షలు), కొమరం భీమ్‌నగర్ కాలనీ (పంచాయతీరాజ్ సి.ఎస్.ఆర్ నిధులు రూ.5 లక్షలు)లలో నూతనంగా ఏర్పాటు చేసిన కంటైనర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దట్టమైన అటవీ ప్రాంతాల్లోనూ విద్యకు ఆటంకం కలగకుండా ఉండేందుకే ఈ కంటైనర్ పాఠశాలలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. మామిడిగూడెం గొత్తికోయ గిరిజన విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో చూపుతున్న ప్రతిభ పట్టణ విద్యార్థులకు ఏమాత్రం తీసిపోదని అభినందించారు. విద్యార్థులను అద్భుతంగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు ఇర్ప మధు, సారంగం సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. అనంతరం కలెక్టర్‌తో కలిసి విద్యార్థులకు యూనిఫారాలు, బూట్లు పంపిణీ చేసి, వారితో కలిసి అల్పాహారం స్వీకరించారు. గ్రామంలో త్వరలోనే తాగునీటి బోరు, సౌర విద్యుత్ వసతి కల్పిస్తామని, అటవీ అనుమతులు సాధించి రహదారులతో పాటు అంబులెన్స్ సదుపాయం మెరుగుపరుస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం అదనపు ఎస్పీ మనన్ భట్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా విద్యాశాఖాధికారి ఎ. సిద్ధార్థరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## బాలిక సదనం నుంచి చట్టబద్ధంగా మరో దత్తత



**దంపతులకు పాపను అందజేసిన హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

**హనుమకొండ, సెప్టెంబర్ 24 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

ప్రభుత్వ బాలికల సదనంలో రక్షణ, సంరక్షణ పొందుతూ విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న ఒక బాలికను, ఆమె ఇష్టానుసారమే చట్టబద్ధంగా దత్తత ఇచ్చారు. కేంద్ర దత్తత ప్రాధికార సంస్థ (CARA) ఆదేశాల మేరకు గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ నల్గొండ జిల్లాకు చెందిన దంపతులకు ఈ చిన్నారిని అధికారికంగా అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా చట్టబద్ధంగా జరిగే దత్తత ప్రక్రియే ఎంతో శ్రేయస్కరమని పేర్కొన్నారు. చిన్నారిని సాదరంగా స్వీకరించిన దంపతులతో పాటు బాలికతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. పాపను అత్యంత ఆప్యాయంగా చూసుకోవాలని, ఉన్నత చదువులు చదివించి మంచి భవిష్యత్తు అందించాలని ఆ దంపతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎ.విశ్వజ, బాల రక్షా భవన్ కోఆర్డినేటర్ సిహెచ్. అవంతి, ప్రభుత్వ బాలికల సదనం సూపరింటెండెంట్ ఎం. కల్యాణి, ఇంచార్జి డిసిపిఓ ఎస్. ప్రవీణ్ కుమార్, సోషల్ వర్కర్ సంగి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షా లు కురుస్తున్నందున డివిజన్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ**

**భద్రాచలం 24 సెప్టెంబర్ 26 (వుదయం ప్రతినిధి):**



భద్రాచలం డివిజన్ పరిధిలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరి నదికి వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున నది పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, కాలువలు మరియు ఇతర నీటి వనరుల సమీపంలో నివసించే ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఈరోజు నుంచి మరింత అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప అనవసర ప్రయాణాలను పూర్తిగా నివారించాలని కోరారు. ముఖ్యంగా వర్షాల సమయంలో రహదారులపై నీరు ప్రవహించే ప్రాంతాలు, కాజ్‌వేలు, వంతెనల వద్ద అత్యంత జాగ్రత్తగా ఉండాలని, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లో చెరువులు, కుంటలు, కాలువలు, వాగులు, గోదావరి నది మరియు ఇతర నీటి వనరుల వద్దకు వెళ్లకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సబ్ కలెక్టర్ సూచించారు. వర్షాల సమయంలో చేపలు పట్టడం, ఈత కొట్టడం, స్నానం చేయడం లేదా ఇతర అవసరాల కోసం నీటిలోకి దిగడం పూర్తిగా నివారించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా పిల్లలు, యువకులు నీటి వనరుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. గోదావరి నదిలో నీటిమట్టం పెరిగే అవకాశం ఉన్నందున నది తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ, అధికారుల సూచనలను పాటించాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాల ప్రజలు అవసరమైన వస్తువులను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో అధికారులు సూచించిన సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సహకరించాలని సూచించారు. వర్షాల సమయంలో రహదారులపై చెట్లు, విద్యుత్ స్తంభాలు లేదా ఇతర వస్తువులు పడిపోయిన సందర్భాల్లో వాటిని తొలగించే ప్రయత్నం ప్రజలు స్వయంగా చేయకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. వర్షాల కారణంగా రహదారులు దెబ్బతినడం, రాకపోకలకు అంతరాయం కలగడం లేదా నీటి ప్రవాహం పెరగడం వంటి పరిస్థితులు ఏర్పడితే ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. వాతావరణ శాఖ మరియు జిల్లా అధికారుల నుంచి వెలువడే వర్ష సూచనలు, వరద హెచ్చరికలు, అత్యవసర సూచనలు మరియు ఇతర ఆదేశాలను ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా తప్పనిసరిగా పాటించాలని సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ సూచించారు. అత్యవసర పరిస్థితి ఏర్పడిన వెంటనే సంబంధిత రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, విద్యుత్, పంచాయతీరాజ్ మరియు ఇతర శాఖల అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. భారీ వర్షాల సమయంలో అప్రమత్తతే ప్రధాన రక్షణ చర్య అని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ తమ కుటుంబ సభ్యులు, ముఖ్యంగా పిల్లలు మరియు వృద్ధుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు.

## భూసేకరణ ప్రక్రియలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలి



**జయశంకర్ భూపాలపల్లి: సెప్టెంబర్ 24(వుదయం జిల్లా ప్రతినిధి):**

జిల్లాలో వివిధ అభివృద్ధి, సంక్షేమ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను చట్టబద్ధంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని భూ సేకరణ చట్టం, నిబంధనలు మరియు పారదర్శకంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ రెవెన్యూ అధికారులకు సూచించారు. భూ సేకరణ విధివిధాన కార్యాలయంలో భూ సేకరణలో భూ సేకరణ చట్టాలు, నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయస్థానాల తీర్పులపై రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి హెచ్ఎండీఏ, టిజిఐఐసిలో ఓఎస్డీగా విధులు నిర్వహిస్తున్న మనోహర్ తో కలిసి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇరిగేషన్, సింగరేణి, జెన్‌కో, జాతీయ రహదారులు తదితర అభివృద్ధి ప్రాజెక్టుల కోసం భూసేకరణ జరుగనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో భూ సేకరణ జరిగిందని, అర్హులైన రైతులకు చట్టప్రకారం పరిహారం, పునరావాసం, పునరావాస ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ సేకరణ విధి తరణ సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ జాప్యానికి తావులేకుండా చూడాలని స్పష్టం చేశారు. అర్హులైన ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా, అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఓఎస్డీ మనోహర్ తెలిపారు భూసేకరణ చట్టాలకు అనుగుణంగా ప్రతి దశను పక్కాగా నమోదు చేయాలన్నారు. ప్రక్రియకు సంబంధించిన మినిట్స్‌ను నమోదు చేయడంతో పాటు అవసరమైన చోట వీడియో రికార్డింగ్ చేపట్టాలని సూచించారు. అసైన్డ్, ప్రభుత్వ భూములకు సంబంధించి తలెత్తే వివాదాలను నిబంధనల ప్రకారం విచారించి పరిష్కరించాలని తెలిపారు. భూముల్లో సాగు చేసుకుంటున్న వారి అర్హతలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. భూసేకరణలో భూమి విస్తీర్ణం, రికార్డులు, ప్రయోజనాలు తదితర అంశాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని మనోహర్ సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, ఏఓ శ్రీనివాసులు, అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలకు బృందాలు సిద్ధం కమిషనర్ టి. వెంకన్న

**– అత్యవసర సేవలకు కంట్రోల్ రూమ్ నెంబర్లు విడుదల**

**వరంగల్ టౌన్, సెప్టెంబర్ 24 (వుదయం ప్రతినిధి) :**



రానున్న రెండు రోజుల్లో నగరాన్ని భారీ వర్షాలు ముంచెత్తే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని బల్దియా కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. గురువారం ఇంజనీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్, డీఆర్ఎఫ్ విభాగాల అధికారులతో ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటిముంపు ప్రాంతాలు, నిలిచిన వరద నీరు, చెట్లు విరిగిపడటం వంటి అత్యవసర పరిస్థితులను వెంటనే పరిష్కరించేందుకు జెసిబిలు, డీవాటరింగ్ మోటార్లు, ట్రాక్టర్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు, అత్యవసర సమాచారం స్వీకరించడానికి జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో 24 గంటల కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. వర్షాల వల్ల ఏవైనా సమస్యలు ఎదురైతే ప్రజలు వెంటనే కింది నంబర్లను సంప్రదించాలని కమిషనర్ కోరారు:

టోల్‌ఫ్రీ నంబర్: 1800 425 1980

కంట్రోల్ రూమ్: 9701999645


వాట్సాప్ (WhatsApp): 9701999676

## భారీ వర్ష సూచన..24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండాలి : జిల్లా కలెక్టర్**

**నాలాల్లో చెత్త తీయండి, యంత్రాలు సిద్ధం చేయండి: జిల్లా కలెక్టర్**

**హనుమకొండ, సెప్టెంబర్ 24 (వుదయం జిల్లా ప్రతినిధి) :**



జిల్లాలో గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ఆమె గూగుల్ మీట్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. చెరువులు, వాగులు, వంకల నీటిమట్టాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలి. ప్రమాదకర ప్రాంతాల్లో ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలి. గతంలో వరద ముంపునకు గురైన ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలి. రహదారులపైకి వరద నీరు చేరకుండా చూడాలి. చెత్త తొలగింపు, యంత్రాల సిద్ధం, గ్రేటర్ వరంగల్ పరిధిలోని నాలాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్, చెత్తను వెంటనే తొలగించాలి. అత్యవసర సహాయక చర్యల కోసం జేసీబీలు, ఇతర యంత్రాలను సిద్ధంగా ఉంచాలి.

కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌లో అధికారులు 24 గంటలు అందుబాటులో ఉంటూ ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి. క్షేత్రస్థాయిలో అధికారులు స్థానికంగానే ఉంటూ, ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందించి సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు, వివిధ శాఖల ఈఈలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## విప్లవోద్యమ వేగుచుక్క కామ్రేడ్ ముఖ్తార్ పాష

**సిపిఐ(ఎం.ఎల్)న్యూడెమోక్రసీ.రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గౌని ఐలయ్య**

**మహబూబాబాద్ సెప్టెంబర్ 24(వుదయం ప్రతినిధి ):**




గోదావరిలోయ విప్లవోద్యమంలో కామ్రేడ్ ముఖ్తార్ పాష వేగుచుక్క అని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ గౌని ఐలయ్య అన్నారు. కొత్తపేటలో కామ్రేడ్ ముఖ్తార్ పాష 6వ వర్ధంతి సందర్భంగా స్మారక స్తూపం వద్ద నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ......

పోలీస్ పటేల్ కుటుంబంలో జన్మించిన కామ్రేడ్ ముఖ్తార్ పాష ఉన్నతమైన జీవితాన్ని వదిలిపెట్టి పేద ప్రజల కష్టాల కడగండ్లను తీర్చడం కోసం, నూతన ప్రజాస్వామ్యక విప్లవమే లక్ష్యంగా కొనసాగుతున్న ఉద్యమంలో కామ్రేడ్ ముఖ్తార్ పాష భాగస్వామ్యం అయ్యాడని అన్నారు. పార్టీ నిర్ణయం మేరకు ఉన్నత చదువులు మధ్యలో వదిలేసి కార్మిక, రైతు కూలీల సమస్యల సాధన కోసం అహర్నిశలు కృషి చేశాడని, నిత్యనిర్బంధాంలో సైతం పార్టీని నడిపించడంలో క్రియాశీలమైన పాత్రను పోషించాడని వారు కీర్తించారు. ఇల్లందు నియోజకవర్గంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ అభ్యర్థిగా ఆరు పర్యాయాలు గెలిపించడంలో తను చేసిన కృషి అభినందనీయమని, కార్యకర్తలను సమన్వయపరచడంలో, వారిని ముందుకు నడిపించడంలో కామ్రేడ్ ముఖ్తార్ పాష ఆచరించిన తీరు స్ఫూర్తిదాయకమని వారు తెలిపారు.

మంచి వాక్చాతుర్యం, విషయ పరిజ్ఞానం మెండుగా ఉన్న వ్యక్తి, శత్రు దాడులను, నిర్బంధాలను ఎదుర్కొంటూ మొక్కవోని ధైర్యంతో పార్టీని ముందుకు నడిపించిన ధీరుడు కామ్రేడ్ ముఖ్తార్ పాషన్న కొనియాడారు. ఆయన ఆశించిన లక్ష్యాన్ని, ఆయన ప్రయాణించిన మార్గంలో ఆశయాన్ని ముందుకు తీసుకపోవడమే ఆయనకిచ్చే ఘనమైన నివాళి అని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు కామ్రేడ్ మాదంశెట్టి నాగేశ్వరరావు, కామ్రేడ్ ఏపూరి వీరభద్రం, నాయకులు నేతకాని రాకేష్, బోనగిరి మధు, షేక్ యాకుబ్ పాషా, యాతం రమణారెడ్డి, కొదుమూరి నాగేశ్వరరావు,వీరబోయిన ఐలయ్య, మేరుగుమల్ల శంకర్,నిరంజన్, చల్లా కృష్ణ,మాచర్ల చిన్న సైదులు, కూనూరి యుగేందర్, ఊడుగుల ఐలయ్య,ఊకే శేషు, కస్నబోయిన స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ పి ఓల ద్వారా వ్యవసాయ ఎగుమతులను పెంచాలి

**– జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, సెప్టెంబర్ 24 (వుదయం ప్రతినిధి) :**




రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్ పి ఓ) ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను విశేషంగా ప్రోత్సహించాలని, రైతులు అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. గురువారం రోజున జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో 'అపెడా' భారత ప్రభుత్వ సంస్థ) ఆధ్వర్యంలో రైతులు, ఎఫ్ పి ఓలు, వ్యాపారులకు నిర్వహించిన జిల్లా స్థాయి ఎగుమతుల అవగాహన సదస్సుకు కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... అపెడా సేవలు వ్యవసాయ, ప్రాసెస్డ్ ఫుడ్ ఉత్పత్తుల ఎగుమతులకు అవసరమైన లైసెన్సులు, నాణ్యతా ప్రమాణాలు, సరఫరా గొలుసు (సప్లై చైన్) ఏర్పాటుకు అపెడా కీలకమైన నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుంది. ఎగుమతి అవకాశాలు: జిల్లాలో వరి సాగులో 26 శాతం (44 వేల ఎకరాలు) వాటా ఉన్న ఎంటియు 1010 పారాబాయిల్డ్ రకానికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఈ రకానికి విదేశీ మార్కెట్‌లో క్వింటాల్‌కు సుమారు ₹3,600 ధర లభిస్తోందని, ఇటీవల తెలంగాణ నుండి 22 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఫిలిప్పీన్స్‌కు ఎగుమతి చేశామని తెలిపారు.చిట్టిముత్యాలు బ్రాండింగ్: 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' (ఓడిఓపీ) కింద చిట్టిముత్యాలు బియ్యాన్ని ప్రీమియం బ్రాండ్‌గా తీర్చిదిద్దాలని, డీఎన్ఏ పరీక్షలు, నాణ్యమైన మిల్లింగ్ ద్వారా కల్తీ లేని ఉత్పత్తులను అందించాలని సూచించారు. రాబోయే 30 రోజుల్లో కొనుగోలుదారులు అమ్మకందారుల సమావేశాలు, ఎఫ్ పి ఓ మేళాలు నిర్వహించాలి. రాబోయే యాసంగి (2026-27) నుంచి అవశేషాల నియంత్రిత (Residuecontrolled) క్లస్టర్‌ను ప్రారంభించాలి. జిల్లాలోని 22 ఎఫ్ పిఓ లు, రైస్ మిల్లర్లు DGFT పోర్టల్ ద్వారా APEDA eRCMC నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.సమావేశంలో అపెడా (APEDA) అసిస్టెంట్ మేనేజర్ సుకేష్ పిపిటి (పిపిటి) ద్వారా ఎగుమతి ప్రక్రియపై వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె. అంబికా సోని, నాబార్డ్ డీడీఎం విజయ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రతిభ, ఉద్యానవన, మత్స్య శాఖల అధికారులు ఎఫ్ పి ఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

**భద్రాచలం 24 సెప్టెంబర్ 26 (వుదయం ప్రతినిధి) :**



2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ఉన్నత విద్యకు అవసరమైన సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న గురుకుల విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న సీట్లను అర్హత కలిగిన విద్యార్థులతో భర్తీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు, అలాగే జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లకు ఈ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు ఈనెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు తాము ప్రవేశం పొందాలనుకుంటున్న సంబంధిత గురుకుల పాఠశాల లేదా జూనియర్ కళాశాలలో తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. . అవసరమైన ధ్రువపత్రాలు లేకుండా హాజరైతే ప్రవేశ ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున విద్యార్థులు ముందుగానే అన్ని పత్రాలను సిద్ధం చేసుకుని రావాలని ఆయన కోరారు. ఖాళీ సీట్ల సంఖ్యకు అనుగుణంగా అర్హత కలిగిన విద్యార్థులకు నిబంధనల ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. గిరిజన విద్యార్థులకు విద్యా అవకాశాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థ ద్వారా అనేక సదుపాయాలను కల్పిస్తోందని ఆయన పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థినీ, విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన విద్యను నిష్ణాతులైన అధ్యాపక బృందం ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు ఈ స్పాట్ అడ్మిషన్ల ద్వారా ఖాళీగా ఉన్న సీట్లను అర్హులైన గిరిజన విద్యార్థులతో భర్తీ చేయడంతో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. బాలురకు అందుబాటులో ఉన్న విద్యాసంస్థలు, కోర్సుల వివరాలు: RJCCOE దమ్మపేటలో బాలురకు ఇంటర్ ప్రథమ సంవత్సరం CEC కోర్సు అందుబాటులో ఉంది. URJC దమ్మపేటలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మరియు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో MPC, BiPC గ్రూపులు ఉన్నాయి. RJCCOE కిన్నెరసానిలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో CEC, AT, ET గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. URJC కిన్నెరసానిలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మరియు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో MPC, BiPC గ్రూపులు ఉన్నాయి. RJC గుండాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో MPC, BiPC, CEC గ్రూపులు ఉన్నాయి. URJC గుండాలలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మరియు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో MPC, BiPC గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. URJC సింగరేణిలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మరియు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో MPC, BiPC గ్రూపులు ఉన్నాయి. URJC తిరుమలాయపాలెంలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మరియు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో MPC, BiPC గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. RJC కృష్ణసాగర్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో MPC, BiPC, CEC, HEC గ్రూపులు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. బాలికలకు అందుబాటులో ఉన్న విద్యాసంస్థలు, కోర్సుల వివరాలు: RJCCOE భద్రాచలంలో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి CEC, HEC, PSTT, CS, AT గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. URJC భద్రాచలంలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మరియు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో MPC, BiPC గ్రూపులు ఉన్నాయి. RJC సుదిమళ్లలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో MPC, BiPC, CEC, HEC గ్రూపులు అందుబాటులో ఉన్నాయి.

## అసిస్టెంట్ డివిజన్ ఇంజనీరింగ్ ట్రాన్స్ఫర్ ఆఫీసులో గణేష్ ఉత్సవాలు



**ఏడీఈ కట్కూరి శ్రీనివాస్ రెడ్డి అన్నదాతలు ఏడీఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఈ ప్రభాకర్ విద్యాసాగర్**

**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 24**

నల్గొండ పట్టణ కేంద్రంలో హైదరాబాద్ రోడ్డు వైపు అసిస్టెంట్ డివిజన్ ఇంజనీరింగ్ ట్రాన్స్ఫార్మ్స్ ఆఫీసులో గణేశుని ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు అన్నదాన 400 మంది కి అన్నదానం చేయడం జరిగింది. ప్రతి ఒక్కరు వచ్చి అన్నదానంలో పాల్గొని వినాయకుని ప్రసాదం స్వీకరించారని వారి మాటల్లో తెలిపారు ఈ కార్యక్రమం చేపట్టి కార్యక్రమం చేపట్టి ప్రతి సంవత్సరం ఇదే ఉత్సాహంతో ప్రత్యేక ఉద్యోగులు ఇక్కడికొచ్చి ప్రత్యేక పూజలు చేసుకొని తమ కోరికలు కోరుకొని వచ్చే సంవత్సరం నెరవేరుతాయి అని కమిటీని నిర్వాహకులు తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఏ శ్రీధర్ రెడ్డి సబ్ ఇంజనీరింగ్ మల్లికార్జున్ సత్యనారాయణ పాండు డి ఈ వినోద్ రెడ్డి రమేష్ కుమార్ గిరి రమేష్ రెడ్డి సీతా రామయ్య మల్లేష్ శ్రీనువాస్,వెంకటేష్,హరినాథ్ వంశీ సైదులు అంజయ్య శ్రీనువాస్ దామోదర్ రెడ్డి రాంరెడ్డి అంజయ్య ఎల్లయ్య ఏడీలు ఏఈలు కార్యవర్గ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించిన సీపీ శ్వేత, కమిషనర్ వెంకన్న



**వరంగల్ సిటీ, సెప్టెంబర్ 24 (వుదయం ప్రతినిధి) :**

నగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద సాగుతున్న గణేశ్ నిమజ్జన ప్రక్రియను వరంగల్ సీపీ శ్వేత, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ టి. వెంకన్న గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భద్రత, పారిశుద్ధ్యం, భక్తుల రాకపోకలను పరిశీలించిన అధికారులు, విగ్రహాల నిమజ్జన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

వర్షం కారణంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఉత్సవ కమిటీలు విగ్రహాలను త్వరగా నిమజ్జన కేంద్రాలకు తీసుకువచ్చేలా చూడాలని ఆదేశించారు. పోలీస్, మున్సిపల్, ఇరిగేషన్, వైద్య, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి నిమజ్జనం ప్రశాంతంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. నిమజ్జనం ముగిసిన వెంటనే వ్యర్థాలను తొలగించి పరిసరాలను శుభ్రం చేయాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రాజ్‌కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఇరిగేషన్ ఈఈ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు అండగా నిలబడే దమ్మున్న యూనియన్ టి జె ఎఫ్ దే



**వచ్చే నెల మొదటి వారంలో ఖమ్మం డివిజన్ మహాసభలు**

**టీజెఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి**

**ఖమ్మం వుదయం బ్యూరో సెప్టెంబర్ 24:**

జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా టీజెఎఫ్ అండగా ఉంటుందని, జర్నలిస్టుల కోసం నిలబడి కలబడే దమ్మున్న జర్నలిస్ట్ యూనియన్ టీజెఎఫ్ దే అని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీజెఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన టి యు డబ్ల్యూ జె (టి జె ఎఫ్) నగర కమిటీ, ఎలక్ట్రానిక్ మీడియా, ప్రెస్ క్లబ్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో చిర్రా రవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అక్రిడేషన్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల కోసం రాజీ లేని పోరాటాలు చేసిన ఘనత తమదే అన్నారు. వచ్చే నెల మొదటి వారంలో టి జె ఎఫ్ ఖమ్మం డివిజన్ మహాసభలు ఖమ్మంలో నిర్వహిస్తున్నామని,ఈ సందర్భంగా ఫెడరేషన్ యూనియన్ నుంచి వి5 బ్యూరో ఇన్చార్జ్ కెవి, విజన్ ఆంధ్ర బ్యూరో ఇన్చార్జ్ రామకృష్ణ,అశోక్, నాగేశ్వరరావు తదితరులు టీజేఎఫ్ యూనియన్ లో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మందులు ఉపేందర్, నగర ప్రధాన కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, అక్రిడేషన్ కమిటీ సభ్యులు నాగరాజు, నగర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు య లమందల జగదీష్, కరీష అశోక్, ఫోటోగ్రాఫర్ రవి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు,కోశాధికారి బిక్కి గోపి, ఉపాధ్యక్షులు పి. పానకాలరావు, ముత్యాల కోటేశ్వరరావు, పులి శ్రీను, రేపాక యాదగిరి, హుస్సేన్, సహాయ కార్యదర్శులు బోనగిరి యాదగిరి ఉల్లోజు రమేష్, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, రవీందర్, మీడియా ఇన్చార్జ్ తిరుపతిరావు, మహిళ ప్రతినిధులు వంగూరి ఈశ్వరి, రోజా, మాధవి, కిరణ్మయి, శ్రీదేవి, నాగలక్ష్మి, సీనియర్ నాయకులు ఉత్కంఠం శ్రీను,

సాయి కళ్యాణ్, ఎన్ టి వి సాయి, గౌరీ శంకర్, గోవింద్, నాగ శేఖర్, పెంటి వెంకటేశ్వర్లు, రవి ,లింగయ్య, నరసింహ రావు, భద్రం, రాంబాబు, లక్ష్మణ్, వెంకన్న, నాగరాజు, కూరపాటి నరేష్, పాల్గొన్నారు.

## యూజీడీ భూసేకరణను వేగవంతం చేయాలి



**– జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**

**హనుమకొండ, సెప్టెంబర్ 24 (వుదయం ప్రతినిధి) :**

గ్రేటర్ వరంగల్ నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో భూసేకరణ పురోగతిని ఆమె పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్టీపీలు), పంపింగ్, లిఫ్టింగ్ స్టేషన్ల ఏర్పాటుకు అవసరమైన 23 ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ భూముల సేకరణను శాఖల సమన్వయంతో ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, సీనియర్ ఇంజనీరింగ్ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## వృద్ధుల సంక్షేమం, సాధికారత వారోత్సవాలు ప్రారంభించిన అదనపు కలెక్టర్

**నిజామాబాద్, ఉదయం, సెప్టెంబర్24:**



అంతర్జతీయ వయో వృద్ధుల దినోత్సవ వారోత్సవాలలో భాగముగా గురు వారం రోజు "వృద్ధుల సంక్షేమం మరియు సాధికారత వారోత్సవం – 2026 ప్రారంభ" కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ (LB), నిజామాబాద్ చాంబర్ లో నిర్వహించారు.ఈ కార్యక్రమములో వయో వృద్ధుల సంక్షేమానికై ప్రభుత్వము ద్వారా చేపట్టబడే వివిధ రకాల పతకములను మరియు వయో వృద్ధుల సంక్షేమానికి ఏర్పాటు చేయబడిన చట్టాల వివరాలను, కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమములో శ్రీయుత అదనపు కలెక్టర్ (LB) భుజంగ రావు, జిల్లా సంక్షేమ అధికారిణి, డి. సౌందర్య, పర్యవేక్షకులు, శ్రీనివాస్, రేఖ, జిల్లా స్థాయి సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు, ఆజనేయులు,మాయావార్ రాజేశ్వర్ గారు, నారాయణ రెడ్డి, ఫయాజుద్దీన్, వాసవి క్లబ్ రవి, మరియు జిల్లా సీనియర్ సిటిజన్ ఫోరమ్స్/ అసోసియేషన్స్/ ట్రస్టులు/ ఫౌండేషన్స్, అధ్యక్షులు, కార్యదర్శులు మరియు ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

**- అనుమతి లేని డీజేలపై కేసులు... డీఎస్పీ**

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 24 (ఉదయం ప్రతినిధి):**



గణపతి నిమజ్జనంలో నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని, అధిక శబ్దంతో ప్రజలకు అసౌకర్యం కలిగించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించడాన్ని ఉపేక్షించబోమని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి హెచ్చరించారు. సెప్టెంబర్ 23న కాచ్కంటి గ్రామంలో నిమజ్జన బందోబస్తు సందర్భంగా అనుమతి లేకుండా వాహనంలో డీజే సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసి అధిక శబ్దంతో వినియోగించారని, దీంతో డీజే యజమాని వావల్కర్ కళ్యాణ్‌పై ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.తలమడుగు పోలీస్ స్టేషన్ పరిధిలోని భరంపూర్ గ్రామంలో రెండు గణపతి మండపాల మధ్య డీజే సౌండ్‌పై పోటీ ఏర్పడి గొడవలకు దారితీసే పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. పోలీసుల ఆదేశాలను ఉల్లంఘిస్తూ డీజేలు నిర్వహించిన ముగ్గురిపై కేసు నమోదు చేసి, రెండు డీజే సౌండ్ సిస్టమ్‌లతో పాటు బొలెరో మ్యాక్స్ వాహనాన్ని సీజ్ చేసినట్లు వెల్లడించారు.గణపతి నిమజ్జనంలో డీజేలు ఏర్పాటు చేయాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని డీఎస్పీ స్పష్టం చేశారు. 30 పోలీస్ యాక్ట్, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. అధిక శబ్దంతో డీజేలు నిర్వహించడం, పోలీసుల సూచనలు పాటించకపోవడం, ఇతర మండపాలతో పోటీకి దిగడం, గొడవలకు దారితీసేలా వ్యవహరించడం వంటి చర్యలను ఉపేక్షించబోమన్నారు.ప్రజలు పోలీసులకు సహకరించి గణపతి నిమజ్జన కార్యక్రమాలను భక్తిభావంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని డీఎస్పీ కోరారు.

## లక్ష ఎల్ ఓ సి అందజేసిన ఎమ్మెల్యే



**ఆసిఫాబాద్ (ఉదయం ప్రతినిధి)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం నాగంపేట గ్రామానికి చెందిన అఫ్సానా బేగం కి హైదరాబాద్ లోని ప్రఖ్యాత నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసమై సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ. 1 లక్ష లెటర్ ఆఫ్ క్రెడిట్ ను సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు అందజేశారు.

## బోసి గ్రామంలో కర్ర వినాయకునికి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ప్రత్యేక పూజలు



**నిర్మల్ జిల్లా (ఉదయం ప్రతినిధి)24 సెప్టెంబర్ 2026**

తానూరు మండలం బోసి గ్రామంలోని ప్రసిద్ధ కర్ర వినాయకుని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన కలెక్టర్ కు పూజారులు, గ్రామస్తులు స్వాగతం పలికారు. స్థానిక శివాలయంలోని గణేశునికి, శివునికి పూజలు చేశారు. అనంతరం కలెక్టర్ కు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వినాయక ఉత్సవాలు మొత్తం భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. పండుగలన్నీ కలిసిమెలిసి జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

## 30వ తేదీ సీఎం చేతుల మీదుగా నూతన కలెక్టర్ ప్రారంభోత్సవం

**రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**కరీంనగర్ సెప్టెంబర్ 24 (ఉదయం ప్రతినిధి):**



కరీంనగర్ జిల్లా నూతన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ను మరియు ప్రధాన ద్వారాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయాలని, స్వాగతం తోరణాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. అలాగే కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. సభ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. అలాగే నూతనంగా నిర్మించిన హెలిప్యాడ్ ను మంత్రి పరిశీలించారు. అన్ని శాఖల అధికారులు ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని ఏటువంటి పొరపాట్లు జరగకుండా మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్ అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి డిఆర్ఓ స్వామి ఆర్డీవో షర్మిల ప్రజా ప్రతినిధులు ముఖ్య నేతలు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## రీ సర్వే పనులను పకడ్బందీగా వేగవంతంగా పూర్తి చేయాలి...

**జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**

**జగిత్యాల సెప్టెంబర్ 23 (ఉదయం ప్రతినిధి)**

బీర్ పూర్ మండలం మోతి నగర్ డొంకేశ్వర్ గ్రామాల్లో నాన్ కెడస్ట్రాల్ రీసర్వే ఎంజాయ్ మెంట్ రీ సర్వే పనులను జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రీ సర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటివరకు ఎంత విస్తీర్ణంలో రీ సర్వే పూర్తయింది ఇంకా ఎంత మేర చేపట్టాల్సి ఉంది పనులు ఎన్ని రోజుల్లో పూర్తవుతాయనే వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు ఆయా గ్రామాల్లో భూమి విస్తీర్ణం ఎంత ఉందని ఆరా తీశారు. సర్వే నంబర్ల వారీగా ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితత్వంతో రీ సర్వే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ రీసర్వేలో భాగంగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అత్యాధునిక సర్వే పరికరాల సహాయంతో వ్యవసాయ భూములను సర్వే చేయనున్నట్లు చెప్పారు సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలను ప్రజలకు ప్రకటిస్తామని పేర్కొన్నారు. గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియను నిర్వ



హించాలని ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మొదట గ్రామ బౌండరీ పై లైసెన్సుడ్ సర్వేయర్లు మండల సర్వేలు కలిసి రీ సర్వే చేస్తారని తర్వాత ఒక్కొక్క రైతు వారిగా రీ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. జగిత్యాల జిల్లాలో మొదటి విడతగా 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ప్రస్తుతం ఎంజాయ్మెంట్ రీసర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు. నడికుడ గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీ సర్వే చేపడుతున్నామని తెలిపారు. అనంతరం బీర్ పూర్ లోని కేజీబీవి పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు పాఠశాలలోని విద్యార్థులకు వండుతున్న వంటలను కిచెన్, స్టోర్ రూమ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నాణ్యమైన రుచికరమైన భోజనం విద్యార్థులకు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతం ఉపాధ్యాయుల బోధన వివరాలను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో జగిత్యాల మధుసూదన్ తహసీల్దార్ సర్వేయర్ రెవెన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## తాండ్ర అక్షిత రాణి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది...

## రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**పెద్దపల్లి, సెప్టెంబర్ 24 (ఉదయం ప్రతినిధి)**

సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామంలో ఇటీవల హత్యకు గురైన తాండ్ర అక్షిత రాణి తల్లిదండ్రులను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ పరామర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్మాట్లాడుతూ, అక్షిత రాణి హత్య ఘటనలో నిందితులకు కఠిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని అక్షిత రాణి హత్య ఘటనకు బాధ్యులైన వారిని ప్రత్యేక దర్యాప్తు ద్వారా గుర్తించి, చట్ట ప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని, నిందితులపై చార్జిషీట్ నమోదు చేసి, కేసును పటిష్టంగా దర్యాప్తు చేసేలా పోలీసు శాఖకు ఆదేశాలు ఇస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా బాధిత కుటుంబానికి రూ. 4.12 లక్షల పరిహారం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మరో రూ. 4,12,000 అందజేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి స్థానిక ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇల్లుతో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తామని ప్రకటించినందుకు ఎమ్మెల్యే విజయరమణారావుకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.ఈ ప్రాంతంలోపుట్టి పెరిగిన వ్యక్తిగా బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా అన్ని విధాలుగా అండగా ఉంటానని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని, ఘటనకు బాధ్యులైన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ, అక్షిత రాణి కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసే రూ.5 లక్షల ఇందిరమ్మ ఇంటితో పాటు, ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇటుక,



సిమెంట్, కంకర తదితర సామగ్రిని సమకూర్చి, కుటుంబంపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా ఇంటి నిర్మాణం పూర్తయ్యేలా తానే దగ్గరుండి బాధ్యత తీసుకుంటానని తెలిపారు. బాధిత కుటుంబంలో ఒకరికి కాంట్రాక్ట్ లేదా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ హామీ ఇచ్చారు. నిందితులు ఎవరైనా సరే చట్టం పరిధిలో వారికి కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని అన్నారు. చట్టంలో ఉన్న నిబంధనల మేరకు గరిష్ఠ శిక్ష పడేలా దర్యాప్తు, న్యాయపరమైన ప్రక్రియను పటిష్టంగా కొనసాగిస్తామని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ విప్ పేర్కొన్నారు. గతంలో సుల్తానాబాద్‌లో జరిగిన ఘటనలో 24 గంటలు గడవకముందే నిందితుడిని పోలీసులు పట్టుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుత ఘటనపై దర్యాప్తు కూడా వేగంగా కొనసాగుతోందని, ఇప్పటికే సుమారు 90 నుంచి 95 శాతం వరకు క్లూలను సేకరించినట్లు తెలిపారు. రానున్న ఒకటి రెండు రోజుల్లో దర్యాప్తు పూర్తయ్యే అవకాశం ఉందని, నిందితులకు చట్ట ప్రకారం శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో మహిళలపై వేధింపులకు పాల్పడిన వాళ్లు ఎంతటి వారైనా శిక్షించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం బాధిత కుటుంబానికి 4 లక్షల 12 వేల 500 రూపాయలు చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్లు , సంబంధిత ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, జిల్లా అధికారులు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ భోజనంపై కలెక్టర్ ఆరా!

**మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం..**

**పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి**

**రాజన్న సిరిసిల్ల,సెప్టెంబర్ 24 (ఉదయం ప్రతినిధి):**



విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్‌ను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అధికారులు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. హాస్టల్‌లోని విద్యార్థుల సంఖ్య, వారి హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెనూ చార్ట్‌ను పరిశీలించి, వంటగది, గోదాంలో నిల్వ చేసిన బియ్యం, పప్పులు, కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. ఆ రోజు మెనూ ప్రకారం భోజనం సిద్ధం చేస్తున్నారా? అని పరిశీలించారు. వసతి గదులను పరిశీలించిన కలెక్టర్ హాస్టల్ఆవరణను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు అవసరమైన వసతులు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులు హాస్టల్ లో అందుతున్న వసతులను సద్వినియోగం చేసుకుని, ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని కలెక్టర్ సూచించారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించే దిశగా కష్టపడి చదవాలని ఆకాంక్షించారు.

## ధర్మపురిలో నాసిరకం డ్రైనేజీ పనులపై బీఆర్ఎస్ నిరసన

**వారం రోజులకే కూలిన 12వ వార్డు డ్రైనేజీ**

**ప్రజాధనం వృథా చేస్తున్నారు**

**మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి**

**కాంట్రాక్టర్‌పై చర్యలు తీసు కోవాలని,తక్షణమే పునర్ని ర్మించాలి**

**ధర్మపురి,సెప్టెంబర్ 24 (ఉదయం ప్రతినిధి):**



ధర్మపురి పట్టణంలో అభివృద్ధి పనుల పేరుతో జరుగుతున్న నాసిరకం పనులపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని 12వ వార్డులో నూతనంగా నిర్మించిన డ్రైనేజీ కేవలం వారం రోజులకే కూలిపోవడంతో గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నాయ కులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భం గా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, మండల కన్వీనర్ అయ్యోరి రాజేష్ కుమార్ మాట్లాడుతూ ఆగమేఘాలపై పనులు చేపట్టి నాణ్య తా ప్రమాణాలు గాలికి వదిలేస్తు న్నారని ఆరోపించారు. ఏడాది క్రితం ఇదే వార్డులో డ్రైనేజీ నిర్మాణం కారణంగా ఓ నిరుపేద ఇల్లు కూలిపోయిన ఘటనను గుర్తుచేశారు. మున్సిపల్ వాహ నాలను కాంట్రాక్టర్ల కోసం వాడ టంపై మున్సిపల్ కమిషనర్ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.అభివృద్ధికి సహకరి స్తామని, కానీ ప్రజాధనాన్ని వృథాచేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కూలిపోయిన డ్రైనేజీని వెంటనే నాణ్యతతో పునర్నిర్మించి, ఇళ్లలోకి మురుగునీరు చేర కుండా తగి న చర్యలు తీసుకో వాలని కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ బండారి రంజిత్, సీనియర్నాయకులు ఒడ్నాల మల్లేశం, సంగి శేఖర్, చిలువేరి శ్యామ్ సుందర్, చిర్నెని నర్సయ్య, బండారి అశో క్, చుక్క రవి, తరాల కార్తీక్, అనంతుల లక్ష్మణ్, జెట్టి రాజన్న, ఎస్.డి. ఆసిఫ్, నక్క రాజేందర్, ముత్తినేని లక్ష్మణ్, కళ్లెం రాజిరెడ్డి, మోలుగూరి ప్రశాంత్, నూనె సాయి, మూటపెల్లి రాహుల్ తదితరులు.

## ధర్మపురి మండల వార్డు సభ్యుల ఇంచార్జ్‌గా ద్యావనపల్లి కేదార్ నియామకం

**తెలంగాణ వార్డ్ మెంబర్స్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి**






**ధర్మపురి సెప్టెంబర్ 23 (ఉదయం ప్రతినిధి):**

రాష్ట్రంలో వార్డు సభ్యుల సంక్షేమాన్ని కాపాడటంతోపాటు, వారిగళాన్ని బలంగా వినిపించేందుకు తెలంగాణ వార్డ్ మెంబర్స్ ఫోరమ్ తన యంత్రాంగాన్ని మరింత పటిష్టం చేస్తోంది. ధర్మపురి మండల ఇంచార్జ్‌గా ద్యావనపల్లి కేదార్ ను నియమిస్తూ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షు రాలు నాగబెల్లి జ్యోతి అధికారి కంగా నియామక పత్రం అందజేశారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని ఫోరమ్ కార్యాలయం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. మండల స్థాయిలో వార్డు సభ్యుల సమస్యలపై పోరాడుతూ, సంస్థ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లో కి తీసుకెళ్లడంలో నూతన ఇంచార్జ్ కీలకపాత్ర పోషిస్తారని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.కేదార్ నాయకత్వ ప్రతిభ, అంకితభావం సంస్థను మరింత ముందుకు నడిపిస్తా యని వారు విశ్వాసం వెలిబుచ్చారు. మండల ఇంచార్జ్‌గా నియమితులైన ద్యావ నపల్లి కేదార్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకం నిలబెట్టుకుం టానని ఫోరమ్ అభివృద్ధి కి కృషి చేస్తానని తెలిపారు. కేదార్ కు పలువురు ఫోరమ్ ప్రతినిధులు,స్థానిక నాయకులు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

## వరి ధాన్యం నిల్వకు ప్రైవేట్ ఫంక్షన్ హాల్ పరిశీలన

**కామారెడ్డి, సెప్టెంబర్ 24 (ఉదయం ప్రతినిధి):**



ఎల్లారెడ్డి డివిజన్‌లోని లింగంపేట మండలంలోని వరి ధాన్యం నిల్వ కోసం గోదాం తాత్కాలిక నిల్వ కేంద్రంగా వినియోగించేందుకు అందుబాటులో ఉన్న ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఫంక్షన్ హాల్‌లో అందుబాటులో ఉన్న స్థల విస్తీర్ణం, నేల పరిస్థితి, రహదారి సౌకర్యం, ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఉన్న అవకాశాలు, వెంటిలేషన్ తదితర అంశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వరి ధాన్యం నిల్వకు ప్రాంగణం ఎంత వరకు అనుకూలంగా ఉంటుందనే విషయంపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వరి ధాన్యం సేకరణ సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన నిల్వ సామర్థ్యాన్ని ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న ప్రాంగణంలో నిల్వ చేయగల ధాన్యం పరిమాణాన్ని అంచనా వేసి, అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అలాగే CAP (Cover and Plinth) పద్ధతిలో ధాన్యం నిల్వ చేసే అవకాశాలను కూడా పరిశీలించాలని సూచించారు. సాంకేతిక, మౌలిక సదుపాయాలు, నిల్వ సామర్థ్యం, రవాణా సౌకర్యాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర సాధ్యాసాధ్యాల నివేదికను సిద్ధం చేసి తదుపరి చర్యల కోసం సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ప్రభాకర్, సివిల్ సప్లైస్ అధికారి వెంకటేష్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ ప్రవీణ్, ఎంపీవో, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ ఇరిగేషన్, ఏఈ ఆర్అండ్‌బీ, ఏఈ మిషన్ భగీరథ, డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్, పంచాయతీ కార్యదర్శి, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనాలు ప్రశాంత వాతవరణంలో జరుపుకోవాలి

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

**కామారెడ్డి, సెప్టెంబర్ 24 (ఉదయం ప్రతినిధి):**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని టేక్రియాల్ చెరువులో జరుగుతున్న గణేష్ నిమజ్జన తీరును జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు వద్ద నిమజ్జనానికి చేపట్టిన ఏర్పాట్లను, భద్రతా చర్యలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలోని టేక్రియాల్ చెరువులో సుమారు 700కు పైగా గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేసే అవకాశం ఉన్నందున, అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ముందస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చెరువు వద్ద పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, అనుమతి లేని వ్యక్తులు చెరువులోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేసేందుకు అవసరమైన పెద్ద క్రేన్లను, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. చెరువు వద్ద వాటర్ ప్రూఫ్ షామియానా ఏర్పాటు చేసి, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, అగ్నిమాపక శాఖలతో సమన్వయం చేసుకుంటూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ వైర్లు గణేష్ విగ్రహాలకు తగలకుండా తగిన ఎత్తులో ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.సెప్టెంబర్ 24, అధిక సంఖ్యలో గణేష్ విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉన్నందున, చెరువు వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేయాలని తెలిపారు. విగ్రహాలు వరుస క్రమంలో నిమజ్జనం జరిగేలా తహసీల్దార్, పోలీస్, మున్సిపల్, ఇరిగేషన్, అగ్నిమాపక తదితర శాఖల అధికారులు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.భక్తులు, ప్రజలు నిమజ్జన కార్యక్రమంలో జాగ్రత్తలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.



## సమాజ సేవలో విద్యార్థులు ముందుండాలి

- **ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు ప్రిన్సిపాల్ మధు శ్రీవాస్తవ సూచన**

**దౌల్తాబాద్, సెప్టెంబర్ సెప్టెంబరు 24(వుదయం):**

జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కళాశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మధు శ్రీవాస్తవ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సమాజంపై పూర్తి అవగాహన కలిగి ఉండడంతోపాటు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సమాజం పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని, తద్వారా విశాల హృదయంతో వ్యవహరించే గుణాన్ని పెంపొందించుకోవాలని అన్నారు.ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 ప్రోగ్రాం అధికారి ఎం. మంగతా నాయక్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, పారిశుధ్యం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణతోపాటు వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో వాలంటీర్లు చురుకుగా పాల్గొనాలని సూచించారు.యూనిట్ 2 ప్రోగ్రాం అధికారి ఎం. సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థులు సమాజానికి సేవ చేయడంతోపాటు నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని అన్నారు. దేశ నిర్మాణంలో భాగస్వాములుగా నిలిచేలా విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిలర్ శివకుమార్‌తో పాటు అధ్యాపకులు రాజు, సుధాకర్, లక్ష్మీనారాయణ, దయానంద్, శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు, పవన్‌కుమార్, సలీం తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా సర్పంచులు పని చేయాలి



- **కలెక్టర్ హేమంత్ పాటిల్**

**నాగర్ కర్నూల్, సెప్టెంబరు 24 (వుదయం బ్యూరో):**

గ్రామాల ఆర్థిక అభివృద్ధిని లక్ష్యంగా చేసుకొని సర్పంచులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు.నాగర్ కర్నూల్ జిల్లాలో నూతనంగా అమలు చేస్తున్న వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్ జీ రామ్ జీ పథకం, వికసిత్ గ్రామ్ పంచాయతీ ప్రణాళికలపై గురువారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో 460 గ్రామ పంచాయతీల సర్పంచులకు శిక్షణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు శాశ్వత ఆస్తులు, మౌలిక వసతులు అభివృద్ధి చేయడమే పథకం లక్ష్యమని తెలిపారు.గ్రామ అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో ప్రణాళికలు రూపొందించాలన్నారు. జీ రామ్ జీ పథకం కింద 375 రకాల పనులు చేపట్టేందుకు వీలుందని, పథకం విధివిధానాలను క్షుణ్ణంగా తెలుసుకొని పారదర్శకంగా పనులు చేపట్టాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, నీటి సంరక్షణ, సహజ వనరుల అభివృద్ధి తదితర అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి పని నాణ్యతా ప్రమాణాలతో ఉండేలా చూడాలని, పనుల వివరాలు, ఖర్చులు, పురోగతిని నిబంధనల ప్రకారం నమోదు చేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, డీపీవో శ్రీరాములు, అదనపు డీఆర్డీవో రాజేశ్వరి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యశ్వంత్ రావు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.



## పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ రష్మి పెరుమాళ్

**సిద్దిపేట/మీరుదొడ్డి, సెప్టెంబర్ 24 (వుదయం బ్యూరో)**

సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ గురువారం మీరుదొడ్డి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. తనిఖీలో భాగంగా స్టేషన్‌లోని వివిధ రికార్డులను, లాకప్ గదులను, పరిసరాలను సీపీ క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక సీఐ రాజేష్, ఎస్ఐ సతీష్‌లతో పాటు స్టేషన్ సిబ్బందికి సీపీ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం చేయాలని స్పష్టం చేశారు. రానున్న వినాయక చవితి ఉత్సవాల దృష్ట్యా మండల వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని, రాత్రింబవళ్లు నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. అనంతరం మీరుదొడ్డి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని సీపీ సందర్శించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో, శాంతియుతంగా జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు పోలీసు శాఖకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు.

## డాక్టర్ సీటు సాధించిన పేద విద్యార్థినికి 15 వేల ఆర్థిక సాయం

- **ఉప్పల ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

**వెల్దండ సెప్టెంబర్ 24 (వు దయం)**



చదువుకు పేదరికం అడ్డు రాకూడదని మండల కేంద్రంలో గుద్దేటి సరితకు ఉప్పల ట్రస్ట్ చైర్మన్ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ 15వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు నిరుపేద కుటుంబానికి చెందిన సరిత కష్టపడి చదివి డాక్టర్ సీటు సాధించింది చదవడానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఆవేదన చెందుతున్న సందర్భంగా నేనున్నానంటూ ఉప్పల విద్యార్థిని చదువుకు అండగా నిలవడం పట్ల కుటుంబ సభ్యులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు గురువారం హైదరాబాదులో వార్డు సభ్యులు జోగయ్య, నిరంజన్ జంగిలి ఆనంద్, పూరి రమేష్, లింగం ద్వారా సరితకు చెక్కు అందజేశారు

## ప్రభుత్వ శాఖల్లో వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

- **2027 జనాభా లెక్కల్లో 21 రకాల వైకల్యాల వివరాలు నమోదు చేయాలి: NPRD రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య**

**సంగారెడ్డి, సెప్టెంబర్ 24: (వుదయం జిల్లా ప్రతి నిది )**



ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (NPRD) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం .అడివయ్య డిమాండ్ చేశారు. NPRD సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

**ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ..**

2016 వికలాంగుల హక్కుల చట్టం 21 రకాల వైకల్యాలను గుర్తించిందని తెలిపారు. అయితే 2027 జనాభా లెక్కల్లో కేవలం తొమ్మిది రకాల వైకల్యాల వివరాలను మాత్రమే సేకరించాలన్న నిర్ణయం సరికాదన్నారు. ఆటిజం, నిర్దిష్ట అభ్యాసన వైకల్యాలు, మరుగుజ్జుతనం, కుష్ఠువ్యాధి నుంచి కోలుకున్న వారు, చెవిటి, అంధత్వం, బహుళ వైకల్యాలు తదితర అన్ని రకాల వైకల్యాల వివరాలను జనాభా లెక్కల్లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు.వికలాంగుల వివరాలను సమగ్రంగా సేకరించకపోతే విద్య, ఉపాధి, వైద్యం, పునరావాసం, సామాజిక భద్రతతో పాటు వారికి అందాల్సిన సంక్షేమ పథకాలపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ప్రతి వికలాంగుడి వివరాలు నమోదు చేసేలా సెన్సెస్ పత్రంలో మార్పులు చేయాలని కోరారు.జిల్లా కార్యదర్శి కొనింటి నర్సిములు మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2026 ఆగస్టు 18న జీవో 19 విడుదల చేసిందన్నారు. గత 14 ఏళ్లుగా జిల్లాల్లో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ జరగడం లేదని తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను గుర్తించి ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ నియామకాల్లో వికలాంగులకు 4 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాంచందర్, రాజకుమార్, సంగమేశ్వర్, సహాయ కార్యదర్శులు కృపవరం, శంకర్ నాయక్, జిల్లా నాయకులు చౌహన్, భాగ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

## ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణింపు

- **విద్యార్థుల ఆరోగ్య వివరాల నమోదుకు హెల్త్ ప్రొఫైల్ కార్డులు**
- **జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీ**
- **అదనపు కలెక్టర్ నర్సింగరావు**

**గద్వాల, సెప్టెంబర్ 24 (వుదయం కరస్పాండెంట్)**




విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణించగలరని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేకంగా విద్యార్థుల ఆరోగ్య ప్రొఫైల్ కార్డులను అందజేస్తోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశాల మేరకు ఆరోగ్య పాఠశాల పేరుతో రూపొందించిన విద్యార్థుల ఆరోగ్య ప్రొఫైల్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం గద్వాలలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ నర్సింగరావు రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పలువురు విద్యార్థులకు ఆరోగ్య ప్రొఫైల్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వాటికి సంబంధించిన వివరాలను ఆరోగ్య ప్రొఫైల్ కార్డులో నమోదు చేస్తామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని బట్టి అవసరమైన చికిత్స పొందేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. విద్యార్థులు ఆకుకూరలు, పండ్లు, మాంసకృత్తులు తదితర పౌష్టికాహారాన్ని సమతుల్యంగా తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు రాగిజావ కూడా అందిస్తున్నందున విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం త్వరలోనే ఉదయం అల్పాహార కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని రెసిడెన్షియల్, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు కూడా ఆరోగ్య ప్రొఫైల్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య కిరణ్మయి, కౌన్సిలర్ వేదవతి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సవారన్న, వైద్యాధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్**



జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (PHCs), సామాజిక ఆరోగ్య కేంద్రాలు (CHCs), సబ్‌సెంటర్లలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పి.హెచ్.సి లు, సి.హెచ్.సిల వైద్యాధికారులు, జిల్లా టిబి, కుష్ఠు, ఎన్.సి.డి,ఎమ్ హెచ్ ఎన్ , ఆర్.బి.ఎస్.కె ప్రోగ్రాం అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని పి.హెచ్.సిలు, సి.హెచ్.సి లు,సబ్‌సెంటర్లలో మందుల లభ్యత, సిబ్బంది నిర్వహణ, మండల స్థాయి ఆరోగ్య సిబ్బంది (MLHPs), నర్సింగ్ సిబ్బంది విధుల కేటాయింపు, ల్యాబ్ టెక్నీషియన్ల నియామకం, స్వీపర్లు, ఇతర కంటింజెన్సీ సిబ్బంది నియామకం వంటి అంశాలను సమీక్షించారు. పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. మందుల కొరతపై ప్రత్యేకంగా సమీక్షించిన కలెక్టర్, అవసరమైన మందులకు ముందుగానే ఇండెంట్‌లు సమర్పించాలని, సరఫరాలో జాప్యం జరిగితే వివరాలను నమోదు చేసి నివేదించాలని ఆదేశించారు. ప్రతి నెల 15, 30 తేదీల్లో మందుల ఇండెంట్‌లు, సరఫరా పరిస్థితి, పెండింగ్‌లో ఉన్న మందుల వివరాలతో నివేదిక సమర్పించాలని సూచించారు. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా ప్రత్యామ్నాయాలపై కూడా దృష్టి సారించాలని తెలిపారు.పి.హెచ్.సిల్లో రోగుల రద్దీకి అనుగుణంగా సిబ్బంది విధులను పునర్వ్యవస్థీకరించాలని కలెక్టర్ సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రోగుల రద్దీని పరిశీలించి, అవసరానికి అనుగుణంగా సిబ్బంది షిఫ్టులను రూపొందించాలన్నారు. సిబ్బంది కొరత ఉన్నట్లు భావించిన చోట ముందుగా అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని, నిజమైన కొరత ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.సబ్‌సెంటర్లలో MLHPలు నిర్దేశిత రోజుల్లో విధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొదటి, మూడవ వారాల్లో గురువారాలను ప్రత్యేక సమీక్ష/ఫీల్డ్ కార్యక్రమాలకు కేటాయించి, మిగిలిన రోజుల్లో సబ్‌సెంటర్లలో సేవలు అందించేలా విధి నిర్వహణను పకడ్బందీగా రూపొందించాలని సూచించారు. ప్రతి పి.హెచ్.సి వైద్యాధికారి తన పరిధిలోని సబ్‌సెంటర్లను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో సబ్‌సెంటర్ల పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుని సబ్‌సెంటర్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అవసరమైన ఫాగింగ్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (NCD) స్క్రీనింగ్‌ను వేగవంతం చేయాలి అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆశా కార్యకర్తలకు గ్రామాల వారీగా, ఆశా వారీగా లక్ష్యాలను నిర్దేశించి, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అధిక రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు తదితర NCDలను ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన చికిత్స అందేలా చూడాలన్నారు. స్క్రీనింగ్‌లో వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.అదేవిధంగా HPV టీకా కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన బాలికలకు HPV టీకాపై అవగాహన కల్పించి, కార్యక్రమాన్ని నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. RBSK ద్వారా చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని కూడా సమీక్షించారు.

హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (HMIS)లో TB కేసుల నమోదు, చిన్నారుల టీకా కార్యక్రమం, స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆరోగ్య స్క్రీనింగ్, MHN కార్యక్రమం కింద ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు, సిజేరియన్ ప్రసవాల వివరాలను కలెక్టర్ పీహెచ్‌సీ వారీగా సమీక్షించారు.జిల్లాలో ఇప్పటివరకు నమోదైన డెంగ్యూ, కుష్ఠు (లెప్రసీ), TB కేసుల వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. కంటి పరీక్షల కోసం నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాల పురోగతి, సబ్‌సెంటర్ల నిర్మాణాలు, మరమ్మతుల పనుల పరిస్థితిపై కూడా సమీక్షించారు. ఆరోగ్య కార్యక్రమాల అమలులో ప్రతి వైద్యాధికారి బాధ్యతతో వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలు చూపాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా వైద్యాధికారి డా. ఏ. శ్రీనివాసులు, జిల్లా డిప్యూటీ వైద్యాధికారి, పి.హెచ్.సి లు, సి.హెచ్.సిల వైద్యాధికారులు, ప్రాజెక్టు అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఒకే ఆసుపత్రి వరుస ఆరోపణలు...!

- **బాలింత మృతి... బాలుడి పరిస్థితి విషమం**
- **రెండు గాయత్రి ఆసుపత్రులు అధికారుల విచారణ ఎక్కడ....?**

**నారాయణపేట సెప్టెంబర్ 24(వుదయం ప్రతినిధి)**

నారాయణపేటలోని ప్రైవేట్ వైద్యంపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది. తాజాగా సామనూరు గ్రామానికి చెందిన 19 ఏళ్ల గర్భిణి శ్వేతారెడ్డి నారాయణపేట జిల్లా కేంద్రంలోని గాయత్రి హాస్పిటల్‌లో సిజేరియన్ అనంతరం గురువారం మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. డాక్టర్ నిర్వహించిన సిజేరియన్ అనంతరం వైద్యం వికటించడంతోనే తమ కుమార్తె మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

**ఇదే సమయంలో.. ..**

దామరగిద్ద మండలం గడిమున్కన్‌పల్లి గ్రామానికి చెందిన ఓ బాలుడికి సుమారు 15 రోజుల క్రితం గాయత్రి హాస్పిటల్‌లో అపెండిక్స్ ఆపరేషన్ నిర్వహించినట్లు బాలుడి తల్లిదండ్రులు చెబుతున్నారు. ఆపరేషన్ అనంతరం బాలుడి కడుపు ఉబ్బడంతో పాటు మూత్ర విసర్జన నిలిచిపోయిందని.. పరిస్థితి విషమించడంతో అత్యవసరంగా హైదరాబాద్‌కు తరలించి అక్కడ చికిత్స కొనసాగిస్తున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. ఆ సమయంలో వైద్యుల నుంచి సరైన స్పందన లేకపోయిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

**ఒకవైపు గర్భిణి మృతి ఘటన..**

మరోవైపు బాలుడి ఆరోగ్య పరిస్థితిపై ఆరోపణలు.. ఇలా ఒకే ఆస్పత్రి పేరు చుట్టూ వరుసగా ఆరోపణలు తెరపైకి రావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

**ఇక అసలు ప్రశ్న.. రెండు గాయత్రి ఆస్పత్రులు ఎందుకు..?**

నారాయణపేటలో గాయత్రి హాస్పిటల్ పేరుతో రెండు చోట్ల ఆస్పత్రులు కొనసాగుతున్నాయి. రెండు ఆస్పత్రుల బోర్డులు, భవనాలను పరిశీలిస్తే ఒకే పేరుతో రెండు వైద్య కేంద్రాలు ఉన్న విషయం స్పష్టంగా కనిపిస్తోంది. మరి ఈ రెండు ఆస్పత్రులకు సంబంధించిన అనుమతులు ఏమిటి..? యాజమాన్యం ఒక్కటేనా..? వైద్యుల అర్హతలు ఏమిటి..? ఆపరేషన్లు నిర్వహించేందుకు అవసరమైన సదుపాయాలు ఉన్నాయా..? అత్యవసర పరిస్థితుల్లో ఐసీయూ, వెంటిలేటర్ వంటి సౌకర్యాలు ఉన్నాయా..? అనుమతులు, రిజిస్ట్రేషన్లు నిబంధనల ప్రకారం ఉన్నాయా..? అన్న ప్రశ్నలకు వైద్యారోగ్య శాఖ అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.




ఇన్ని ఆరోపణలు తెరపైకి వస్తున్నప్పటికీ.. సంబంధిత అధికారులు ఇప్పటి వరకు సమగ్ర విచారణ చేపట్టారా..? బాధిత కుటుంబాల నుంచి ఫిర్యాదులు స్వీకరించారా..? ఆపరేషన్ రికార్డులు, కేస్ షీట్లు, డిశ్చార్జ్ సమ్మరీలు, వైద్య రికార్డులను పరిశీలించారా..? అన్నది కూడా స్పష్టంగా తెలియాల్సి ఉంది.

**ఇకనైనా అడ్డుకట్ట పడుతుందా..?**

నారాయణపేటలో ప్రైవేట్ ఆస్పత్రులపై ఇలాంటి ఆరోపణలు ఇప్పుడే మొదలయ్యాయా..? గతంలో వచ్చిన ఫిర్యాదులపై ఏం చర్యలు తీసుకున్నారు..? ఎన్ని ఆస్పత్రులను తనిఖీ చేశారు..? ఎన్ని ఆస్పత్రులపై చర్యలు తీసుకున్నారు..? అన్న వివరాలను జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే వైద్యం అంటే కేవలం వ్యాపారం కాదు.. అది ప్రజల ప్రాణాలతో ముడిపడిన వ్యవస్థ. ఒకవేళ వైద్య నిర్లక్ష్యం జరిగితే.. డబ్బులతో వ్యవహారం ముగిసిపోయే పరిస్థితి కాకుండా, అసలు తప్పు ఎక్కడ జరిగింది..? ఎవరి బాధ్యత..? ఎందుకు జరిగింది..? మళ్లీ జరగకుండా ఏం చర్యలు తీసుకుంటారు..? అన్నదే తేలాలి.

**తాజా గర్భిణి మృతి ఘటనపై సమగ్ర విచారణ జరుగుతుందా..?**

బాలుడి ఆపరేషన్‌పై వచ్చిన ఆరోపణలపై వైద్యపరమైన పరిశీలన ఉంటుందా..? ఒకే పేరుతో ఉన్న రెండు గాయత్రి ఆస్పత్రుల అనుమతులు, నిర్వహణపై అధికారులు స్పష్టత ఇస్తారా..? గతంలో వచ్చిన ఆరోపణలపై రికార్డులు బయటకు వస్తాయా..? ప్రజల ప్రాణాలకు సంబంధించిన ఈ ప్రశ్నలకు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది.



## జమ్ములమ్మ ఆలయం వద్ద కొత్త వ్యాపార శోభ

**గద్వాల సెప్టెంబర్ 24 (వుదయం బ్యూరో)**

జమ్మిచేడు గ్రామం రోజురోజుకూ ఆర్థికంగా, వ్యాపారపరంగా విస్తరిస్తోంది. అందులో భాగంగా శ్రీ జమ్ములమ్మ దేవాలయ ప్రాంగణం వద్ద వ్యాపార వాతావరణం మరింత వేడెక్కింది. భక్తుల, స్థానికుల దాహార్తిని తీర్చేందుకు నూతనంగా రూపుదిద్దుకున్న 'నిషికా కూల్ డ్రింక్స్' షాప్ సందడి మధ్య శుభారంభమైంది. గద్వాల రూరల్ ఎస్సై శ్రీకాంత్ సూచనలతో హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ ముఖ్య అతిథిగా విచ్చేసి, పూజా కార్యక్రమాల అనంతరం షాప్‌ను ప్రారంభించారు. నాణ్యతకే ప్రాధాన్యం: దేవాలయానికి వచ్చే భక్తులతో పాటు, చుట్టుపక్కల ప్రాంతాల వారికి మెరుగైన ఉత్పత్తులు అందించేందుకు ఈ షాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు నిర్వాహకులు చెప్పారు. పలువురి హాజరు: ప్రారంభోత్సవంలో స్థానిక ప్రముఖులు సీనియర్ రిపోర్టర్స్ కె రవికుమార్ ముకుందరావు, ప్రసాద్, వెంకటేష్, రాముడు, వెంకటన్న, వీరన్న చారి, బలరాం, పరశురాముడు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు అందజేశారు.

## విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి



**వనపర్తి సెప్టెంబర్ 24 (వుదయం ప్రతినిధి)**

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి అదరపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి: అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్య నాయక్విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్య నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వనపర్తి మండలం నాగవరం శివారులోని ఎస్సీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలలను అదనపు కలెక్టర్ గురువారం సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా లేదా , భోజనం నాణ్యత, రుచికరత, పరిశుభ్రత వంటి అంశాలను పర్యవేక్షించాలని సూచించారు.అనంతరం విద్యార్థులతో అదనపు కలెక్టర్ ముచ్చటించి వారి చదువు, విద్యా సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన విద్యా, మౌలిక సౌకర్యాలు సక్రమంగా అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.అనంతరం అదనపు కలెక్టర్ జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించి అక్కడి వసతులను పరిశీలించారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన నూతన ఫర్నిచర్‌ను పరిశీలించి, పాఠకులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. పాఠకులకు అవసరమైన సౌకర్యాలను మరింత మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, జిల్లా గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పరిశోధనను ప్రజోపయోగంగా మార్చాలి



- **గీతం ఆతిథ్య ఉపన్యాసంలో శాస్త్రవేత్త డాక్టర్ బిపిన్ కుమార్ గుప్తా**

**పటాన్చెరు (వుదయం):**

ప్రాథమిక పరిశోధనను ప్రజోపయోగంగా మార్చాలిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల మధ్య సంబంధాన్ని బలోపేతం చేయాలని న్యూఢిల్లీలోని సీఐఎస్ఆర్‌జాతీయ భౌతిక శాస్త్ర ప్రయోగశాల శాస్త్రవేత్త డాక్టర్ బిపిన్ కుమార్ గుప్తా అన్నారు. శాస్త్రీయ జిజ్ఞాసను పెంపొందించుకోవాలని, లక్ష్యాలను పట్టుదలతో సాధించాలని, భారతదేశ సాంకేతిక స్వావలంబనను బలోపేతం చేయగల స్వదేశీ సాంకేతికతల అభివృద్ధికి దోహదపడాలని విద్యార్థులను ప్రోత్సహించారు. హైదరా బాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఆత్మనిర్భర్ భారత్ కోసం కొత్తగా అభివృద్ధి చెందుతున్న నానో/క్వాంటం పదార్థాల రూపకల్పన, ఆవిష్కరణ, స్వదేశీ సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి అనే అంశంపై గురువారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. సెమీకండక్టర్, క్వాంటం సాంకేతికతల కేంద్రం సహకారంతో, స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లోని ఈఈసీఈ విభాగం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. డాక్టర్ గుప్తా విద్యార్థులకు నానోపదార్థాలు, అభివృద్ధి చెందుతున్న టుడీ (ద్విమితీయ) పదార్థాలు, క్వాంటం పదార్థాలను ప్రాథమికంగా పరిచయం చేస్తూ, వాటి పరిమాణంపై ఆధారపడిన లక్షణాలు, సంభావ్య అనువర్తనాలను వివరించారు. స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ప్రశాంతరెడ్డి ముడిమాల, అతిథికి స్వాగతం పలికి, విద్యార్థులకు ఆయనను పరిచయం చేసి, సత్కరించారు. ఈఈసీఈ విభాగానికి చెందిన డాక్టర్ శాంతను సాహా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

**గీతంలో పరిశ్రమ-ఆధారిత అభ్యాసం**

డేటా సైన్స్ ఆచరణాత్మక శిక్షణపై రెండు రోజుల కార్యశాల ప్రారంభం

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం, డేటా సైన్స్ ఆచరణాత్మకంగా వినియోగించడంపై దృష్టి సారించి, విద్యార్థులకు పరిశ్రమఆధారిత అభ్యాస అనుభవాన్ని అందించేందుకు గాను 'డేటా సైన్స్: ఆచరణాత్మక శిక్షణ' పేరిట రెండు రోజుల కార్యశాలకు గురువారం శ్రీకారం చుట్టింది. డేటా సైన్స్ సాధనాలు, బి.టెక్. మూడవ, నాల్గవ ఏడాది, ఎం.టెక్. విద్యార్థులు ఈ కార్యశాలలో చురుకుగా పాల్గొంటూ, డేటాను అర్థవంతమైన అంతర్దృష్టులుగా, ప్రభావంగా మారుస్తూ, నేర్చుకోవడానికి, అన్వేషించడానికి, విశ్లేషించడానికి, దృశ్యమానం చేయడానికి, ఆవిష్కరించడానికి ఒక అవకాశాన్ని పొందారు.సీఎస్ఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ మహబూబ్ షేక్ బాషా ప్రారంభోత్సవ కార్యక్రమానికి సభాధ్యక్షత వహించారు. కార్యక్రమ నిర్వాహకురాలు ప్రొఫెసర్ ప్రీతి పర్వేకర్, ప్రధాన శిక్షకుడిని ఆహ్వానించి, విద్యార్థులకు పరిచయం చేశారు. జ్యోతి బంకపల్లి, డాక్టర్ యు. శ్రీనివాస్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తున్నారు.

## అడసర్లపాడు రామన్నపాలెం మధ్య రాకపోకలు బంద్

**వాగును పరిశీలించిన అధికారులు**

**సత్తుపల్లి సెప్టెంబర్ 24 (వుదయం ప్రతినిధి )**



వేంసూరు మండల పరిధిలోని అడసర్లపాడు రామన్నపాలెం మధ్య వాగు ఓవర్ ఫ్లో ను తహశీల్దార్ మాణిక్ రావు ఎంపీడీఓ కావ్య పరిశీలించారు. సర్పంచ్ కాటే జమలారావు ఉప సర్పంచ్ పంచాయతీ సెక్రటరీ ఉపేంద్ర సిబందికి తగు చూచనలు చేశారు. ఈ సందర్భంగా అడసర్లపాడు రామన్నపాలెం మధ్య వాగు ఓవర్ ఫ్లో అవుతుందని గ్రహించి ముందస్తుగా రాక పోకలు నిలిపివేశారు. సీనియర్ నాయకులు దొడ్డ వెంకట కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

## గణనాథుడి నిమజ్జన శోభాయాత్ర



**భువనగిరి మా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**యాదాద్రి భువనగిరి జిల్లా, 24 సెప్టెంబర్ 2026**

భువనగిరి పట్టణంలో ప్రగతి నగర్ శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ గణనాథుడు నిమజ్జన శోభాయాత్ర కార్యక్రమానికి శ్రీ గౌరవనీయులు శాసనసభ్యులు భువనగిరి మా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి విచ్చేసి శోభాయాత్ర ప్రారంభించడం జరిగింది భువనగిరి పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్. పోతన ప్రమోద్ కుమార్. పోతంశెట్టి వెంకటేశ్వర్లు. బర్రె జహంగీర్. ఇలియాస్. బెండ శ్రీకాంత్. గుర్రాల శ్రీనివాస్. డాకోరీ ప్రకాష్. శోభన్ బాబు. శ్రీధర్ గౌడ్ పాల్గొనడం జరిగినది... శివాజీ యూత్ శాశ్వత అధ్యక్షులు గ్యాస్ చిన్న.గారు అధ్యక్షతన జరిగినది.

## భువనగిరి ఆజాద్ రోడ్డులో ఘనంగా గణనాథుని లడ్డూ వేలం

**రూ. 85,000లకు దక్కించుకున్న వెల్దుర్తి కుటుంబం**

**యాదాద్రి భువనగిరి జిల్లా. 24 సెప్టెంబర్ 2026**



భువనగిరి పట్టణంలోని ఆజాద్ రోడ్‌లో కొలువైన శ్రీరామ భక్త భజన మండలి గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథుని దివ్య ప్రసాదమైన లడ్డూ వేలం పాట అత్యంత వైభవంగా జరిగింది. భక్తుల జయజయ ధ్వనులు, ఆధ్యాత్మిక ఉత్సాహం నడుమ నిర్వహించిన ఈ వేలంలో మాజీ కౌన్సిలర్ , మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీ వెల్దుర్తి రఘునాథ్ – శ్రీమతి చంద్రకల దంపతులు మరియు వారి కుమారులు వెల్దుర్తి సాయినాథ్ – నికిత, వెల్దుర్తి వంశీనాథ్(VR జ్యువెలరీ )రూ. 85,000/- (ఎనభై ఐదు వేల రూపాయలు) చెల్లించి లడ్డూ ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా లడ్డును దక్కించుకున్న వెల్దార్తి రఘునాథ్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుని దివ్య ప్రసాదం దక్కడం తమ పూర్వజన్మ సుకృతమని, స్వామివారి ఆశీస్సులతో తమ కుటుంబంతో పాటు లోకమంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. ఈ వేలం పాట కార్యక్రమంలో శ్రీరామ భక్త భజన మండలి నిర్వాహకులు, సభ్యులు, కాలనీవాసులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు. అనంతరం లడ్డూను గెలుచుకున్న వెల్దుర్తి రఘునాథ్ కుటుంబాన్ని భజన మండలి సభ్యులు శాలువా మరియు స్మారక బహుమతులతో ఘనంగా సత్కరించారు.

## వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

**ఉంజుపల్లిలో ఉచిత వైద్య శిబిరం.. 34 మందికి ఆరోగ్య పరీక్షలు**

**చర్ల, సెప్టెంబర్ 24: (వుదయం ప్రతినిధి)**




చర్ల మండలం ఉంజుపల్లి గ్రామంలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చర్ల (కొయ్యూరు) ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డా. హారిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 34 మంది గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా. హారిక మాట్లాడుతూ.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, విరేచనాలు, వాంతులు, జలుబు, దగ్గు, జ్వరం, చర్మ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు త్రాగే నీటిని కాచి, వడపోసి తాగాలని, వర్షంలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని, బయట ఆహారానికి దూరంగా ఉండాలని సూచించారు. జ్వరం, దగ్గు, జలుబు లేదా ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

అనంతరం పూసుగుప్ప గ్రామాన్ని సందర్శించిన డా. హారిక అక్కడి మొబైల్ క్లినిక్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వర్షాల నేపథ్యంలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది అత్యవసర పరిస్థితుల్లో తప్ప సెలవులు తీసుకోకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రసవ అంచనా తేదీలను నిరంతరం ఫాలోఅప్ చేస్తూ, ప్రసవ సమయం దగ్గరపడిన గర్భిణులను ముందుగానే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ గోపి, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ గీతా, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఊర చెరువు, పంట పొలాలకు వెళ్లే రోడ్డును మరమ్మత్తు చేయాలి

**గ్రామ రైతుల వేడుకోలు**

**అనంతగిరి సెప్టెంబర్ 24 వుదయం**



మండల పరిధిలోని వాయిలసింగవరం గ్రామంలో ఊర చెరువుకు,పంట పొలాలకు వెళ్లే రోడ్డును వెంటనే మరమ్మత్తులు చేయాలని గ్రామ రైతులు కోరుతున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతు కొల్లు సుబ్బారావు మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వలన గత రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాల వలన రోడ్డు బాగా దెబ్బతిని గుంటలు ఏర్పడి నీరు నిలవడం వలన పంట పొలాలకు వెళ్లే రైతులు పొలాల దగ్గరకు వెళ్ళాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు .

## 24 నుంచి డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లు ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి

**మధిర, సెప్టెంబర్ 24, వుదయం, ప్రతినిధి:**

మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026,27 విద్యా సంవత్సరానికి దోస్త్ ప్రవేశాల్లో మిగిలిన ఖాళీ సీట్ల భర్తీ కోసం సెప్టెంబర్ 24,25 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు, సెప్టెంబర్ 28, 29 తేదీల్లో ప్రత్యేక స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.రవీంద్రారెడ్డి గురువారం తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత తేదీల్లో ఒరిజినల్ ధ్రువపత్రాలతో కళాశాలకు నేరుగా హాజరై ధ్రువీకరణ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన లేకుండా ప్రవేశాలు కల్పించబోవడం లేదని స్పష్టం చేశారు.ప్రత్యేక స్పాట్ అడ్మిషన్లలో ముందుగా స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామని,సీట్లు మిగిలితే ఇతర ప్రాంతాల అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.ఇప్పటికే ఏదైనా కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లకు అర్హులు కాదన్నారు. విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా,ఇంటర్మీడియట్ లేదా సమాన అర్హత ధ్రువపత్రం, బదిలీ ధ్రువపత్రం, చదువు ధ్రువపత్రాలు, కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలతో పాటు అవసరమైన ఇతర పత్రాలను తీసుకురావాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా చేరిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని పేర్కొన్నారు.కళాశాలలో ఉన్నత అర్హతలు కలిగిన అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, ప్రవేశాలపై మరిన్ని వివరాలకు కళాశాల అధికారులను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

# మధిరలో ముసురుకున్న వర్షం పొంగి ప్రవహిస్తున్న నదులు,వాగులు

**రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు**

**మధిర సెప్టెంబర్ 24, వుదయం , ప్రతినిధి:**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మధిరలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకి వాగులు, వంకలు నదులు పొంగి ప్రవహిస్తున్నాయి.రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. గురువారం ఉదయం వరకు మధిరలో 141 మిల్లీల వర్షపాతం నమోదయింది. దీంతో జన జీవనం స్తంభించిపోయింది. ఎల్ నీనో కారణంగా రెండు నెలల నుండి ఎండలు మండుతున్నాయి. అకాల వర్షం మెట్ట పంటలైన పత్తి, మిర్చి పంటలకు ప్రాణం పోసింది. అనేక రోజులుగా రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.వర్షంతో మధిరలో ఉన్న వైరా నదికి భారీగా వర్షపు నీరు చేరుకుంది.

అదేవిధంగా మధిర మండలం రొంపి మల్ల వద్ద చీకటి వాగు పొంగి ప్రవహిస్తుంది. జాలిముడి వద్ద జాలిముడి ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరుకుంది. పట్టణంలోని ప్రధాన వీధులు జలమయమయ్యాయి.దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. అదేవిధంగా రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద పోటెత్తడంతో ద్విచక్ర వాహనదారులు,పాదచారుల రాకపోకలకు అంతరాయం కలిగింది. కొద్దిరోజులుగా ఎండ వేడిమి ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఉక్క పోతకు గురయ్యారు. సుమారు 15 రోజుల తర్వాత కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడింది. అండర్ డ్రైనేజ్, విద్యుత్ అండర్ కేబుల్ పనుల వల్ల రోడ్లన్నీ ధ్వంసం కావడం వర్షానికి బురద బురద కావడంతో ప్రజలు రాకపోకలు కొనసాగేందుకు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కొన్ని రహదారులుపై గుంతలు ఉండటం, మరికొన్ని రహదారులన్నీ బురదమయంగా తయారయ్యాయి.రానున్న రెండు రోజులు భారీ వర్షాలు రానున్నాయని వాతావరణ శాఖ తెలపడంతో ప్రజల అప్రమత్తంగా ఉండాలని మండల అధికారులు తెలిపారు.





## భారీ వర్షాల నేపథ్యంలో పోలీసుల హెచ్చరిక

- **అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దు**
- **నీటి ప్రాంతాల వైపు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు..!**
- **చింతకాని ఎస్ఐ జి నరేష్**

**చింతకాని. సెప్టెంబర్ 25 ( వుదయం ప్రతినిధి)**



చింతకాని మండలంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాబోయే రెండు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చింతకాని ఎస్సై జి. నరేష్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. చెరువులు కాలువలు ఇతర నీటి ప్రాంతాల వద్దకు వెళ్లవద్దని ముఖ్యంగా పిల్లలను ఆ ప్రాంతాల్లో ఆడుకోవడానికి అనుమతించవద్దని సూచించారు. వర్షాల కారణంగా రోడ్లపై చెట్లు పడటం రహదారులకు అడ్డంకులు ఏర్పడటం లేదా నీటి ప్రవాహం కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడితే వెంటనే చింతకాని పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై తెలిపారు. చిన్న చిన్న ఆనందాల కోసం అజాగ్రత్తగా వ్యవహరించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు.

## అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దు

- **నీటి ప్రాంతాల వైపు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు..!**
- **ఎస్సై మోహన్ బాబు**

**చిలుకూరు సెప్టెంబర్ 24:( వుదయం )**



మండలంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మోహన్ బాబు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. చెరువులు కాలువలు ఇతర నీటి ప్రాంతాల వద్దకు వెళ్లవద్దని ముఖ్యంగా పిల్లలను ఆ ప్రాంతాల్లో ఆడుకోవడానికి అనుమతించవద్దని సూచించారు. వర్షాల కారణంగా రోడ్లపై చెట్లు పడటం రహదారులకు అడ్డంకులు ఏర్పడటం లేదా నీటి ప్రవాహం కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడితే వెంటనే 112 డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై తెలిపారు. చిన్న చిన్న ఆనందాల కోసం అజాగ్రత్తగా వ్యవహరించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు.

## గుర్వాయిగుడెంలో టర్నడో బీభత్సం.. అతలాకుతలమైన పంట తోటలు



**దమ్మపేట సెప్టెంబర్ 24 (వుదయం ప్రతినిధి):**

దమ్మపేట మండలం జగ్గారం పంచాయతీ పరిధిలోని గుర్వాయిగుడెం గ్రామంలో టర్నడో బీభత్సం సృష్టించింది.బుధవారం రాత్రి 7:30 గంటలకు వీచిన అకస్మాత్తుగా వీచిన బలమైన గాలులు, టర్నడో ప్రభావంతో గ్రామ పరిసరాల్లోని పంట తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పగటి పూట వస్తే ప్రాణ నష్టం కూడా సంభవించేది ముఖ్యంగా మామిడి, జీడి, పత్తి, పామాయిల్ తోటల్లో భారీగా నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు. బలమైన గాలుల ధాటికి పలు చెట్లు నేలకొరిగాయి. మామిడి, జీడి తోటల్లో కొమ్మలు విరిగిపడటంతో పాటు పామాయిల్ చెట్లు కూడా దెబ్బతిన్నాయి. పత్తి పంట సైతం గాలుల ప్రభావానికి నష్టపోయినట్లు రైతులు పేర్కొన్నారు. ఏళ్ల తరబడి పంట తోటలను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్న రైతులకు ఒక్కసారిగా వచ్చిన టర్నడో తీవ్ర ఆందోళన కలిగించింది. పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యం రూపంలో నష్టం వాటిల్లడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే గ్రామంలో పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించి, సమగ్రంగా నష్టం అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు. దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## జర్నలిస్టులకు అండగా నిలబడే దమ్మున్న యూనియన్ టిజెఎఫ్‌దే

- **వచ్చే నెల మొదటి వారంలో ఖమ్మం డివిజన్ మహాసభలు**
- **టీజెఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి**

**ఖమ్మం వుదయం బ్యూరో సెప్టెంబర్ 24:**



జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా టీజెఎఫ్ అండగా ఉంటుందని, జర్నలిస్టుల కోసం నిలబడి కలబడే దమ్మున్న జర్నలిస్ట్ యూనియన్ టీజెఎఫ్ దే అని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీజెఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన టి యు డబ్ల్యూ జె (టి జె ఎఫ్) నగర కమిటీ, ఎలక్ట్రానిక్ మీడియా, ప్రెస్ క్లబ్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో చిర్రా రవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసిన చరిత్ర తమ యూనియన్ దేనని , కష్టాల్లో ఉన్న వారికి ఆర్థిక సహాయం చేయడంతో పాటు కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో జర్నలిస్టులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. అక్రిడేషన్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల కోసం రాజీ లేని పోరాటాలు చేసిన ఘనత తమదే అన్నారు.

వచ్చే నెల మొదటి వారంలో టి జె ఎఫ్ ఖమ్మం డివిజన్ మహాసభలు ఖమ్మంలో నిర్వహిస్తున్నామని, ఈ సభలను విజయవంతం చేసేందుకు జర్నలిస్టు మిత్రులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ యూనియన్ నుంచి వి5 బ్యూరో ఇన్చార్జ్ కెవి, విజన్ ఆంధ్ర బ్యూరో ఇన్చార్జ్ రామకృష్ణ,అశోక్, నాగేశ్వరరావు తదితరులు టీజేఎఫ్ యూనియన్ లో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మందుల ఉపేందర్, నగర ప్రధాన కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, అక్రిడేషన్ కమిటీ సభ్యులు నాగరాజు, నగర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు య లమందల జగదీష్, కరీష అశోక్,ఫోటోగ్రాఫర్ రవి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు,కోశాధికారి బిక్కీ గోపి, ఉపాధ్యక్షులు పి. పానకాల రావు, ముత్యాల కోటేశ్వరరావు, పులి శ్రీను,రేపాక యాదగిరి, హుస్సేన్, సహాయ కార్యదర్శులు బోనగిరి యాదగిరి ఉల్లోజు రమేష్, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, రవీందర్, మీడియా ఇన్చార్జ్ తిరుపతిరావు, మహిళ ప్రతినిధులు వంగూరి ఈశ్వరి, రోజా, మాధవి, కిరణ్మయి, శ్రీదేవి, నాగలక్ష్మి , సీనియర్ నాయకులు ఉత్కంఠం శ్రీను, సాయి కళ్యాణ్, ఎన్ టి వి సాయి, గౌరీ శంకర్, గోవింద్, నాగ శేఖర్, పెంటి వెంకటేశ్వర్లు, రవి,లింగయ్య, నరసింహ రావు, భద్రం, రాంబాబు, లక్ష్మణ్, వెంకన్న, నాగరాజు, కూరపాటి నరేష్, తదితరులు పాల్గొన్నారు.



## పాములేరు వంతెనను అధికారులతో కలిసి పరిశీలించిన,మాజీ జడ్పిటిసి పైడి

**దమ్మపేట సెప్టెంబర్ 24 (వుదయం ప్రతినిధి):**

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశంతో పాములేరు వంతెన అధికారులతో కలిసి పరిశీలించిన మాజీ జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోయ్యల అచ్యుతరావు సిపిఐ జిల్లా నాయకులు నరాటి ప్రసాద్ ఫోన్లో అధికారులతో మాట్లాడిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం కంపగూడెం శివారులోని పాములేరు వాగుపై వంతెన కూలిపోయిన విషయం తెలుసుకున్న దమ్మపేట మాజీ జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు గురువారం హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

అక్కడి పరిస్థితిని అక్కడే ఉండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కు ఫోన్ ద్వారా వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల గారు ఫోన్లోనే ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడి, తాత్కాలికంగా ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని, శాశ్వత వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్ అండ్ బీ డీఈ, ఈఈ, ఎస్ఈ, జేఈ లను ఆదేశించారు.

పాల్వంచ – దమ్మపేట మధ్య భారీ వాహనాలను సత్తుపల్లి మీదుగా, చిన్న వాహనాలను మాదారం, అన్నపురెడ్డి పల్లి, బుగ్గపాడు మీదుగా మళ్లించారు. త్వరలోనే వంతెన నిర్మాణం చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. పైడి వెంకటేశ్వరరావు వెంట మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు, అధికారులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



## రోడ్డుపై కూలిన చెట్టును తొలగించిన రూరల్ పోలీసులు

**మధిర,సెప్టెంబర్ 24 వుదయం,ప్రతినిధి:**

మధిర మండలం కృష్ణాపురం గ్రామ సమీపంలో బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి చెట్టు రోడ్డుపై కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో రోడ్డుపై కూలిన చెట్టును తొలగించారు. ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో వాహనాల రాకపోకలు సజావుగా సాగాయి. సకాలంలో స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టిన రూరల్ పోలీసులను గ్రామస్తులు,వాహనదారులు అభినందించారు.

## తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారానికి శ్రీనివాస్ ఎంపిక

**చండూరు, సెప్టెంబర్ 24(వుదయం):**

చిత్రలేఖన రంగంలో ప్రతిభ కనబరిచినందుకు 2026 సంవత్సరానికి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారానికి కూరెళ్ల శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా చండూరు సాహితీ మేఖల ప్రతినిధులు, కళాకారులు, ఉపాధ్యాయులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఆయనను అభినందించారు. మద్దోజు సుధీర్‌బాబు, పున్న అంజయ్య, ముమ్మడి శ్రీనివాస్‌చారి, ముప్పవరం ఆంజనేయులు, పోలోజు నరసింహాచారి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనివాస్‌కు లభించిన పురస్కారం స్థానిక కళాకారులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

## చర్ల సిహెచ్సి లో విజయవంతంగా నార్మల్ డెలివరీ

**4 కిలోల బరువున్న మగ శిశువు జననం**

**చర్ల, సెప్టెంబర్ 24: (వుదయం ప్రతినిధి)**



చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మరో విజయవంతమైన నార్మల్ డెలివరీ జరిగింది. ఉంజుపల్లి గ్రామానికి చెందిన ఇర్ప విష్ణు ప్రియ గురువారం ఉదయం కాన్పు నొప్పులతో చర్ల సీహెచ్‌సీకి చేరుకున్నారు. వైద్యులు పరీక్షించిన అనంతరం డాక్టర్ సంకీర్త్ పర్యవేక్షణలో నర్సులు రేణుక, స్నేహా, కళ్యాణి ఆధ్వర్యంలో సాధారణ ప్రసవం నిర్వహించారు. ఈ ప్రసవంలో 4 కిలోల బరువున్న మగ శిశువు జన్మించాడు. ప్రస్తుతం తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. చర్ల సీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న వైద్య సేవలు, ప్రసవ సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సాయి వర్ధన్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను వినియోగించుకుని, అవసరమైన సమయంలో వైద్యులను సంప్రదించాలని తెలిపారు. విష్ణు ప్రియకు విజయవంతంగా నార్మల్ డెలివరీ చేసిన వైద్యులు, నర్సులకు ఆమె కుటుంబ సభ్యులు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. చర్ల సీహెచ్‌సీలో వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలను వారు ప్రశంసించారు.

## తాలిపేరుకు భారీ వరద.. 13 గేట్లు ఎత్తివేత



**17,732 క్యూసెక్కుల నీటి విడుదల**

**చర్ల, సెప్టెంబర్ 24: (వుదయం ప్రతినిధి)**

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఎగువన ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కురిసిన వర్షాలతో తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టులోకి 13,500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా 13 స్పిల్‌వే గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 17,732 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గురువారం సాయంత్రం 5 గంటల సమయానికి తాలిపేరు ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 73.39 మీటర్లకు చేరింది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 74 మీటర్లు కాగా, ప్రస్తుతం 615 మిలియన్ క్యూబిక్ అడుగుల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రాజెక్టు మొత్తం సామర్థ్యం 730 మిలియన్ క్యూబిక్ అడుగులు.

ప్రధాన కాలువల ద్వారా కూడా నీటిని విడుదల చేస్తున్నారు. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 60 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువ ద్వారా 12 క్యూసెక్కుల నీరు విడుదల చెయ్యడం జరిగింది . ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగితే ప్రాజెక్టుకు మరింత వరద నీరు చేరే అవకాశం ఉండటంతో అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

## ఎస్ ఎస్ వి యూత్ గంధవారిగూడెం చైతన్యపురి కాలనీలో గణేష్ ఉత్సవా వేడుకలు



- **కమిటీ అధ్యక్షులు గణేశ్ విగ్రదాత నాంపల్లి మధు**
- **అన్నదాతలు కమిటీ సభ్యులు**

**నల్గొండ జిల్లా**

**వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 24**

నల్గొండ పట్టణ కేంద్రంలో గంధ వారి గూడెంఎస్ ఎస్ వి యూత్ ఆధ్వర్యంలో చైతన్యపురి కాలనీ రోడ్ నెంబర్ 2/A లో గణేష్ ఉత్సవా వేడుకలు లో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇదే ప్రాంతంలో గణేష్ ని ఉత్సవాలు ఘనంగా నిర్వహించి ఉదయం సాయంత్రం భక్తిశ్రద్ధలతో ఆటపాటలతో ప్రతి ఒక్క కాలనీలో ఉన్న ప్రతి ఒక్కవారు ఇక్కడికి వచ్చి సంతోషంగా ఆనందంగా గడుపుతారని కమిటీ నిర్వాహకులు తెలిపారు అన్నదాన కార్యక్రమం కూడా చేపట్టి దాదాపు 1,200మంది పైగా భక్తులు ఇక్కడికి వచ్చి గణేష్ ని ప్రసాదం స్వీకరించి ఆశీర్వాదాలు తీసుకున్నారని వాడు తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు కమిటీ సభ్యులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి పవన్ కళ్యాణ్ ప్రణీత్ నందు అఖిల్ పందు శేశాంతు చందు మదన్ జగన్ సాత్విక్ చరణ్ నాని కాలనీ ప్రజలు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## నాంపల్లిలో ఘనంగా 'నరసింహస్వామి' చేనేత సంఘం మహాసభ

**నాంపల్లి, సెప్టెంబర్ 24 (వుదయం):**



చేనేత కార్మికుల సంక్షేమం, సంఘ బలోపేతానికి సభ్యులంతా ఐకమత్యంతో ముందడుగు వేయాలని 'నరసింహస్వామి చేనేత సహకార సంఘం' మాజీ అధ్యక్షుడు, అడ్వకేట్ నక్క రవీందర్ పిలుపునిచ్చారు. నాంపల్లి మండల కేంద్రంలో గురువారం నరసింహస్వామి చేనేత సహకార సంఘం 32వ సాధారణ మహాసభ వేడుకగా జరిగింది.

ముందుగా సంఘ అధ్యక్షురాలు నక్క యాదమ్మ సహకార పతాకాన్ని ఆవిష్కరించి సభకు అధ్యక్షత వహించారు. అనంతరం స్థానిక సర్పంచ్ నక్క చంద్రశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి మహాసభను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో రవీందర్ మాట్లాడుతూ.. చేనేత రంగానికి పూర్వవైభవం రావాలన్నా, కార్మికుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడాలన్నా సంఘంలో ప్రతీ ఒక్కరి భాగస్వామ్యం కీలకమని స్పష్టం చేశారు.

మహాసభలో ప్రధానంగా సంఘం ప్రగతి, సభ్యుల సంక్షేమ కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. సంఘంలోకి నూతన సభ్యత్వాలను విస్తృతంగా ప్రోత్సహించాలని నిర్ణయించారు. అంతేకాకుండా అర్హులైన ప్రతీ చేనేత కార్మికుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సంఘం తరపున తగిన చర్యలు తీసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు నక్క చంద్రమౌళి, ముఖ్య నాయకులు కర్నాటి జయప్రకాష్, సంగెపు పరంధాములు, పున్న కోటేశ్వర్, కర్నాటి నాగరాజు, కోట అయోధ్య, కర్నాటి శ్రీహరి పాల్గొని మాట్లాడారు. వీరితో పాటు సంఘం మేనేజర్ పిల్లలమర్రి రంగయ్య, ప్రధాన కార్యదర్శి లక్ష్మి , ఉపాధ్యక్షుడు గంజి సంజీవ, కోశాధికారి రుద్ర వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు గుర్రం శ్రీరాములు, గుర్రం భిక్షమయ్య, కర్నాటి విజయ్, వింజమూరి సురేందర్ పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు, సభ్యులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## సన్‌ఫ్లవర్ గింజలతో.. కొత్త మెరుపు!

చర్మంపై పేరుకొన్న జిడ్డు, మురికి కారణంగా మొటిమలు రావడం, చర్మం నిర్జీవంగా తయారవడం లాంటివి జరుగుతాయి. అయితే వీటికి పొద్దు తిరుగుడు గింజలతోనూ పరిష్కారం లభిస్తుందని చెబుతున్నారు నిపుణులు. సన్‌ఫ్లవర్ గింజలతో తయారుచేసిన స్క్రబ్ ఉపయోగించడం ద్వారా చర్మం, చర్మరంధ్రాలు శుభ్రపడి కొత్త కళ సంతరించుకునే కలపాలి.

ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకొని పావుగంట నుంచి 20 నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత కడిగేస్తే సరిపోతుంది. ఈ ప్యాక్ ముఖంపై పేరుకొన్న మురికిని తొలగిస్తుందట. చర్మానికి తేమనందించి పొడి చర్మం సమస్య నుంచి విముక్తి కలిగిస్తుందట. ఈ ప్యాక్‌ని వారానికోసారి వేసుకోవడం ద్వారా చక్కటి ఫలితం కనిపిస్తుంది




అవకాశం ఉంటుందట. ఈ ఫలితాన్ని పొందడానికి.. అరకప్పు పొద్దు తిరుగుడు గింజలను తీసుకొని మిక్సీలో వేసి పొడిలా తయారుచేసుకోవాలి. ఈ పొడిని గాజు సీసాలో వేసి ఫ్రిజ్‌లో భద్రపరుచుకోవాలి. అందులోంచి కొంత పొడిని తీసుకుని, కొద్దిగా నీరు కలిపి మిశ్రమంలా చేసుకోవాలి. దాంతో ముఖాన్ని, మెడను రుద్దుకోవాలి. ఇలా వారానికోసారి చేయడం వల్ల చర్మం శుభ్రపడటంతో పాటు తగిన పోషణ అంది ఆరోగ్యంగా తయారయ్యే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు.

పొద్దుతిరుగుడు గింజలను రెండు నుంచి మూడు గంటల పాటు ఎండలో ఉంచాలి. ఆ తర్వాత వాటిని మిక్సీలో వేసి పొడిలా చేసుకోవాలి. ఇలా చేసేటప్పుడు మరీ మెత్తగా కాకుండా.. కాస్త గరుకుగా ఉండేలా చూసుకోవాలి. దీన్ని గాజు సీసాలో భద్రపరుచుకోవాలి. ఇలా తయారుచేసిన పొడిని టీస్పూన్ పరిమాణంలో తీసుకొని.. దీనికి మరో టీస్పూన్ వెన్న తొలగించని పాలు, చిటికెడు పసుపు

అంటున్నారు నిపుణులు. మిశ్రమ చర్మతత్వం కలిగిన వారికి చర్మంపై ప్యాచెస్ మాదిరిగా అక్కడక్కడా పొడిగా కనిపిస్తూ ఉంటుంది. ఇలాంటి వారికి పొద్దుతిరుగుడు గింజలతో తయారుచేసిన ఫేస్‌ప్యాక్ చక్కగా నప్పుతుందంటున్నారు నిపుణులు. దీనికోసం పై పద్ధతిలో తయారుచేసి పెట్టుకొన్న సన్‌ఫ్లవర్ గింజల పొడిని టీస్పూన్ తీసుకోవాలి. దీనికి కొద్దిగా గంధం పొడి, రోజ్‌వాటర్ కలిపి మిశ్రమంగా తయారుచేసుకోవాలి. దీన్ని ముఖానికి అప్లై చేసుకోవాలి. ఇరవై నిమిషాల తర్వాత తడివస్త్రంతో ముఖం తుడుచుకొని శుభ్రం చేసుకోవాలి. ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల ముఖంపై డ్రై ప్యాచెస్ పోవడంతో పాటు.. చర్మం సైతం అందంగా కనిపిస్తుందని చెబుతున్నారు నిపుణులు. అయితే ఈ చిట్కాలు సహజసిద్ధమైనవే అయినప్పటికీ.. చర్మతత్వానికి సరిపడతాయో లేదో తెలుసుకోవడానికి ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## మైగ్రేన్‌తో బాధపడుతున్నారా?



పార్శ్వ నొప్పి(మైగ్రేన్) నుంచి ఉపశమనం పొందేందుకు వీటిని ప్రయత్నించండి.

పర్వతాసనం... ముందుగా మ్యాట్ మీద కాళ్లూ చేతుల్ని నేలకు ఆన్చి శరీరాన్ని టేబుల్‌లా ఉంచాలి. ఆపై చేతుల్ని ముందుకు జరుపుతూ నేలపైన బలంగా ఆన్చాలి. తర్వాత నెమ్మదిగా మోకాళ్లను ముందుకు తీసుకురావాలి. కాళ్లను సాధ్యమైనంత వరకూ నిటారుగా ఉంచుతూ మడమలను నేలపైన పూర్తిగా అదిమి పెట్టాలి. మెడ, తల బిగుతుగా లేకుండా ఉంచండి. తలను నేలవైపు వీలైనంత వంచి ఆ దశలో 15–30 సెకన్లు ఉండే ప్రయత్నం చేయండి. కొద్దిరోజుల ప్రాక్టీసుతో క్రమంగా తలను నేలకి ఆనించే క్లిష్టమైన దశకు వెళ్లొచ్చు.

ఉపయోగాలు: భుజాలు, చేతులు, మణికట్టు కండరాలకు బలం ఇస్తుంది. శరీరం ఫ్లెక్సిబుల్‌గా తయారవుతుంది. రక్త ప్రసరణ వ్యవస్థ బావుంటుంది. మైగ్రేన్ నుంచి ఉపశమనం ఉంటుంది. జాగ్రత్తలు: మెడ, భుజం మణికట్టు సమస్యలు ఉన్నవాళ్లు చేయరాదు. ఆహారం: శరీరానికి సరిపడేంత నీళ్లు ఇవ్వాలి. కాఫీ, టీ, శీతల పానీయాలు తీసుకోకూడదు. నిల్వ పచ్చళ్లకు దూరంగా ఉండాలి. తాజా పండ్లూ, కూరగాయలూ ఆహారంలో ఉండాలి. మహాశీర్ష ముద్ర... సుఖాసనంలో ప్రశాంతంగా కూర్చొని, రెండు చేతులను మోకాళ్లపైన ఉంచాలి. ఆపై ఉంగరం వేలును అరచేతి మధ్యలో మూసి ఉంచి, బొటనవేలు, చూపుడువేలు, మధ్యవేలు చివర్లను కలపాలి. చిటికెన వేలును తిన్నగా చాచి ఉంచాలి. ఇలా కళ్లను మూసి ఉంచి రెండు చేతులతోనూ ఈ ముద్ర వేసి శ్వాస మీద ధ్యాస పెట్టాలి.

## వీటిని నానబెడితేనే మంచిదట!

ఒక్కో పదార్థాన్ని తినే పద్ధతి ఒక్కోలా ఉంటుంది. ఈ క్రమంలో డ్రైఫ్రూట్స్, గింజలు.. వంటి కొన్ని పదార్థాల్ని నేరుగా తినేస్తుంటాం. అయితే వీటిని పచ్చిగా కంటే నానబెట్టి తినడం వల్ల ఈ పదార్థాల్లోని పోషకాలు శరీరానికి అంది.. సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని చెబుతున్నారు నిపుణులు. మరి, ఏయే పదార్థాల్ని తినే ముందు నానబెట్టడం మంచిదో



తెలుసుకుందామా?

చాలామంది కిస్మిస్‌లు నేరుగా తినేస్తుంటారు. కానీ వాటిని రాత్రంతా నీటిలో నానబెట్టుకొని తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. ఇలా చేయడం వల్ల వీటిలో ఉండే ఐరన్, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు.. మొదలైన వాటిని శరీరం సులభంగా గ్రహిస్తుందని చెబుతున్నారు. సబ్జా గింజల్ని నానబెట్టుకొనే తీసుకుంటుంటారు చాలామంది. ఇవి అరుగుదలను ప్రేరేపించడంతో పాటు శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతాయి. అలాగే కడుపు నిండుగా ఉండేలా చేసి బరువు తగ్గడంలోనూ సహకరిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

అవిసె గింజల్ని రాత్రంతా నీటిలో నానబెట్టి తీసుకోవడం వల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే ఇందులో ఉండే వివిధ పోషకాల స్థాయిలు పెరుగుతాయట. వీటిని తీసుకోవడం వల్ల పొట్ట ఆరోగ్యం మెరుగుపడుతుందని చెబుతున్నారు నిపుణులు. అలాగే గుమ్మడి

బాదం పప్పులు, గింజలు.. మొదలైన వాటిని కూడా నేరుగా కంటే నానబెట్టుకొని తినడం వల్ల అధిక ఆరోగ్య ప్రయోజనాల్ని పొందచ్చని నిపుణులు చెబుతున్నారు. వాల్‌నట్స్‌ని నీటిలో నానబెట్టడం వల్ల త్వరగా జీర్ణమై.. పోషకాల్ని గ్రహించే శక్తిని శరీరానికి అందిస్తాయట. అలాగే ఈ నట్స్‌లో ఉండే ఒమేగా–3 ఫ్యాటీ ఆమ్లాలు గుండె ఆరోగ్యానికి, దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తోడ్పడతాయని ఓ అధ్యయనంలో తేలింది. వండే ముందు ఓట్స్‌ని ఓ గంట పాటు నానబెట్టడం వల్ల వాటిలోని పిండి పదార్థాలు విచ్ఛిన్నమవుతాయట. అలాగే అందులోని ఫైటికామ్లం స్థాయిలు కూడా తగ్గి.. జీర్ణశక్తి మెరుగుపడుతుందట. ఇదే విధంగా వండే ముందు పప్పుల్ని నానబెట్టడం వల్ల వాటిలోని సంక్లిష్ట చక్కెరలు విచ్ఛిన్నమవుతాయి. తద్వారా పప్పులు త్వరగా జీర్ణమవుతాయి. అలాగే వండే సమయం కూడా ఆదా అవుతుందని చెబుతున్నారు నిపుణులు. ఈ క్రమంలో నట్స్, గింజల్ని 6–8 గంటల పాటు నానబెట్టాలంటున్నారు నిపుణులు. అదే పప్పుల విషయానికొస్తే 8–12 గంటలు నానబెట్టడం వల్ల ఫలితం ఉంటుందంటున్నారు. ఇక నానబెట్టేటప్పుడు ఆ నీటిలో చిటికెడు ఉప్పు వేస్తే వాటి రుచి పెరుగుతుందట! అయితే వండేటప్పుడు మాత్రం నానబెట్టిన నీటిని వంపేసి.. ఒకట్రెండుసార్లు వాటిని కడిగి వండుకోవడం మంచిది అంటున్నారు నిపుణులు.

## అల్పాహారం... ఆరోగ్యమేనా?

రోజంతా అలసట దరిచేరొద్దు, ఉత్సాహంగా ఉండాలంటే అల్పాహారం తీసుకోవాల్సిందే! ఇది అర్థమయ్యాక చాలామంది అమ్మాయిలు దీని మీద దృష్టిపెడుతున్నారు. తప్పకుండా సమయానికి ఏదో ఒకటి తింటున్నారు. అయితే అది ఆరోగ్యకరమేనా?

బ్రెడ్ జామ్, బిస్కెట్లు, సెరియల్స్... చాలామంది జాబితాలో ఇవే ఉంటున్నాయట. మిల్లెట్స్‌వి, చక్కెర లేనివి కాబట్టి, ఆరోగ్యానికి మేలే అనుకుంటున్నారు. కానీ అవే సరిపోవు అంటున్నారు నిపుణులు. అల్పాహారం... మనకి తొలి భోజనం. ఇది ఎంత పోషకభరితంగా ఉంటే అంత మేలు. కాబట్టి, తీసుకునేదానిలో ప్రొటీన్, ఫైబర్, ఆరోగ్య కొవ్వులు ఉండేలా చూసుకోవాలి. ఇవన్నీ శక్తినివ్వడమే కాదు... మళ్లీమళ్లీ ఆకలేయకుండానూ చూస్తాయి. దీంతో అదనపు బరువుకీ చెక్ పడుతుంది. కాబట్టి, కేవలం కార్బోహైడ్రేట్లమీదే ఆధారపడకూడదు. ఉప్మానే తీసుకుంటే...



దానికి పల్లీలు, మొలకలు, కూరగాయముక్కల్ని జోడించుకోవచ్చు. బ్రెడ్ అయితే పనీర్ లేదా గుడ్డు కలిపి తీసుకోవాలి. ఓట్స్‌కి జతగా పాలు, నట్స్, సీడ్స్ తీసుకోవాలి. ఇలా పండ్లు, కాయగూరలు, పప్పులు, నట్స్ వంటివి చేర్చుకోవడం వల్ల న్యూట్రియంట్లతోపాటు పీచు కూడా అందుతుంది. పాలు, పెరుగు, పనీర్, గుడ్డు కావాల్సిన ప్రొటీన్‌ను భర్తీ చేస్తాయి. కాబట్టి, భారీ మార్పులే అక్కర్లేదు. ఇలా చిన్న చిన్న మార్పులు చేసుకున్నా... పోషకాల సమన్వయం కుదురుతుంది. మరి ఇలా ప్లాన్ చేసుకుంటారా?

## నేలపై కూర్చుని తింటే..!

ఈ రోజుల్లో నేల మీద కూర్చొని భోజనం చేసేవారు చాలా తక్కువమందే! కానీ కుర్చీ కంటే నేలపై కూర్చొని తినడమే ఆరోగ్యకరం అంటున్నారు నిపుణులు. కాళ్లు ముడుచుకొని నేల మీద



కూర్చోవడం వల్ల ఆరోగ్యపరంగా పలు ప్రయోజనాలు చేకూరతాయని చెబుతున్నారు. అవేంటో తెలుసుకుందాం రండి.. నేల మీద కూర్చొని తినడం చాలా సౌకర్యంగా ఉంటుంది. అలాగే దీనివల్ల పొట్ట చుట్టూ ఉండే కండరాల్లో నొప్పి ఉంటే తొలగిపోయే అవకాశం ఉంటుందట. ఇలా రోజూ కింద కూర్చొని తినడం అలవాటు చేసుకుంటే కండరాల్లో కదలిక పెరిగి అవి ఫ్లెక్సిబుల్‌గా, దృఢంగా మారతాయి. అలాగే ఈ భంగిమ వివిధ రకాల శారీరక నొప్పుల నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుందంటున్నారు నిపుణులు. కింద కూర్చొని నేలపై ప్లేట్ పెట్టుకుని తినడం వల్ల జీర్ణక్రియ సాఫీగా సాగుతుందంటున్నారు నిపుణులు. ఈ ప్రక్రియలో భోజనం నోట్లో పెట్టుకోవడానికి ముందుకు వంగడం, తిరిగి వెనక్కి రావడం.. ఇలాంటి కదలికల వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందట. సాధారణంగా మనకు సరిపోయేంత తిన్నామా? లేదా? అనే విషయం తెలియడానికి పొట్ట నుంచి మెదడుకు సిగ్నల్స్ అందించే నాడి ఒకటి ఉంటుంది. డైనింగ్ టేబుల్‌పై తినడం కంటే కింద కూర్చొని తినడం వల్ల ఈ నాడి మరింత సమర్థంగా పనిచేస్తుందట!కాబట్టి మనకు సరిపోయేంత ఆహారం మాత్రమే తీసుకుంటాం. ఫలితంగా బరువు అదుపులో ఉండే అవకాశమూ ఉంటుందంటున్నారు నిపుణులు. ఒకసారి మీ కుటుంబ సభ్యులందరితో కలిసి హాయిగా కింద కూర్చొని తినండి.. మనసుకు ఎంత ప్రశాంతంగా ఉంటుందో మీకే అర్థమవుతుంది.

## అందుకే కుదుళ్లకు మసాజ్!

గోరువెచ్చని నూనెతో కుదుళ్లకు నెమ్మదిగా మర్దన చేసుకుంటుంటే ఎంత హాయిగా ఉంటుందో కదూ! అయితే దీనివల్ల కేవలం కుదుళ్లకు రక్తప్రసరణ సక్రమంగా జరగడమే కాదు.. జుట్టు ఒత్తుగానూ పెరుగుతుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో మర్దన చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో తెలుసుకుందాం రండి.. కుదుళ్ల మర్దన కోసం జొజోబా లేదా బాదం నూనె ఉపయోగించడం మంచిదంటున్నారు నిపుణులు. దీనివల్ల కుదుళ్లకు రక్తప్రసరణ సాఫీగా జరగడమే కాకుండా కురులకు పోషణ కూడా లభిస్తుంది. ఇలా తరచూ మర్దన చేయడం వల్ల జుట్టు చక్కగా పెరిగే అవకాశం ఉంటుందట.



మర్దన చేసే క్రమంలో ఎక్కువ మొత్తంలో నూనెను ఉపయోగించకూడదు. ఎందుకంటే దీనివల్ల కుదుళ్లు, ముఖం జిడ్డుగా మారి.. ఇతర సమస్యలు కొని తెచ్చుకున్నట్లవుతుందంటున్నారు నిపుణులు.

మర్దన చేసే క్రమంలో స్ట్రోక్స్ సరిగా ఇవ్వకపోతే తలనొప్పి వచ్చే అవకాశం ఉంటుందట.

చేతివేళ్లతో మర్దన చేసుకుంటాం కాబట్టి వాటికి గోళ్లు లేకుండా జాగ్రత్తపడాలి. లేదంటే అవి కుదుళ్లకు గీసుకుపోయే అవకాశం ఉంటుంది.

నూనెతో తరచూ మర్దన చేసుకోవడం వల్ల కురులకు సహజసిద్ధమైన మెరుపు వస్తుంది. అలాగే ఒత్తుగా కూడా పెరుగుతుందంటున్నారు నిపుణులు.

## హాయినిచ్చే బాత్ సాల్ట్స్!

అలసటగా అనిపించినప్పుడు గోరువెచ్చని నీటితో స్నానం చేయడం శరీరానికే కాదు, మనసుకూ ఎంతో ఉపశమనం. ఈ అనుభూతిని మరింత ఆహ్లాదకరంగా మార్చేవే బాత్‌సాల్ట్స్. సెల్ఫ్‌కేర్‌కి ప్రాధాన్యం పెరిగిన నేపథ్యంలో వీటి వాడకమూ పెరుగుతోంది. ఎప్సమ్ సాల్ట్‌కి ఎసెన్షియల్ ఆయిల్స్, ఎండబెట్టిన పూలరేకలు... వంటి సహజ పదార్థాలను కలిపి బాత్‌సాల్ట్స్‌ని తయారు చేస్తారు. అందులో వాడిన పదార్థాలను బట్టి లావెండర్, రోజ్, యూకలిప్టస్, పుదీనా, సిట్రస్... వంటి బాత్‌సాల్ట్స్ రకాలెన్నో మార్కెట్లో లభిస్తున్నాయి. ఈ ఉప్పులో మెగ్నీషియం సల్ఫేట్ ఉంటుంది. దీంతో స్నానం వల్ల కండరాల అలసట, శరీర బిగుతు తగ్గిన





అనుభూతి కలుగుతుంది. ఎక్కువసేపు నిలబడి పనిచేసే మహిళలు, వ్యాయామం తర్వాత విశ్రాంతి కోరుకునేవారు ఈ బాత్‌సాల్ట్స్‌ని ఉపయోగించొచ్చు. అయితే, సున్నితమైన చర్మతత్వం గలవారు... సువాసన, రంగులు తక్కువగా ఉన్న రకాలను వాడితే మేలు.

బకెట్ గోరువెచ్చని నీటిలో మీకు నచ్చిన రకం బాత్‌సాల్ట్‌ని ఓ గుప్పెడు కలపండి. కరిగాక ఆ నీటితో కనీసం పదిహేను నిమిషాలైనా స్నానం చేయగలిగితే మేలు. ఆపై తేమ పోకుండానే మాయిశ్చరైజర్ రాస్తే పొడిబారకుండా ఉంటుంది. దీనివల్ల రక్తప్రసరణ మెరుగవుతుంది. సహజ మెరుపు వస్తుంది. అంతేనా, చర్మ రంధ్రాలను తెరిచి లోపల వరకూ వెళ్లిన జిడ్డు, దుమ్ము, ఇతర మలినాలను ఈ సాల్ట్స్ శుభ్రపరుస్తాయి. వీటికి ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు మొటిమలను తగ్గిస్తాయి. అయితే... గర్భిణులు, మధుమేహం, రక్తప్రసరణ సమస్యలున్నవారు, గాయాలు, చర్మంపై దద్దుర్లు, ఎగ్జిమా, ఇతర అలర్జీలతో బాధపడేవారు వైద్యుల సలహా లేకుండా ఉపయోగించకూడదు. అలానే, వాడే ముందు ప్యాచ్ టెస్ట్ తప్పనిసరి.

## ఏడాది పిల్లలూ స్క్రీన్ చూస్తే...

ఈ డిజిటల్ యుగంలో పిల్లలు స్క్రీన్‌కు ఎంతలా అలవాటు పడుతున్నారో తెలిసిందే. ఈ అలవాటు పిల్లల్లో చాలా నైపుణ్యాలను దెబ్బతీస్తోంది. అయితే, మిగిలిన వయసుల కన్నా ప్రత్యేకించి తొలి, ఆరో ఏడాదిలో పిల్లలు స్క్రీన్ చూడడం వాళ్ల జ్ఞాపకశక్తిపై తీవ్ర ప్రభావం చూపిస్తుందంటోంది వరల్డ్ జర్నల్ ఆఫ్ పీడియాట్రిక్స్ తాజా అధ్యయనం. పిల్లల్లో తొలి ఏడాది అత్యంత కీలకమైనది. ఈ దశలో ముఖాముఖి సంభాషణలు, శారీరక కదలికలు, ఆటల ద్వారా మెదడు వేగంగా పెరుగుతుంది. అలానే, ఆరో ఏట పాఠశాల విద్య ప్రారంభమవుతుంది. అంటే నేర్చుకునే దశ ఇది. ఈ రెండు కీలక సమయాల్లో స్క్రీన్ ఎక్కువ సేపు చూడడం వల్ల... తరవాతి కాలంలో పిల్లల్లో వర్కింగ్ మెమరీ అంటే... స్కూల్లో ఇచ్చే సూచనలు పాటించడానికీ, సమస్యలను పరిష్కరించడానికీ కొత్త విషయాలు నేర్చుకోవడానికీ కావాల్సిన జ్ఞాపకశక్తి తగ్గిపోతుందట. దాంతో చదువుల్లో వెనకబడే ప్రమాదం ఉందంటున్నారు శాస్త్రవేత్తలు. అయితే, 2–3 సంవత్సరాల వయసులో పిల్లలు ఈ స్క్రీన్ చూడడం వల్ల, తరవాతి కాలంలో జ్ఞాపకశక్తిపైనగానీ, చదువులపైగానీ, గణనీయమైన సంబంధం లేకపోవడం గమనార్హం. అందుకే, పిల్లలకు స్క్రీన్ ఎంత సేపు ఇస్తున్నామో మాత్రమే కాదు, ఏ వయసులో ఇస్తున్నామన్నదీ కీలకం.



## వీటితోనూ ఫిట్‌గా మారచ్చు..!



ఇంటి పనులతో కూడా ఫిట్‌నెస్ సాధ్యమే అంటున్నారు నిపుణులు. గిన్నెలు శుభ్రం చేసుకోవడం, బట్టలు ఉతకడం.. ఇంటిని క్లీన్ చేసుకోవడం.. ఇలా మనం చేసే ప్రతి పనీ మన శరీరానికి వ్యాయామంలా ఉపయోగపడుతుందంటున్నారు. అదెలాగో చూద్దాం రండి..

ఏ పనైనా సరే– భారంగా ఫీలయితే అస్సలు చేయాలనిపించదు. అందుకే రోజువారీ పనులు కాకుండా అదనంగా పనులేవైనా చేయాల్సి వచ్చినప్పుడు వాటిని బరువుగా అనుకోవద్దు. ఉదాహరణకు.. పండగలు, శుభకార్యాలకు ఇంట్లో బూజు దులపడం, వస్తువులన్నీ శుభ్రం చేసుకోవడం.. మొదలైనవి చేస్తుంటాం. అయితే ఇవన్నీ చేసుకోవడం కాస్త కష్టమే అయినా వీటి వల్ల శరీరానికి అందే వ్యాయామం ఎక్కువే! ఎక్సర్‌సైజ్ చేసేటప్పుడు ఎలా ఎంజాయ్ చేస్తామో.. ఇంటి పనులన్నీ కూడా అంతే ఉత్సాహంతో చేస్తే అలుపన్నది అంత త్వరగా దరిచేరదు. పైగా పనులు కూడా త్వరగా పూర్తవుతాయి.. ఒంటికి వ్యాయామమూ అందుతుంది.

ఇల్లు ఊడవడం, తుడవడం.. లాంటి పనులు చేయడానికి చాలామంది ఆసక్తి చూపరు. కానీ ఈ పనుల వల్ల భుజాల కండరాలకు వ్యాయామం లభించి అవి మరింత దృఢమవుతాయట.

ఇంట్లో మనం చేసే చాలా పనులు నిల్చొని చేయాల్సి వస్తుంటుంది. అయితే ఈ క్రమంలో 'కాళ్లు లాగేస్తున్నాయ్!' లేదంటే 'నడుం నొప్పి వస్తోంది' అంటూ నీరసించిపోతుంటారు కొందరు. కానీ ఇలా నిలబడి, అటూ ఇటూ తిరుగుతూ పనులు చేయడం వల్ల కూడా శరీరానికి చక్కటి వ్యాయామం అందుతుందంటున్నారు నిపుణులు. తద్వారా కాళ్లు, నడుము భాగంలోని కండరాలు దృఢమవుతాయని చెబుతున్నారు.

ఇంట్లో చేసే పనుల్లో భాగంగా బరువులెత్తడం, వస్తువులను ఒకచోట నుంచి మరో చోటుకి మార్చడం.. వంటివి సహజం. వీటి వల్ల కూడా శరీరానికి మంచి ఎక్సర్‌సైజ్ అందుతుంది.

ఇంట్లో ఉండే షెల్ఫ్‌లు, వస్తువులు శుభ్రం చేసేటప్పుడు భుజాలను పైకి, కిందికి కదపాల్సి ఉంటుంది. ఇలా చేయడం వల్ల కూడా భుజాల కండరాలకు వ్యాయామం లభించి అవి మరింత దృఢమవుతాయట.

బట్టలు ఉతికి, ఆరేసే క్రమంలో పొట్టలోని కండరాలకు మంచి వ్యాయామం అందుతుంది. అలాగే శరీరంలోని క్యాలరీలు కూడా ఖర్చవుతాయి. కాబట్టి ఎప్పుడూ వాషింగ్ మెషీన్‌పై ఆధారపడకుండా.. అప్పుడప్పుడూ చేత్తో ఉతకడం అలవాటు చేసుకోవాలి.

## వంటనూనెల ధరలు తగ్గొచ్చు!



సన్‌ఫ్లవర్, సోయాబీన్, పామాయిల్‌లోని ముడి, రిఫైన్డ్ నూనె రకాలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని(బీసీడీ) కేంద్రం బుధవారం తగ్గించింది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్లో ధరలు తగ్గే అవకాశం ఉంది. ముడి పొద్దుతిరుగుడు పువ్వు నూనెపై బీసీడీని 10 శాతం నుంచి సున్నాకు, రిఫైన్డ్ పొద్దుతిరుగుడు పువ్వు నూనెపై 32.5 శాతం నుంచి 22.5 శాతానికి, ముడి సోయాబీన్ నూనె, పామాయిల్‌పై 10% నుంచి 5 శాతానికి, రిఫైన్డ్ సోయాబీన్, పామాయిల్‌పై 32.5% నుంచి 27.5 శాతానికి బీసీడీని తగ్గించింది. సెప్టెంబరు 24 నుంచే కోతలు అమల్లోకి వస్తాయని ఆర్థిక శాఖ ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది.




# సెన్సెక్స్ 1248 పాయింట్లు డౌన్..



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల కారణంగా చమురు ధరలు, బాండ్ రాబడులు పెరగడం ప్రతికూల ప్రభావం చూపింది. దీనికితోడు రూపాయి బలహీన పడడం, అమెరికా ఫెడ్ మరోసారి వడ్డీ రేట్లు పెంచుతుందన్న భయాలు సూచీలను ప్రభావితం చేశాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 1200 పాయింట్లకు పైగా పతనం కాగా.. నిఫ్టీ 23,063 పాయింట్లకు పడిపోయింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.5 లక్షల కోట్లు క్షీణించి రూ.480 లక్షల కోట్లకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 74,272.40 (క్రితం ముగింపు 74,828.25) వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 73,563.92 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1247.71 పాయింట్లు కుంగి.. 73,580.54 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 383.70 పాయింట్లు క్షీణించి 23,063.10 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.95గా ఉంది. సెన్సెక్స్ 30లో ఎన్‌టీపీసీ మినహా మిగతా అన్నీ షేర్లు నష్టాలను చవిచూశాయి. బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇండిగో, ట్రెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 105.23 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర 4,252.79 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా బాండ్లపై రాబడులు పెరగడం ఈక్విటీ ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అమెరికాలో 10 ఏళ్ల యూఎస్ ట్రెజరీ రాబడులు 5.11 శాతం దాటాయి. 2007 తర్వాత ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. సాధారణంగా బాండ్ రాబడులు పెరిగితే భారత్ వంటి వర్ధమాన దేశాల ఈక్విటీ మార్కెట్లపై మదుపర్లకు ఆసక్తి తగ్గుతుంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర మరోసారి పెరగడం మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది. 100 డాలర్లకు దిగువకు చేరినట్లే చేరిన క్రూడ్.. మళ్లీ 105 డాలర్ల స్థాయికి చేరింది. యుద్ధాన్ని ముగించే విషయంలో అమెరికా – ఇరాన్ మధ్య విభేదాలు కొనసాగుతుండటం దీనికి కారణం. అమెరికా ఒత్తిళ్లకు ఏమాత్రం తలొగ్గబోమని ఐక్యరాజ్యసమితి వేదికగా ఇరాన్ అధ్యక్షుడు ప్రకటించడం మరో కారణం. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ మరోసారి వడ్డీ రేట్లను పెంచుతుందన్న అంచనాలతో ప్రపంచ ఈక్విటీలపై ఒత్తిడి మరింత పెరిగింది. పెరుగుతున్న ముడి చమురు ధరలు ద్రవ్యోల్బణాన్ని పెంచుతాయన్న భయాలు నెలకొన్నాయి. దీంతో అవసరమైతే మరిన్ని పెంపులు ఉంటాయని ఫెడరల్ రిజర్వ్ గవర్నర్ మైఖేల్ బార్ పేర్కొనడం ఇందుకు నేపథ్యం.

దేశీయంగా బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ తీసుకొచ్చిన కొత్త ప్రతిపాదనల వల్ల బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ మరింత క్షీణించడం కూడా సూచీలపై ప్రభావం చూపాయి.

# టాప్-10 జాబితాలోకి NSE




ఎన్నో అంచనాల మధ్య లిస్టింగ్‌కు వచ్చి నిరుత్సాహ పరిచిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (NSE) అరుదైన మైలురాయిని అందుకుంది. ఫ్లాట్‌గా ట్రేడింగ్ మొదలైనప్పటికీ.. ఆ తర్వాత షేర్లు 5 శాతం మేర రాణించడంతో ఎన్ఎస్ఈ ఎలైట్ క్లబ్‌లో చేరింది. మార్కెట్ విలువ పరంగా టాప్–10 కంపెనీల్లో (Top 10) ఒకటిగా నిలిచింది. ఎన్ఎస్ఈ షేర్లు ఈ ఉదయం స్వల్ప లాభాల్లో బీఎస్ఈలో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. ఇష్యూ ధర రూ.1785తో పోలిస్తే కేవలం 0.84 శాతం లాభంతో రూ.1800 వద్ద ట్రేడింగ్‌ను ఆరంభించాయి. ఆపై షేరు ధర 5.21 శాతం లాభంతో రూ.1878కి చేరింది. దీంతో మార్కెట్ విలువ 4.54 లక్షల కోట్లకు (రూ.4,54,966.88 కోట్లు) పెరిగింది. ఈ క్రమంలో బీఎస్ఈ నమోదిత కంపెనీల్లో టాప్–10 జాబితాలో ఎన్ఎస్ఈ చేరింది. హిందుస్థాన్ యునిలీవర్‌ను 11వ స్థానానికి నెట్టింది.

టాప్–10 కంపెనీలు ఇవే..

- రిలయన్స్ ఇండస్ట్రీస్ – రూ.16,67,750.07 కోట్లు
- భారతీ ఎయిర్‌టెల్ – రూ.11,32,338.92 కోట్లు
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ – రూ.11,26,035.78 కోట్లు
- ఐసీఐసీఐ బ్యాంక్ – రూ.9,57,570.88 కోట్లు
- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా – రూ.9,12,415.14 కోట్లు
- టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ – రూ.7,57,627.53 కోట్లు
- బజాజ్ ఫైనాన్స్ – రూ.6,15,435.85 కోట్లు
- లార్సెన్ అండ్ టుబ్రో – రూ.5,32,457.60 కోట్లు
- ఎల్ఐసీ – రూ.5,13,716.31 కోట్లు
- నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ – రూ.4,54,966.88 కోట్లు.

# అపోలో హాస్పిటల్స్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా ఉపాసన




ప్రముఖ హాస్పిటల్ చైన్ అపోలో హాస్పిటల్స్ ప్రాజెక్ట్స్ విభాగానికి నటుడు రాంచరణ్ భార్య ఉపాసన కామినేని కొణిదెల డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం అపోలో హాస్పిటల్స్ గ్రూప్ సీఎస్ఆర్ విభాగానికి ఆమె వైస్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. డైరెక్టర్ హోదాలో దేశవ్యాప్తంగా ఆసుపత్రి ప్రాజెక్టుల అభివృద్ధిని ఆమె పర్యవేక్షించనున్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఉపాసన స్వయంగా పోస్ట్ పెట్టారు.

విస్తరణ ప్రణాళికలో భాగంగా రూ.8600 కోట్లు పెట్టుబడికి అపోలో హాస్పిటల్స్ సన్నద్ధమవుతున్న వేళ ఈ నియామకం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అందరికీ ప్రపంచస్థాయి వైద్య సేవలందించాలన్న లక్ష్యంతో అపోలో హాస్పిటల్స్‌ను తమ తాతగారైన డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి ఏర్పాటు చేశారని ఉపాసన పేర్కొన్నారు. దాన్ని ముందుకు తీసుకెళ్లడం తనపై ఉన్న బాధ్యతగా ఫార్చ్యూన్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. అపోలో హాస్పిటల్స్‌తో పాటు డిజిటల్ వెల్‌నెస్, కార్పొరేట్ ప్లాట్‌ఫామ్ అయిన యువర్‌లైఫ్ (URlife)కు కూడా ఉపాసన మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

# IRDAI రూల్స్.. పీబీ ఫిన్‌టెక్ 30%, టర్టిల్‌మింట్ 20% ఢమాల్!



బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ (IRDAI) తీసుకొస్తున్న కొత్త నిబంధనలతో బీమా, ఇన్సూరెన్స్ డిస్ట్రిబ్యూషన్ షేర్లు కుదేలయ్యాయి. బీమా సంస్థలకు చెందిన వెబ్‌సైట్లలో 'డార్క్ ప్యాటర్న్స్'పై నిషేధం విధించే లక్ష్యంతో తీసుకొచ్చిన ప్రతిపాదిత నిబంధనలతో ఆయా షేర్లు అమ్మకాలు నేడు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా పీబీ ఫిన్‌టెక్, టర్టిల్‌మింట్ వంటి డిస్ట్రిబ్యూషన్ ప్లాట్‌ఫామ్‌ల ఆదాయానికి గండి కొట్టేలా ఈ నిబంధనలు ఉండడంతో ఈ రెండు స్టాక్స్ భారీగా పతనమయ్యాయి.

పాలసీ బజార్ మాతృ సంస్థ అయిన పీబీ ఫిన్‌టెక్ షేరు అత్యధికంగా 30 శాతం మేర పతనమై రూ.1,320 స్థాయికి చేరింది. ఈ ఒక్క రోజే కంపెనీ మార్కెట్ విలువ దాదాప రూ.24,500 కోట్లకు పైగా ఆవిరైంది. పీబీ ఫిన్‌టెక్‌కు ఇదే ఒకరోజు అత్యధిక నష్టం కావడం గమనార్హం. మరో డిస్ట్రిబ్యూషన్ ప్లాట్‌ఫామ్ టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్ సొల్యూషన్స్ షేరు విలువ కూడా 20 శాతం మేర క్షీణించి రూ.109.04కు చేరింది. జూన్‌లో లిస్టయిన ఈ కంపెనీ ఒక్కరోజులో ఈ స్థాయిలో నష్టపోవడం ఇదే తొలిసారి. ఈ కంపెనీ మార్కెట్ విలువ సైతం రూ.800 కోట్లు క్షీణించింది. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎస్‌బీఐ లైఫ్, మ్యాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి ఇతర బీమా కంపెనీల షేర్లలోనూ ఒత్తిడి కనిపించినప్పటికీ.. డిస్ట్రిబ్యూషన్ ప్లాట్‌ఫామ్‌లతో పోలిస్తే వీటిపై ప్రభావం తక్కువే. బీమా పంపిణీని మరింత పారదర్శకంగా, వినియోగదార్లకు ప్రయోజనకరంగా మార్చే లక్ష్యంతో తీసుకొచ్చే సంస్కరణల్లో భాగంగా ఒక చర్చాపత్రాన్ని ఐఆర్‌డీఏఐ జారీ చేసింది. 'రీక్యాలిబ్రేటింగ్ ఎకనమిక్స్ ఆఫ్ ఇన్సూరెన్స్ డిస్ట్రిబ్యూషన్' పేరిట విడుదలైన ఈ పత్రంలో పంపిణీ, దాని నిర్మాణం, వ్యయాలు, కమీషన్లు, మార్కెట్ ధోరణులు, పారదర్శకత, డిజిటల్ వసతుల వాడకం తదితరాలను చేర్చింది. అక్టోబరు 25 వరకు ఈ చర్చాపత్రంపై ప్రజలు, సంబంధిత వర్గాలు స్పందనలు తెలపొచ్చని తెలిపింది. ప్రతిపాదిత నిబంధనల ప్రకారం.. డిస్ట్రిబ్యూటర్లు, అగ్రిగేటర్లు సంపాదించే కమీషన్లు లేదా టేక్–రేట్లపై పరిమితులు విధించాలని ఐఆర్‌డీఏఐ ప్రతిపాదించింది. ముఖ్యంగా హెల్త్, మోటార్ ఇన్సూరెన్స్ విభాగాల్లోని మార్జిన్లపై ఇది తీవ్ర ప్రభావం చూపవచ్చని బ్రోకరేజ్ సంస్థ బెర్న్‌స్టీన్ పేర్కొంది. వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా యాప్‌లు, వెబ్‌సైట్లలో ఉండే 'డార్క్ ప్యాటర్న్స్'పై నిషేధించాలనీ పేర్కొంది. వినియోగదారుడి వ్యక్తిగత వివరాలు తీసుకోకుండానే పాలసీ ఫీచర్లు, ధరలను పారదర్శకంగా చూపించాలని స్పష్టం చేసింది. ఈ కారణంతో బీమా డిస్ట్రిబ్యూషన్ కంపెనీ షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి.




## లక్ష్య సెంచరీ.. మూడో వన్డే యువ భారత్‌దే



యువ భారత్‌కు ఎదురేలేదు. ఆస్ట్రేలియాతో మూడు మ్యాచ్‌ల అండర్–19 వన్డే సిరీస్‌ను 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఇప్పటికే సిరీస్ సొంతం చేసుకున్న భారత జట్టు బుధవారం నామమాత్రమైన మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో కంగారూ జట్టును చిత్తు చేసింది. కెప్టెన్ లక్ష్య రాయ్‌చందాని (110 నాటౌట్; 106 బంతుల్లో 9×4, 3×6) చెలరేగడంతో 255 పరుగుల లక్ష్యాన్ని భారత్ 41.2 ఓవర్లలో (4 వికెట్లకు) ఛేదించింది. కుశాగ్ర ఓజా (45), రజత్ భఘేల్ (44 నాటౌట్) రాణించారు. అంతకు ముందు మోహిత్ (3/43), మనాల్ చౌహాన్ (3/42) విజృంభించడంతో ఆస్ట్రేలియా అండర్–19 జట్టు 49.3 ఓవర్లలో 254 పరుగులకు ఆలౌటైంది. జెడ్ హోలిక్ (87) టాప్‌స్కోరర్.

# విరాట్-రోహిత్.. 2027 ప్రపంచకప్ గెలవాలి: రింకు సింగ్




వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్‌లో స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడుతారా? అనే దానిపై కొంత కాలంగా చర్చ జరుగుతూనే ఉంది. ప్రతిష్ఠాత్మక టోర్నీకి వీరిని విస్మరించొద్దని కొందరు సూచిస్తుండగా.. యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. దీంతో రో–కో (Ro–Ko) భవిష్యత్తుపై సందిగ్ధత కొనసాగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో టీమ్‌ఇండియా బ్యాటర్ రింకు సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విరాట్ –రోహిత్ కలిసి 2027 వన్డే ప్రపంచకప్ నెగ్గితే చూడాలని ఉందని ఆకాంక్షించాడు. ''విరాట్ భాయ్, రోహిత్ భాయ్.. ఇద్దరూ లెజెండ్స్. వీరు ప్రపంచకప్‌లో ఆడాలని, ట్రోఫీ గెలుచుకునే జట్టులో భాగంగా ఉండాలని నేను మాత్రమే కాదు.. యావత్ దేశం ఆశిస్తోంది. అదే జరిగితే దేశం మొత్తానికీ అదో గొప్ప క్షణం అవుతుంది. ఎందుకంటే ఇదే వారికి చివరి ప్రపంచకప్ కావొచ్చు. ఇక, మనం చాలా కాలంగా వన్డే ప్రపంచ కప్‌ను అందుకోలేదు. చివరిసారిగా 2011లో జరిగిన మెగా టోర్నీలో విజయం సాధించాం. ఇప్పుడు గెలిస్తే రో–కోకి కూడా గొప్పగా ఉంటుంది. అందువల్ల వీరిద్దరూ జట్టులో ఉండి, దేశానికి ట్రోఫీ అందిస్తారని ఆశిస్తున్నా'' అని రింకు వ్యాఖ్యానించాడు. 2024లో పొట్టి ప్రపంచకప్ గెలిచి సంతోషంగా, సంతృప్తిగా అంతర్జాతీయ టీ20లకు గుడ్‌బై చెప్పారు రో–కో. ఆ తర్వాత ఏడాదిలోనే టెస్టులకూ వీడ్కోలు పలికారు. అప్పటి నుంచి మిగిలిన ఏకైక ఫార్మాట్ వన్డేల్లో వీరు ఎంత కాలం కొనసాగుతారనే ప్రశ్నలు ఎదురవుతూనే ఉన్నాయి. వయసు, ఫిట్‌నెస్‌ను పరిగణనలోకి తీసుకుంటే వచ్చే ఏడాది వీరిని వన్డే ప్రపంచకప్‌లోకి తీసుకుంటారా? లేదా అనేదానిపై సందేహాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఇటీవల రోహిత్ రిటైర్మెంట్ ప్రకటిస్తాడనే వార్తలూ వినిపించాయి. వాటికి చెక్‌పెడుతూ లార్డ్స్‌లో శతకంతో అదరగొట్టాడు హిట్‌మ్యాన్. ఈ నెలాఖరులో సొంతగడ్డపై వెస్టిండీస్‌తో జరిగే వన్డే సిరీస్‌లో వీరిద్దరూ ఆడనున్నారు. కోహ్లీ ఇప్పటి వరకు 314 వన్డేల్లో 14,941 పరుగులు సాధించాడు. ఇందులో 54 సెంచరీలు, 79 అర్ధశతకాలున్నాయి. రోహిత్ 288 వన్డే మ్యాచుల్లో 11,895 పరుగులు చేశాడు. ఇందులో 34 సెంచరీలు, 62 అర్ధశతకాలు ఉన్నాయి. ఈ ఏడాది ఆరు ఇన్నింగ్స్ ఆడిన విరాట్.. 106 స్ట్రైక్ రేటుతో 384 పరుగులు చేశాడు. రోహిత్ 9 ఇన్నింగ్స్‌ల్లో 379 పరుగులు నమోదు చేశాడు.

# చివరి నిమిషంలో జట్టులోకి వచ్చి.. రజతంతో మెరిసి..!



ఆసియా క్రీడల్లో భారత పతకాల వేట కొనసాగుతోంది. వుషు 60 కిలోల విభాగంలో మన అథ్లెట్ రోషిబినా దేవి రజతం దక్కించుకుంది. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చైనా అథ్లెట్ జాంగ్ షియావు చేతిలో 0–2తో ఓటమి పాలైన రోషిబినా రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే, ఈ టోర్నీకి చివరి నిమిషంలో ఎంపికైన రోషిబినా .. రజతంతో మెరవడం విశేషం. మణిపూర్‌కు చెందిన రోషిబినా 2018లో జరిగిన ఆసియా క్రీడల్లో కాంస్యం సాధించింది. ఆ తర్వాత 2021లో జరిగిన ఇదే పోటీల్లో రజతం సొంతం చేసుకుంది. ఈసారి కూడా సిల్వర్ మెడల్ సాధించి.. ఆసియా క్రీడల్లో హ్యాట్రిక్ విజయాలు నమోదు చేసింది. వాస్తవానికి ఈ ఏడాది ఆసియా క్రీడలకు ముందు నిర్వహించిన ట్రయల్స్‌లో దివ్యాంశి చౌదరి చేతిలో రోషిబినా ఓటమిపాలైంది. దీంతో జట్టులో చోటు దక్కలేదు. కానీ, దివ్యాంశికి గాయం కావడంతో చివరి నిమిషంలో జాతీయ ఫెడరేషన్ సెలెక్టర్లు రోషిబినాను ఎంపిక చేశారు. వారి నిర్ణయం సరైందేనని ఆమె పతకంతో నిరూపించింది.

రోయింగ్‌లో పురుషుల డబుల్స్ విభాగంలో భారత అథ్లెట్లు సత్నాం సింగ్, సల్మాన్ ఖాన్ కాంస్యం సాధించారు. మొదటి 1500 మీటర్ల వరకు రెండో స్థానంలో సాగిన భారత ద్వయం.. ఆఖరి 500 మీటర్ల పోటీలో మూడో స్థానానికి పడిపోయింది. దీంతో కాంస్యంతో సరిపెట్టు కోవాల్సి వచ్చింది.

# పసిడి పోరుకు రోషిబినా


ఆసియా క్రీడల్లో వుషులో ఇప్పటికే పతకం ఖాయం చేసుకున్న రోషిబినా దేవి.. పసిడికి అడుగు దూరంలో నిలిచింది. మహిళల 60 కేజీల విభాగం సెమీఫైనల్లో ఆమె 2–0తో తానియా (ఇండోనేసియా)ను చిత్తు చేసింది. పసిడి కోసం జాంగ్ (చైనా)తో రోషిబినా అమీతుమీ తేల్చుకోనుంది. రోషిబినా.. ఆసియా క్రీడల్లో 2018లో కాంస్యం, 2022లో రజతం గెలుచుకుంది.

మణిపూర్ బిష్ణుపూర్ జిల్లాలోని మారుమూల ప్రాంతం నుంచి వచ్చి అంతర్జాతీయ స్థాయి అథ్లెట్‌గా ఎదిగిన రోషిబినా దేవి ప్రయాణం స్ఫూర్తిదాయకం. అక్కడ రెండు తెగల మధ్య ఎప్పుడూ ఘర్షణలు జరుగుతూ ఉండేవి. ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఒత్తిడితో కూడిన వాతావరణంలో.. రైతు కుటుంబంలో రోషిబినా పెరిగింది. చిన్నప్పుడు తోటి పిల్లల మాదిరే రోషిబినా కూడా బాక్సింగ్‌వైపు అడుగులు వేసింది. కానీ వుషును చూశాక ఆమె ఆలోచన మారింది. బాక్సింగ్, కిక్ బాక్సింగ్, రెజ్లింగ్‌లను మేళవించిన వుషు ఆట రోషిబినాను ఎంతో ఆకర్షించింది. సోదరుడు ప్రియోజిత్ సింగ్ సాయంతో ఈ ఆటలోకి వచ్చింది. బాక్సింగ్‌ను పూర్తిగా పక్కన పెట్టేసిన ఆమె నెమ్మదిగా వుషులో ఎదిగింది. 2016లో బర్గస్ ప్రపంచ జూనియర్ వుషు క్రీడల్లో 48 కేజీల విభాగంలో కాంస్యం గెలవడం రోషిబినా ఆత్మవిశ్వాసాన్ని ఎంతో పెంచింది. 2017 దక్షిణ ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన ఆమె... అదే ఉత్సాహంతో 2018 జకార్తా ఆసియా క్రీడల్లో సత్తా చాటింది. సండా 60 కేజీల కేటగిరిలో కాంస్యంతో మెరిసింది. అప్పుడు ఆమె వయసు 17 ఏళ్లే. 2022 ఆసియా క్రీడల్లో మరో అడుగు ముందుకేసి రజతాన్ని సొంతం చేసుకుంది.



# మీరా..మిలమిల

మీరాబాయి చాను కల నెరవేరింది.. భారత కరవు తీరిపోయింది..! ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకాలు అందుకున్నా.. అందని ద్రాక్షలా ఊరిస్తున్న ఆసియా క్రీడల పతకాన్ని స్టార్ లిఫ్టర్ మీరా ఎట్టకేలకు ఒడిసిపట్టింది. బంగారు అంచనాలతో బరిలో దిగిన ఈ మణిపురి అమ్మాయి రజతంతో మెరిసింది. 28 ఏళ్ల సుదీర్ఘ విరామానంతరం ఆసియా క్రీడల వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్‌కు లభించిన పతకం ఇది. మొత్తం అయిదు పతకాలు మన ఖాతాలో చేరాయి.షూటింగ్‌లో పురుషులు, మహిళల జట్లు కాంస్యాలు గెలవగా.. బ్యాడ్మింటన్‌లో పురుషుల జట్టుకు, సాఫ్ట్ టెన్నిస్‌లో జయ్ మీనాలకు కాంస్యాలు దక్కాయి. స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను అదరగొట్టింది. ఆసియా క్రీడల్లో తొలిసారి పతకం గెలుచుకుంది. 49కేజీల విభాగంలో ఆమె బుధవారం రజతం సాధించింది. చాను 198 కిలోలు ఎత్తి రెండో స్థానంలో నిలిచింది. ఆమె స్నాచ్‌లో 87 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 111 కిలోలు లేపింది. మల్లీశ్వరి (1998) తర్వాత ఏషియాడ్‌లో పతకం గెలిచిన భారత తొలి వెయిట్‌లిఫ్టర్‌గా చాను ఘనత సాధించింది. ఉత్తర కొరియాకు చెందిన రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్ రి సాంగ్ గమ్ 215 (94+ 121కేజీ) కిలోలు లేపి, స్వర్ణం గెలుచుకుంది. ఆసియా క్రీడల్లో ఆమెకిది హ్యాట్రిక్ టైటిల్. పసిడి గెలిచే క్రమంలో రి.. స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్, టోటల్‌లో ప్రపంచ రికార్డులు బద్దలు కొట్టింది. ఇండోనేసియా అమ్మాయి లులుక్ డియానా త్రి విజయానా 191 (88కేజీ+103కేజీ) కిలోలతో కాంస్య పతకం గెలుచుకుంది. టోక్యో ఒలింపిక్స్‌లో రజతం గెలిచిన చాను.. ఇప్పుడు ఏషియాడ్‌లో ఆత్మవిశ్వాసంతో సాగింది.




# 'రుద్ర' పాత్రలో సంచలనాలకు సిద్ధమవుతున్న మహేష్!



**వుదయం సినిమా:** దర్శకధీరుడు రాజమౌళి, సూపర్‌స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అంతర్జాతీయ స్థాయి సాహస చిత్రం 'వారణాసి' గురించి రోజూ ఒక ఆసక్తికరమైన వార్త బయటకు వస్తూనే ఉంది. వేయి కోట్ల రూపాయలకు పైగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో మహేష్ 'రుద్ర' అనే అత్యంత శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నారు. అయితే ఈ సినిమాలో ప్రేక్షకులకి కన్నుల పండుగగా నిలిచే ఒక పెద్ద ఆశ్చర్యం దాగి ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. చిత్రంలోని కొన్ని అత్యంత కీలక సన్నివేశాల కోసం మహేష్ బాబు కేవలం 24 ఏళ్ల యువకుడి రూపంలో కనిపించబోతున్నారు. సాధారణంగా సినిమాల్లో నటులను బాగా చిన్న వయస్కులుగా చూపించడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, గ్రాఫిక్స్ విధానాలను వాడుతుంటారు. కానీ జక్కన్న రాజమౌళి మాత్రం ఎటువంటి కృత్రిమ గ్రాఫిక్స్ సాయం లేకుండా, కేవలం సహజ సిద్ధమైన మేకోవర్‌తోనే మహేష్‌ను అంతటి చిన్న వయస్కుడిగా తెరపై ఆవిష్కరించబోతున్నారు. ఈ ప్రత్యేక రూపాంతరం కోసం మహేష్ బాబు తన శరీర దారుఢ్యంపై ప్రత్యేక దృష్టి సారించడమే కాకుండా, కేశాలంకరణ, దుస్తుల ఎంపిక, ముఖాలంకరణల్లో భారీ మార్పులు చేసుకున్నారు. అంతటితో ఆగకుండా నడక, పరుగు, హావభావాల విషయంలోనూ ముప్పై ఏళ్ల క్రితం నాటి బాడీ లాంగ్వేజ్‌ను ప్రతిబింబించేలా ప్రత్యేక శిక్షణ కూడా తీసుకున్నారు.ఈ కొత్త రూపం 'మురారి', 'ఒక్కడు' సినిమాల కాలం నాటి మహేష్‌ను గుర్తుకు తెస్తుందని సమాచారం. వయసుతో సంబంధం లేని మహేష్ అందం ఈ సన్నివేశాలకు అతిపెద్ద బలంగా మారనుంది. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇందులో మహేష్ బాబుకు జోడీగా ప్రియాంకా చోప్రా నటిస్తుండగా, మలయాళ కథానాయకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతి నాయకుడి పాత్రలో అలరించనున్నారు.

వుదయం సినిమా MOVIE TIME!

# 'డ్రాగన్' షూటింగ్‌కు ముహూర్తం ఖరారు



**వుదయం సినిమా:** గత కొన్ని నెలలుగా గాయం కారణం గా పూర్తి విశ్రాంతి తీసుకుంటు న్న ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ ఎట్టకేలకు తిరిగి చిత్రీకరణలో పాల్గొనేందుకు సిద్ధమ య్యారు. దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో రూపుదిద్దుకుంటున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'డ్రాగన్' సెట్స్‌లోకి ఆయన అక్టోబర్ మొదటి వారంలో అడుగుపెట్టనున్నారు. ఎన్టీఆర్ విశ్రాంతిలో ఉన్న సమయంలో ఆయన అవసరం లేని ఇతర సన్నివేశాలను పూర్తి చేసిన చిత్ర బృందం, ఆయన రాకతో విరామం లేకుండా వరుస చిత్రీకరణ షెడ్యూళ్లను వేగవంతం చేయడానికి పక్కా వ్యూహాన్ని సిద్ధం చేసింది.హీరో అందుబాటులో లేకపోవడం వల్ల చిత్ర నిర్మాణంలో కొంత జాప్యం జరిగినప్పటికీ, ముందుగా నిర్ణయించిన గడువు ప్రకారమే 2027 జూన్ 11వ తేదీన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. అంతర్జాతీయ మాఫియా నేపథ్యంలో ప్రశాంత్ నీల్ మార్కు అద్భుతమైన సన్నివేశాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఎన్టీఆర్ సరసన రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తుండగా, అనిల్ కపూర్, బిజూ మీనన్, ఖుష్బూ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# 'సిగ్మా'లో ఇప్పటివరకూ చేయని డిఫరెంట్ క్యారెక్టర్ చేశాను..




**వుదయం సినిమా:** సందీప్ కిషన్ యాక్షన్-అడ్వెంచర్ హీస్ట్ కామెడీ ఎంటర్టైనర్ 'సిగ్మా'. ఈ సినిమాతో జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఫారియా అబ్దుల్లా హీరోయిన్. అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ ఫారియా అబ్దుల్లా విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**సిగ్మా జర్నీ గురించి?**

-సిగ్మా నా ఫస్ట్ తమిళ్ సినిమా. లైకా లాంటి పెద్ద ప్రొడ్యూసర్స్ బ్యానర్‌లో అవకాశం రావడం చాలా హ్యాపీగా ఉంది. ఇది మంచి యాక్షన్-అడ్వెంచర్ హీస్ట్ కామెడీ ఎంటర్టైనర్. మంచి టెక్నీషియన్స్, నటీనటులు ఈ సినిమాకి పనిచేశారు.

**మత్తు వదలరా నుంచి మీరు కాస్త యాక్షన్ వైపు ఆసక్తి చూపిస్తున్నారు అని పిస్తుంది?**

-యాక్షన్ నా పర్సనాలిటీకి కూడా నప్పుతుంది. నాకు అన్ని రకాల సినిమాలు చేయాలనుంది. యాక్షన్ సినిమాలు చేయడం కూడా ఇష్టపడతాను.

**జేసన్ గారు కథ చెప్పినప్పుడు ఎలా అనిపించింది?**

-జేసన్ జూమ్ కాల్‌లో కథ చెప్పారు. కథ మొత్తం విన్న తర్వాత ఆయన ఏజ్ ఎంత అని అడిగాను. 24 ఏళ్లు అని చెప్పారు. నాకు చాలా ఇన్‌స్పైరింగ్‌గా అనిపించింది. తను విజయ్ గారి అబ్బాయి. కాకపోతే అలాంటి ఫీలింగ్‌ను మనలో కలిగించరు. చాలా వినయంగా ఉంటారు. అందరితో ఫ్రెండ్లీగా కలిసిపోతారు.

**ఈ ట్రైలర్ రాజమౌళి గారు రిలీజ్ చేశారు కదా.. ఆయన ఎలాంటి ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు?**

-ఒక మంచి కమర్షియల్ ఎంటర్టైనర్‌లా ఉంది అని చెప్పారు. ఈ సినిమా చేస్తున్నప్పుడు మీరందరూ చాలా ఫన్నీ ఎక్స్‌పీరియన్స్ చేసుంటారని అన్నారు. నిజంగానే మేము చాలా ఎంజాయ్ చేస్తూ చేశాం. నాకు సిగ్మా 2 కూడా చేయాలని ఉంది. ఈ సినిమాను ప్రేక్షకులు అద్భుతంగా ఆదరిస్తే సిగ్మా 2 చేసే అవకాశం కూడా ఉందని భావిస్తున్నాను. కాకపోతే ఈ కథ ఇక్కడితో క్లోజ్ అవుతుంది.

**తమిళ్‌కి వెళ్లారు కదా.. అక్కడి పరిశ్రమకు, ఇక్కడి పరిశ్రమకు ఏదైనా తేడా గమనించారా?**

-పరిశ్రమ ఒకలాగే ఉంది. కాకపోతే ఆహారపు అలవాట్లు కొంచెం భిన్నంగా ఉన్నాయి. సిగ్మా లాంటి మంచి ప్రాజెక్ట్ తో తమిళ్ లో పరిచయం కావడం హ్యాపీగా ఉంది.

**తమన్ మ్యూజిక్ గురించి?**

తమన్ గారి బీజీఎం నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. ఆయన సిగ్నేచర్ మీకు కనిపిస్తుంది. ఇందులో చివర్లో సిగ్మా స్టైల్ పాట ఉంది. ఆ పాటను చాలా ఎంజాయ్ చేస్తూ చేశాను. పాటలు రీచ్ అవ్వడం నాకు అడ్వాంటేజ్‌గా అయింది.

**మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమాను రిలీజ్ చేయడం ఎలా అనిపిస్తుంది?**

చాలా హ్యాపీగా ఉంది. ఇది నాకు వాళ్లతో రెండో సినిమా.

**దర్శకత్వం చేసే ఆలోచన వుంది?**

-నాకు దర్శకత్వం పై ఆసక్తి ఉంది. కొన్ని కథలు రాస్తున్నాను. కాకపోతే దానికి ఇంకా సమయం వుంది. నేను దర్శకత్వం చేస్తే సినిమాలో నేను నటిస్తాను.

**తమిళ్‌లో కొత్త ఆఫర్స్ వచ్చాయా?**

-కొన్ని కథలు విన్నాను. సిగ్మా రిలీజ్ అయిన తర్వాత వాటి గురించి ఒక నిర్ణయం తీసుకుంటాను.

# 'జార్జ్ క్రిష్' హ్యూమర్ ప్యాక్డ్ ఫస్ట్ బూస్టర్ రిలీజ్



**వుదయం సినిమా:** వరుసగా రెండు హిట్లు కొట్టిన చార్మింగ్ స్టార్ శర్వా, శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జార్జ్ క్రిష్' తో హ్యాట్రిక్ హిట్ పూర్తి చేయడానికి సిద్ధమవుతున్నాడు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్ మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఏటీవీ సమర్పిస్తుండగా, అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. వినోదాత్మక ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో శర్వా సరసన మానస వారణాసి కథానాయికగా నటిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. దర్శకుడు శ్రీను వైట్ల పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ 'జార్జ్ క్రిష్' ఫస్ట్ బూస్టర్‌ను విడుదల చేశారు. శ్రీను వైట్ల సినిమాల నుంచి ప్రేక్షకులు ఆశించే హ్యూమర్, ఫన్ ఈ బూస్టర్‌లో పుష్కలంగా కనిపించింది. ఇందులో శర్వానంద్‌ను రెండు విభిన్న మతాలకు చెందిన పాత్రల్లో పరిచయం చేశారు. క్రిస్టియన్‌గా జార్జ్, హిందువుగా క్రిష్ పాత్రల్లో శర్వా అలరించారు. పూర్తిగా భిన్నమైన పరిస్థితుల్లో ఈ రెండు పాత్రలను చూపిస్తూ క్యూరియాసిటీ పెంచారు. రెండు పాత్రల్లోనూ శర్వానంద్ భక్తిలో పూర్తిగా లీనమై కనిపిస్తున్నారు. ఆధ్యాత్మిక భావోద్వేగంతో కనిపించే శర్వా.. తన కామిక్ ఎక్స్‌ప్రెషన్స్‌తో నవ్వులు పూయించారు. రెండు పాత్రల చుట్టూ ఉన్న విభిన్న పరిస్థితులు ఏంటి? అనే ఆసక్తిని క్రియేట్ చేస్తూనే.. సినిమాలోని యూనిక్ హ్యూమర్‌కు ఫస్ట్ బూస్టర్ ఒక గ్లింప్స్ ఇచ్చింది.ఈసారి శ్రీను వైట్ల కొత్త బ్యాక్‌డ్రాప్, డిఫరెంట్ కథాంశాన్ని ఎంచుకుని, ఆయన సినిమాల నుంచి ప్రేక్షకులు ఆశించే ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడం లక్ష్యంగా ఈ సినిమా తెరకెక్కుతున్నట్లు బూస్టర్ చూస్తే అర్థమవుతోంది.శర్వానంద్ ఇందులో డిఫరెంట్ గెటప్స్‌లో కనిపించబోతున్నారు. ఆయన స్టైలిష్ కార్పొరేట్ లుక్ ఆకట్టుకుంటోంది. చార్మింగ్ స్టార్ ఇమేజ్‌కు ఈ లుక్ పర్ఫెక్ట్‌గా సరిపోతుంది. హీరోయిన్ మానస వారణాసి కూడా గ్లామరస్‌గా కనిపించారు. లీడ్ పెయిర్ మధ్య ఉండే కాంటెంపరరీ లవ్ ట్రాక్‌కి సంబంధించిన గ్లింప్స్‌ను కూడా ఫస్ట్ బూస్టర్‌లో చూపించారు.అనూప్ రూబెన్స్ ఎనర్జిటిక్, లైవ్లీ మ్యూజికల్ స్కోర్‌తో ఫస్ట్ బూస్టర్‌కు మరింత జోష్ తీసుకొచ్చారు. కేవీ గుహన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్. అమర్ రెడ్డి కుడుముల ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.

# అక్టోబర్ 16న 'నాన్న కుట్టి'

**వుదయం సినిమా:** కంటెంట్ బేస్డ్ చిత్రాల్ని చేస్తూ విజయ్ ఆంటోని తనకంటూ ఓ మంచి బ్రాండ్‌ను క్రియేట్ చేసుకున్నారు. అలాంటి విజయ్ ఆంటోని ప్రస్తుతం 'నాన్న కుట్టి' అంటూ ఆడియెన్స్ ముందుకు రానున్నారు. ఫాదర్ అండ్ డాటర్ సెంటిమెంట్‌తో ము. మారన్ దర్శకత్వంలో విజయ్ ఆంటోనీ హీరోగా చేస్తున్న చిత్రం 'నాన్న కుట్టి'. యాక్షన్, కుటుంబ భావోద్వేగాలు, ఇంటెన్స్ డ్రామాగా ఈ మూవీని రూపొందిస్తున్నారు. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్ మీద మీరా విజయ్ ఆంటోని నిర్మాతగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ మూవీకి సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ అధినేత రామంజనేయులు జవ్వాజీ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. దసరా సందర్భంగా ఈ మూవీని అక్టోబర్ 16న విడుదల చేయబోతోన్నారు. దసరా సెలవులు కలిసి వచ్చేలా ఈ మూవీ రిలీజ్‌ని ప్లాన్ చేసినట్టు కనిపిస్తోంది. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లను గమనిస్తే.. ఈ సినిమాలో తండ్రీకూతుళ్ల సెంటిమెంట్‌ని ప్రధానంగా చూపించబోతోన్నారని అర్థం అవుతోంది.ఈ చిత్రంలో ప్రీతి అస్రాని, లిథన్య, భగవతి పెరుమాళ్, హరిప్రియ ఇసై, అరువి మధన్, చిత్ర లక్ష్మణన్, శ్రీజ రవి, వెట్టై ముత్తుకుమార్, జెన్సన్ దివాకర్, మురుగానందం, మున్నార్ రమేష్, లిస్సీ ఆంటోని, కుమార్ నటరాజన్, విజయన్, ప్రవీణ, హరిత, హరిప్రియ తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు.



# తెలుగులో మంచి పర్ ఫార్మెన్స్ ఓరియెంటెడ్ క్యారెక్టర్స్ చేయాలని ఉంది - బాలీవుడ్ నటి హేమ శర్మ

**వుదయం సినిమా:** బాలీవుడ్ లో యమ్లా పగ్లా దీవాన ఫిర్ సే, వన్ డే జస్టిస్ డెలివెరడ్, దబాంగ్ 3 వంటి చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి హేమ శర్మ. ఆమె సల్మాన్ ఖాన్ హోస్ట్ గా చేసిన బిగ్ బాస్ 18 రియాల్టీ షోలో కంటెస్టెంట్ గా పాల్గొని ఆడియెన్స్ కు మరింత చేరువైంది. సోషల్ మీడియాలో వైరల్ బాబీగా ఫేమ్ అయిన హేమ శర్మ..భోజ్ పూరి లో చేసిన సాంగ్స్ ఛాట్ బస్టర్స్ అయి రికార్డ్ స్థాయి వ్యూస్ సాధించాయి. ఈ టాలెంటెడ్ యాక్ట్రెస్ ఇప్పుడు తెలుగులో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. హేమ శర్మ టాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అవుతున్న నేపథ్యంలో మీడియాతో స్పెషల్ ఇంటర్వ్యూలో మాట్లాడారు. – మాది ఢిల్లీకి దగ్గరలోని ఘజియాబాద్. సినిమాలకు ఏమాత్రం సంబంధం లేని ఫ్యామిలీ. నేను కంప్లీట్ ఔట్ సైడర్ ను. సినిమాల్లోకి రావాలని ఎప్పుడూ అనుకోలేదు. అయితే చిన్నప్పటి నుంచి డ్యాన్స్ అంటే ఇష్టం. కొరియోగ్రాఫర్ గా మారాలనే ఆసక్తి ఉండేది. అయితే డెస్టినీ నన్ను స్క్రీన్ ముందుకు నటిగా తీసుకొచ్చింది. నా లైఫ్ స్టైల్, ఫ్యాషన్, డ్యాన్స్ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వైరల్ బాబీగా నాకు పేరు తీసుకొచ్చాయి. ఆ పాపురాలిటీతో బాలీవుడ్ లో అవకాశాలు దక్కాయి. – ధర్మేంద్ర, బాబీ డియోల్, సన్నీ డియోల్, కృతి ఖర్బందా ప్రధాన పాత్రల్లో నటించిన యమ్లా పగ్లా దీవాన ఫిర్ సే సినిమాలో నాకు ఓ మంచి క్యారెక్టర్ లో నటించే అవకాశం దక్కింది.



# ఇంప్యూర్ మూవీ ట్రైలర్ ఈవెంట్ లో డైరెక్టర్ నందిని రెడ్డి



**వుదయం సినిమా:** వారాహి మల్లిపాముల, శ్రీదేవి మల్లిపాముల నిర్మించిన లేటెస్ట్ మూవీ ఇంప్యూర్. నిశాంతి ఇవని దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సాయి కృష్ణ, యష్న, అభిజిత్ ప్రధాన పాత్రల్లో నటించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్ జరుపుకుంటుంది. ఈ ఈవెంట్‌లో ట్రైలర్‌తో పాటు పాటను కూడా లాంఛ్ చేశారు. ఈ ఈవెంట్ గా స్పెషల్ గెస్ట్‌గా డైరెక్టర్ నందిని రెడ్డి వచ్చారు. ఈ ఈవెంట్‌లో నందిని రెడ్డి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ ఈవెంట్‌కి రావడానికి రెండే మేయిన్ రీజన్స్ ఉన్నాయి. ఒకటి మా బాస్ కృష్ణవంశీ గారు ఫోన్ చేసి చెప్పారు. ఆయన చెప్తే కాదనడానికి లేదు. సెకండ్ డైరెక్టర్ నిశాంతి గురించి. నిశాంతి నాకు 15 ఏళ్లుగా తెలుసు. నాకు మంచి ఫ్రెండ్. రీసెంట్‌గా మా ఇంటి బంగారంలో కలిసి చేశాము. నిశాంతికి క్యారెక్టర్ ఇంకా ఉంది. కానీ ఎడిటింగ్‌లో కట్ అయింది. సారి నిశాంతి మనం త్వరలోనే కలిసి పని చేద్దాం. ప్రతీ తెలుగు వాళ్లకు ఒక సినిమా చేయాలని డ్రీమ్ ఉంటుంది. అందుకే ప్రపంచంలో తెలుగు ఆడియెన్స్ చాలా గొప్పవాళ్లు. పృథ్వీ సార్‌ను అందరూ 30 ఇయర్స్ ఇండస్ట్రీ అంటారు. కానీ ఎవర్ గ్రీన్ పృథ్వీ. ఎందుకంటే.. తెలుగు కానీ, తమిళం కానీ.. ఏ లాంగ్వేజ్‌లో అయినా మోస్ట్ టాలెంటెడ్ యాక్టర్. ఆయన ముందే మేమందరం అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాము. ఇక శ్రీదేవి గారూ మీ అమ్మాయి డ్రీమ్ నెరవేర్చినందుకు నిజంగా మిమ్మల్ని అప్రిసియేట్ చేయాలి. పేరెంట్స్ ఎంకరేజ్ చేస్తేనే మనం ఏదైనా సాధించగలం.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.